


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం
హోర్ముజ్‌పై ఇరాన్ కొత్త నిబంధనలు 08

ఖర్గేకు చేరిన కేరళ సిఎం ఎంపిక నివేదిక 07

సంపుటి 09, సంచిక: 159 | శనివారం | 09-05-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## వామపక్షాల బలం తగ్గడం ఆందోళనకరం

భవిష్యత్తులో పుంజుకుని, ఒక కీలక రాజకీయ శక్తిగా తిరిగి ఆవిర్భవిస్తాయ్ : సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా

**న్యూఢిల్లీ :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. వామపక్ష పార్టీల బలం క్షీణించడం ఆందోళన కలిగించే విషయమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. భవిష్యత్తులో వామపక్షాలు పుంజుకుని, ఒక కీలక రాజకీయ శక్తిగా తిరిగి ఆవిర్భవిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పిటిఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రాజా మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కేవలం ఆ రాష్ట్రానికే కాకుండా, దేశం మొత్తానికి కూడా సవాళ్లను విసురుతుందని ఆయన హెచ్చరించారు. బెంగాల్‌లో బిజెపి మొదటిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఒక విచిత్రమైన పరిణామమని, తరువాయి 8లో



# అనూహ్య మలుపులు

## మద్దతుపై విసికె మెలిక

- నేడు నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి
- తొలుత టివికెకు మద్దతు లేఖ పంపిన విసికె, సిపిఐ, సిపిఐ(ఎం), విసికె మద్దతు లేఖలను గవర్నర్‌కు సమర్పించిన విజయ్
- మెజారిటీ ఉన్నా, గవర్నర్ నుండి అందని ఆహ్వానం
- తరువాత డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలని విసికె బెట్టు, అంగీకరించని టివికె
- రాత్రి స్టాలిన్‌తో విసికె నేత తిరుమావళవన్ భేటీ
- పళనిస్వామికి సిఎంగా అవకాశం ఇవ్వాలని గవర్నర్‌కు ఎఎంఎంకె లేఖ
- తీవ్ర ఉత్కంఠ రేపుతున్న తమిళనాడు రాజకీయాలు

**చెన్నై :** తమిళనాడు నూతన ప్రభుత్వ ఏర్పాటు మలుపుల మీద మలుపులు తీసుకుంటుంది. శుక్రవారం సిపిఐ, సిపిఐ(ఎం) శాసనసభ్యుల మద్దతుతో టివికె అధినేత సి.జోసెఫ్ విజయ్ ప్రభుత్వ ఏర్పాటు దాదాపు ఖాయం అయింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీల మద్దతు లేఖలతో పాటు, ఈ–మెయిల్ ద్వారా విసికె పంపిన లేఖలను విజయ్ గవర్నర్‌కు సమర్పించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 117 స్థానాలకు మించిన సంఖ్యాబలం టివికె వద్ద ఉండడంతో శనివారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారానికి టివికె ఏర్పాటు చేసింది. అకస్మాత్తుగా శుక్రవారం రాత్రి విసికె అధినేత తోల్ తిరుమావళవన్ మనస్సు మార్చుకున్నారు. దీంతో విజయ్ పార్టీ మెజారిటీకి ఒక్క ఎంఎల్‌ఎ తక్కువ పడుతున్నారు. దీంతో ఇద్దరు ఎంఎల్‌ఏలు కలిగిన విసికె కీలకంగా మారింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ పార్టీకి తరువాయి 8లో



## ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ పునరుజ్జీవనం

- సమాంతరంగా 'అభివృద్ధి – ప్రజా హితం'
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు నది ప్రక్షాళన మాత్రమే కాదు
- అది ఒక సామాజిక బాధ్యత
- రూ.7,055 కోట్లతో ఐదు కిలోమీటర్ల పరిధిలో మొదటి దశ పనులు
- కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని, వారిని భాగస్వాములను చేయడమేనని అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామిక పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేసింది. మూసీ పునరుజ్జీవనం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బస్టాండ్‌లు, ప్రధాన రహదారుల్లో హోర్డింగ్స్‌తో పాటు సినిమా థియేటర్‌లలో వీడియో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. పర్యావరణ అనుమతులు పొందుతూ, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి హైదరాబాద్ రూపురేఖలను మార్చాలని కమిటీ దిశానిర్దేశం చేసింది.

**ఎడిబి నిధులతో మొదటి దశ పనులు..**

ఈ ప్రాజెక్టును మొత్తం ఐదు దశల్లో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం తరువాయి 8లో

## కాలయాపన చేయొద్దు

- ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి
- ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక సమావేశం నిర్వహించాలి
- ముఖ్యమంత్రికి సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలని, వరి ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలులో తలెత్తుత్తున్న సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం సిఎంకు ఆయన లేఖ రాశారు. సాంకేతిక కారణాలు, నాణ్యతా ప్రమాణాల పేరుతో కాలయాపన చేయకుండా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని లేఖలో సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యంతో వెళ్ళిన లారీలు సకాలంలో ఖాళీ కాకపోవడం ధాన్యం కొనుగోలుకు ప్రధాన అడ్డంకిగా తరువాయి 8లో

## లౌకిక, ప్రజాతంత్ర సుస్థిర ప్రభుత్వం కోసమే

**టివికెకు సిపిఐ మద్దతు లేఖ**

**న్యూఢిల్లీ :** తమిళనాడు అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీకి అనుకూలంగాప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టడానికి, తమిళనాడు లౌకిక, సమానత్వవారసత్వాన్ని తరువాయి 8లో


చెన్నైలోని సిపిఐ కార్యాలయానికి వెళ్ళిన టివికె చీఫ్ విజయ్





## నారాయణపేట ఎత్తిపోతల ద్వారా కొడంగల్‌కు నీళ్లు

- నెలరోజుల్లోనే భూసేకరణ పూర్తి చేశాం
- నియోజకవర్గానికి కృష్ణా జలాలు అందించడమే నా లక్ష్యం
- వచ్చే ఆరు నెలల్లో సిమెంటు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేస్తాం
- కొడంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాలు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం /వికారాబాద్

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గానికి కృష్ణా జలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ , నారాయణపేట్ ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు ఇస్తామన్నారు. కొడంగల్ భూములు కృష్ణా జలాలతో తడవాలి అన్నారు. నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ నెలల్లో పూర్తి చేశామన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహా, వాకిటి శ్రీహరితో కలసి రూ.110కోట్ల నిధులతో కొడంగల్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయల పునర్నిర్మాణ పనులకు, 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి అలయం, కోస్గి వేణుగోపాల స్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కొడంగల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తెలంగాణతో పాటు కర్ణాటక, మహరాష్టలకు కూడా పేదల తిరుపతిగా పేరుగాంచిందన్నారు. 2009లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలవడానికి ఎంత మంది కార్యకర్తలు తమ చెమటను రక్తంగా మార్చి పనిచేశారు. కొడంగల్ శాసనసభ నియోజకవర్గం అంటే ఒకవైపు గుడి, మరోవైపు గడి అన్నారు. గుడి, తరువాయి 12లో


సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ శుక్రవారం సిపిఐ ప్రధాన కార్యాలయం అజయ్ భవన్'ను సందర్శించారు. ఆయనకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, అన్నీ రాజా, కె. రామకృష్ణ స్వాగతం పలికారు. దేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై ఇరు పార్టీల నాయకత్వం చర్చలు జరిపింది.

## రైల్వేల్లో ఉద్యోగాల కోతలు కేంద్ర సర్కార్ కుట్ర

- ప్రైవేటీకరణ దిశగా నెట్టివేసే యత్నం
- యువత భవిష్యత్తుతో చెలగాటం
- ఎఐవైఎఫ్ ఆగ్రహం : రైల్ నిలయం ముందు శ్రేణుల నిరసన
- రెండు శాతం ఉద్యోగాల కోత ఉపసంహరించుకోవాలని డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్

రైల్వేలో ఉద్యోగాల కోతలు మోదీ ప్రభుత్వ కార్పొరేట్ కుట్ర అని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తూ, రైల్వేలను ప్రైవేటీకరణ దిశగా నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ వనరుల హేతుబద్దీకరణ పేరుతో రైల్వేలో 2 శాతం ఉద్యోగాల కోత విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే తరువాయి 8లో

నాణ్యమైన విద్య అందించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు 03

## సమయం పాటించరా?



- సచివాలయంలో మంత్రుల పేషీల్లో అధికారులు, ఉద్యోగులు నిబంధనల ఉల్లంఘన
- పనిగంటలు ముగియకముందే కార్యాలయాలకు తాళాలు
- సెక్రటేరియట్‌కు వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి
- కనిపించని పారదర్శకత, ప్రజాసేవ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రుల పేషీల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమయపాలనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్యాలయ పని గంటలు ముగియకముందే కొంత మంది సిబ్బంది కార్యాలయాలను మూసివేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రులు, ఉన్నతాధికారులు కార్యాలయం విడిచిన వెంటనే పేషీలలో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది కూడా ఆలస్యం చేయకుండా తాళాలు వేసి వెళ్లిపోతున్నట్లు సమాచారం. సమస్యలు వినిపించేందుకు, ఫైళ్ల పరిష్కారం కోసం సెక్రటేరియట్‌కు వచ్చే ప్రజలకు ఇది ఇబ్బందికరంగా మారుతోంది. నిర్ణీత సమయాల్లో వచ్చినప్పటికీ పేషీలు మూసివేసి ఉండటంతో పలువురు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. పని గంటలు పూర్తికాక ముందే కార్యాలయాలు మూసివేయడం సరైంది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సిబ్బంది మాత్రం మంత్రులు వెళ్లిపోయిన తర్వాత పనులు ఉండవు అనే కారణంతో ముందుగానే వెళ్లిపోతున్నారని అంటున్నారు. అయితే, ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన తప్పనిసరి అనే నిబంధనలు తరువాయి 12లో



## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

నేడు కొలువుదీరనున్న బిజెపి తొలి సర్కార్

**కోల్‌కతా :** బెంగాల్‌లో తొలి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. తన రాజకీయ గురువు మమతా బెనర్జీపై ఘనవిజయం సాధించిన సువేందు అధికారిని బిజెపి అధిష్ఠానం ఖారారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు సువేందును శాసన సభాపక్షనేతగా ఎన్నుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి, బిజెపి అగ్రనేత అమిత్ షా కొత్తగా ఎన్నికైన పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయి సువేందు అధికారి తరువాయి 12లో

## తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు ప్రజా ప్రభుత్వం కృషి

మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్

ప్రజాపక్షం/ కౌటాల/ కాగజ్ నగర్

సాగునీటి రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం తుమ్మిడిహెట్టిని సందర్శించిన మంత్రులు ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ప్రాజెక్ట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బరాజ్ ఎత్తు, సాగునీటి పారుదల పనులు, అటవీ పర్యావరణ అనుమతులపై అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ పాలకులు పక్కనబెట్టిన ప్రాణహిత ప్రాజెక్టుకు పునరుజ్జీవం పోయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాళేశ్వరం



పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి ఖజానాకు గండి కొట్టారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి నిర్మిస్తే విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం కమిషన్ల కోసమే ప్రాజెక్టును తరువాయి 12లో

# తమిళనాడులో శుభం కార్డ్

తమిళనాడులో నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుపై నాలుగురోజులుగా సాగుతున్న ఉత్కంఠభరిత హైడ్రామాకు శుక్రవారం మధ్యాహ్నం శుభం కార్డ్ పడింది. సినీ హీరో, తమిళగ వెట్రి కళగం(టివికె) పార్టీ వ్యవస్థాపకుడు జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం స్వీకరించేందుకు మార్గం సుగమమైంది. సిపిఐ, సిపిఐ(ఎం), విసికె పార్టీలు ప్రభుత్వ ఏర్పాటుకు టివికె పార్టీకి తోడ్పాటు ప్రకటించటంతో ఆ పార్టీ అసెంబ్లీలో కనీస మెజారిటీకి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118ని చేరుకుంది. 234 స్థానాలుగల అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలు గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించటం, డిఎంకె కూటమిలో భాగస్వామిగా 5స్థానాలు గెలిచిన కాంగ్రెస్ వెనువెంటనే విజయ్‌కు తోడ్పాటు ప్రకటించటంతో ఆ సంఖ్య 113కు చేరుకుంది. అయితే విజయ్ గెలిచిన రెండు నియోజకవర్గాల్లో, ఏదో ఒకదానికి రాజీనామా చేయవలసి ఉన్నందున ఆ పార్టీ శాసనసభ్యుల నికర సంఖ్య 112కు తగ్గింది. ఇది మ్యాజిక్ ఫిగర్‌కు చేరేలోపు సంభవించిన నాటకీయ పరిణామాలు తమిళనాడులోనే సాధ్యం. గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ వైఖరి, ప్రజాతీర్పును వమ్ముచేసే చేతులు కలిపేందుకు అగ్ర శత్రువులైన డిఎంకె, ఎఐఎడిఎంకె చేసిన ప్రయత్నాలు అవకాశవాదానికి పరాకాష్ట అనవచ్చు. టివికె పార్టీకి తోడ్పాటునిస్తూ విసికె సహా వామపక్ష పార్టీలు తీసుకున్న నిర్ణయం ఆ ప్రయత్నాలన్నిటినీ భగ్నం చేసింది. మెజారిటీ ప్రజల అభీష్టం ప్రకారం ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసింది.

తమిళనాడులో ఈ పరిణామాలకు ముందుగా చెప్పుకోవలసింది ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో గవర్నర్ వైఖరి, డిఎంకె కూటమి నుంచి టివికె పార్టీవైపు కాంగ్రెస్ దుమికిన తీరు. ఓటర్లు ఏ పార్టీ లేదా కూటమికి మెజారిటీ ఇవ్వలేదు. సాధారణంగా ఏదో ఒక పార్టీవైపు మొగ్గుచూపే తమిళ ఓటర్ల తీరులో ఇదే పెద్ద మార్పు. 1960వ దశకంలో కాంగ్రెస్–డిఎంకె, డిఎంకె నుంచి బహిష్కరించబడిన వెండితెర వేల్పు ఎం.జి.రామచంద్రన్ 1972 అక్టోబర్‌లో అఖిల భారత అన్నా డిఎంకె(ఎఐఎడిఎంకె) ఏర్పాటు చేసిన తదుపరి డిఎంకె–ఎఐఎడిఎంకె మధ్య, ఎంజిఆర్ మరణానంతరం వెండితెర కథానాయిక జె.జయలలిత చేతిలోకి ఎఐఎడిఎంకె వచ్చాక డిఎంకె – ఎఐఎడిఎంకె మధ్య తమిళ ఓటర్లు విభజన చెందారు. కాంగ్రెస్ పార్టీ ఆ రెండు పార్టీలతో అటోఇటో పొత్తు కొనసాగిస్తూ వచ్చింది. ఈ 2026 ఎన్నికల్లో సినీ హీరో విజయ్ ఆ రెండు ద్రవిడ పార్టీల మధ్యలోకి తృతీయ శక్తిగా ప్రవేశించారు. డిఎంకె, ఎఐఎడిఎంకె కూటములు అతన్ని సీరియస్‌గా తీసుకోని ఫలితాన్ని అనుభవించాయి. ముఖ్యంగా యువ ఓటర్లు, మహిళలు, ఇతర సామాజిక సమూదాయాల్లో కొన్ని విభాగాలు విజయ్ పార్టీని అధికార గుమ్మం వరకు చేర్చాయి.

అప్పుడు మొదలైంది గవర్నర్ ఆట. పార్లమెంటరీ సంప్రదాయాలు, సుప్రీం కోర్టు తీర్పు (ఎస్.ఆర్.బొమ్మయ్ కేసు)కు వ్యతిరేకంగా మ్యాజిక్ ఫిగర్ 118 మంది శాసనసభ్యుల తోడ్పాటును రుజువు చేసుకుంటేనే మంత్రివర్గం ఏర్పాటుకు ఆహ్వానం ఉంటుందని విజయ్‌కు షరతు పెట్టారు. ఏ పార్టీకి మెజారిటీ సీట్లు లభించనపుడు ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించటం, 10–15 రోజుల్లో సభ లో మెజారిటీ నిరూపించుకోవాలని ఆదేశించటం ఈ దేశంలో అమలు జరుగుతున్న సాంప్రదాయం. 1996లో ప్రధానిగా వాజ్‌పేయ్ నుంచి యడ్యూరప్ప, ఫడ్నవీస్ వరకు పలువురు ఈ తీరునే అధికారంలోకి వచ్చారు. కొందరు సభలో విశ్వాస ఓటు నెగ్గారు, వాజ్‌పేయి సహా కొందరు రోజుల్లో (13 రోజులు), ఫడ్నవీస్ అయితే గంటల్లో పదవికి రాజీనామా చేశారు. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా బలాబలాల పరీక్ష వేదిక చట్టసభలు తప్ప రాజ్‌భవన్ (ఇప్పుడు లోక్‌భవన్)లు కాదనే సూత్రాన్ని అప్పటి రాష్ట్రపతి, గవర్నర్లు పాటించారు. కాని ఈ అర్లేకర్ తద్విరుద్ధంగా సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు తన బాధ్యత అంటూ గురువారం కూడా విజయ్‌నుంచి 118 మంది మద్దతు కోరారు. ప్రభుత్వం ఏర్పాటుకు మరేపార్టీ ముందుకురాని స్థితిలో గవర్నర్ వైఖరి దారుణం. ఈ అప్రజాస్వామిక వైఖరి సొంత నిర్ణయమా, లేక కేంద్రం నుంచి అందిన డైరెక్షనా అనే అనుమానాలు బయలుదేరాయి. న్యాయకోవిదులు, రాజకీయ పార్టీలు ఖండించాయి. తాము గెలిపించింది ఒక్క సీటే అయినా తమ కూటమి నాయకుడు పళనిస్వామి ద్వారా రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యాన్ని బిజెపి కోరుకుంది.

తమతో కలిసిరాని విజయ్‌ని అధికారానికి దూరంచేసే, ఎఐఎడిఎంకె, డిఎంకె ప్రభుత్వం ఏర్పాటుకు దోహదం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదన్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ, గురువారం మధ్యాహ్నం నుంచి డిఎంకె, ఎఐఎడిఎంకె శిబిరాల్లో కదలికలు మొదలైనాయి. పళనిస్వామి (ఎఐఎడిఎంకె) ముఖ్యమంత్రి పదవికి బాహ్య తోడ్పాటు ఇచ్చేందుకు డిఎంకె అధినేత స్టాలిన్ సిద్ధమైనాడు. దీన్ని కనిమొళి వ్యతిరేకించారని, ఉదయనిధి ఆమె ఇంటికి వెళ్లి నచ్చజెప్పారని వార్తలు వచ్చాయి. పళనిస్వామి తమ ఎమ్మెల్యేలకు చెప్పినట్లు 'అద్భుతం' జరగలేదు. స్టాలిన్ చెప్పినట్లు సీనియర్ నాయకుల నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిన పరిస్థితి తలెత్తలేదు.

వామపక్షాల తోడ్పాటుపై విజయ్ ప్రభుత్వ అవకాశాలు ఆధారపడి ఉన్నందున అవి తులనాత్మకంగా ఆలోచించాల్సి వచ్చింది. రాష్ట్రంలో అస్థిరతను నివారించాలి, ప్రజాతీర్పును గౌరవించాలి, అదే సమయంలో డిఎంకె కూటమిలో భాగస్వామిగా ఉన్నందున వారి అభిప్రాయాన్ని గౌరవించాలి. ఈ పరిస్థితుల్లో సిపిఐ, సిపిఎం నేతలు స్టాలిన్‌ను కలిసి చర్చించారు. ఆ తదుపరి శుక్రవారం ఉదయం రెండు పార్టీల కార్యదర్శులు తమ రాష్ట్ర కమిటీల్లో చర్చించి – బిజెపి కుట్రలు నిరోధించేందుకు, ప్రజాస్వామ్యబద్ధంగా విజయ్ నాయకత్వంలో టివికె ప్రభుత్వం ఏర్పాటుకు బేషరతు తోడ్పాటు ఇస్తూ గవర్నర్‌కు లేఖలు పంపారు. మంత్రివర్గంలో చేరబోమని సూత్రబద్ధ నిర్ణయం తీసుకున్నాయి. గవర్నర్ పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం – ఏకైక పెద్ద పార్టీ అయిన టివికెను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించి ఉంటే పరిణామాలు వేరుగా ఉండేవి. కాంగ్రెస్ పార్టీ తొందరపాటుతో ముందే చెప్పాపెట్టకుండా డిఎంకె కూటమి నుంచి వైదొలగటం జాతీయ స్థాయిలో 'ఇండి' కూటమికి హాని చేసింది.

పార్లమెంటులో తమ పార్టీకి ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని కనిమొళి స్పీకర్‌కు లేఖ రాయటం ద్వారా తమ పార్టీ 'ఇండి' కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు స్పష్టం చేశారు.



## ప్రజాగ్రహం ఎదుర్కొనక తప్పదు

**ఎన్నికలను దొంగిలించడానికి బిజెపి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. లక్షలాది పేర్లను తొలగించింది. వారు ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదు. హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో, ఇప్పుడు అసోం, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఎన్నికలను దొంగిలించింది. ఎన్నికల సంఘం వారి నియంత్రణలో ఉంది. అధికార యంత్రాంగం వారి అదుపులో ఉంది. ఇక తమ పాలన ఆగదని వారు భావిస్తున్నారు. నరేంద్ర మోదీ ఎక్కువ కాలం అధికారంలో ఉండలేరు. ఎందుకంటే ప్రజల్లో ఇంత కోపం ఉంది. భారతదేశంలో ఏమి జరగబోతోందో ప్రజలే నిర్ణయిస్తారు.**

- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

# అభివృద్ధి ముసుగులో అణచివేత!

భారతదేశాన్ని అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మారుస్తామన్న నినాదంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు తెస్తున్న కార్మిక సంస్కరణలు, వాస్తవానికి కార్మికుల హక్కుల సమాధిపై నిర్మిస్తున్న కార్పొరేట్ కోటలుగా కనిపిస్తున్నాయి. సంస్కరణలనేవి వ్యవస్థను మెరుగుపరచడానికి ఉండాలి కానీ, దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కనీస రక్షణ కవచాలను తొలగించడానికి కాకూడదు. ప్రస్తుతం కేంద్రం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్‌లు పారిశ్రామికాభివృద్ధి పేరిట శ్రామిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కుట్రగా పరిణమించాయి. ప్రజాస్వామ్య దేశంలో ఆర్థిక వృద్ధి అంటే కేవలం కంపెనీల బ్యాలెన్స్ షీట్లు పెరగడం కాదు, ఆ సంపద సృష్టిలో భాగస్వాములైన కార్మికుల జీవితాల్లో వెలుగు నిండటం. కానీ కేంద్రం వైఖరి మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఈ నూతన సంస్కరణల్లో అత్యంత వివాదాస్పదమైన అంశం 'హైర్ అండ్ ఫైర్' (అవసరమైనప్పుడు తీసుకోవడం, వద్దనుకున్నప్పుడు తీసేయడం) విధానానికి చట్టబద్ధత కల్పించడం. గతంలో 100 మంది కార్మికులు ఉన్న పరిశ్రమలకు వర్తించే కఠిన నిబంధనలను, ఇప్పుడు 300 మంది కార్మికులు ఉన్న సంస్థలకు కూడా సడలించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అంటే, దేశంలోని మెజారిటీ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల్లో పనిచేసే వేలాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత అనేది ఇకపై ఒక కల మాత్రమే. యజమాని ఇష్టానుసారంగా కార్మికులను తొలగించే అధికారం ఇవ్వడం వల్ల, కార్మికుడు తన హక్కుల కోసం గొంతు ఎత్తడమే మానేసే ప్రమాదకర స్థితి ఏర్పడింది. ఇది పారిశ్రామిక శాంతిని కాపాడటం కాదు, భయం నీడలో శ్రమను దోచుకోవడం.

మరోవైపు, కేంద్రం తెచ్చిన 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్' (నిర్ణీత కాలపరిమితి ఉద్యోగం) విధానం శాశ్వత ఉద్యోగాలనే భావనను పూర్తిగా తుడిచిపెట్టేలా ఉంది. ఒకప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం దొరికితే జీవితానికి భరోసా ఉండేది. కానీ ఇప్పుడు ప్రతి ఉద్యోగిని కాంట్రాక్టు కార్మికుడిగా మార్చే ప్రక్రియ వేగవంతమైంది. దీనివల్ల పదవీ విరమణ ప్రయోజనాలు, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సామాజిక భద్రతలు యజమానులకు భారంగా మారి, కార్మికులకు దూరమవుతున్నాయి. ఈ విధానం వల్ల కార్మికుడు తన భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకోలేక, నిరంతరం అభద్రతా భావంతో కొట్టుమిట్టాడాల్సి వస్తోంది. ఇది దేశంలోని మధ్యతరగతి మరియు దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక వెన్నెముకను విరిచే చర్య.

ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'వ్యాపార సులభతర వాణిజ్యం' (Ease of Doing Business) సూచీలో అగ్రస్థానం కోసం శ్రామికుల కనీస హక్కులను పణంగా పెట్టడం అన్యాయం. నూతన కోడ్‌ల ప్రకారం, కార్మికులు సమ్మె చేసే హక్కును దాదాపుగా కోల్పోయారు. నోటీసు పీరియడ్లను అసాధారణంగా పెంచడం, యూనియన్ల గుర్తింపు ప్రక్రియలో సంక్లిష్టతలు తీసుకురావడం ద్వారా కార్మికుల సామూహిక బేరసారాల శక్తిని (Collective Bargaining) ప్రభుత్వం నీరుగార్చింది. యాజమాన్యాల వేధింపులను ప్రశ్నించే హక్కు లేని కార్మికుడు కేవలం ఒక జీవం లేని యంత్రంలా మారిపోతాడు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును హరించడం అంటే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమే.

ఇక అసంఘటిత రంగం, వలస కార్మికుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న శీతకన్ను మరింత దారుణం. కరోనా కాలంలో వలస కార్మికుల కష్టాలను చూసిన తర్వాత కూడా, వారి కోసం ఒక బలమైన సామాజిక భద్రతా చట్రాన్ని నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైంది. కోట్లాది మంది గిగ్ వర్కర్లు, డెలివరీ ఏజెంట్ల జీవితాలను కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదిలేశారు. కనీస వేతనం (Floor Wage) నిర్ణయంలో కూడా ప్రభుత్వం శాస్త్రీయతను విస్మరించి, కార్పొరేట్ లాబీయింగ్‌కు తలొగ్గింది. రోజురోజుకూ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోగా, ఉన్న చట్టపరమైన రక్షణలు తొలగిపోవడం కార్మికులను దారిద్ర్యంలోకి నెట్టేస్తోంది.

ఈ సంస్కరణల రూపకల్పనలో కేంద్రం అనుసరించిన ఏకపక్ష ధోరణి గమనించదగ్గది. కార్మిక సంఘాల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ, పార్లమెంటులో సరైన చర్చ లేకుండా ఈ చట్టాలను ఆమోదించుకోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. కేంద్రం తన మొండి వైఖరిని వీడి, ఈ కార్మిక వ్యతిరేక కోడ్‌లను తక్షణమే సమీక్షించాలి. 'వ్యాపార సులభతరం' ఎంత ముఖ్యమో, 'కార్మికుడి భద్రత' కూడా అంతే ముఖ్యం. పెట్టుబడి మరియు శ్రమ అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలు. పెట్టుబడికి ఇచ్చే గౌరవం శ్రమకు ఇవ్వనప్పుడు ఆ వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. కార్మికులను కేవలం లాభాల వేటలో సాధనాలుగా చూడటం మానేసి, వారిని భాగస్వాములుగా గుర్తించినప్పుడే నిజమైన పారిశ్రామిక విప్లవం సాధ్యమవుతుంది. లేనిపక్షంలో, ఈ అణచివేత ధోరణి పెను నిప్పుకణికలా మారి, దేశ ఆర్థిక వ్యవస్థను దహించివేసే ప్రమాదం ఉంది. శ్రమజీవుల ఆగ్రహం ఏ ప్రభుత్వానికైనా గండమేనని పాలకులు గుర్తించాలి.

వెంకగారి భూమయ్య, 9848559863

# పల్లె సంస్కృతి కరిగిపోతుందా?



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

తెలుగు పల్లె ఒకప్పుడు అది కేవలం నివాస స్థలం కాదు.. అది జీవించే సంస్కృతి, ఊపిరి తీసుకునే ప్రకృతి, అనుబంధాలతో నిండిన ఒక సజీవ ప్రపంచం. ఉదయం సూర్యుడు కిరణాలు నులి వెచ్చగా తాకుతుంటే, గేదెల మేతకు వెళ్లే అడుగుల శబ్దం, కోళ్ల కూతలతో మేల్కొనే ఇళ్లు, ఎడ్లబండ్ల చక్రాలు నెమ్మదిగా తిరుగుతూ ఊరి దారుల్లో వినిపించే క్రిక్, క్రిక్ శబ్దాలు.. ఇవన్నీ కలిసి ఒక సహజ సంగీతంగా ప్రతి రోజును ఆరంభించేవి. పెరట్లో పిల్లలు ఆడుకునే నవ్వులు, పెద్దలు చెట్టు కింద కూర్చొని చెప్పుకునే కథలు, ఆవుల అరుపులు, గాలిలో తేలే పంటల వాసన ఇవన్నీ కలిసినప్పుడు పల్లె జీవితం ఒక మధురమైన గీతంలా అనిపించేది. ఆ పల్లెల్లో ప్రతి మనిషి ఒకరికొకరు తోడుగా ఉండేవారు. ప్రతి ఇల్లు మరొక ఇంటికి దగ్గరగా ఉండేది. ప్రతి జీవి, ప్రతి చెట్టు, ప్రతి పంట ఒక అనుబంధంతో జీవించేది. పశువులు కేవలం ఆస్తి కాదు..అవి కుటుంబ సభ్యులు. పంటలు కేవలం ఆహారం కాదు..జీవనాధారం. పండుగలు కేవలం వేడుకలు కాదు.. మనసులను కలిపే బంధాలు. ఆ జీవన విధానంలో ఒంటరితనం అనే మాటే లేదు.. కలిసి ఉండటం, పంచుకోవడం, సహజంగా జీవించడం మాత్రమే ఉండేది.

కానీ కాలం మారింది. అదే పల్లె ఇప్పుడు నిశ్శబ్దంగా మారిపోయింది. ఎడ్లబండ్ల శబ్దం తగ్గిపోయింది, పశువుల అరుపులు అరుదైనాయి, పెరట్లో నవ్వుల కంటే యంత్రాల గర్జన ఎక్కువైంది. సమష్టి జీవనం క్రమంగా వ్యక్తిగత జీవితంగా మారింది. ఒకప్పుడు ప్రకృతి గుండెలో కొట్టుకున్న ఆ పల్లె, ఇప్పుడు యాంత్రిక ప్రపంచపు అంచుల్లో నిలబడి తన గతాన్ని గుర్తు చేసుకుంటోంది.

**ప్రకృతితో మమేకమైన సమిష్టి జీవనం**

గతంలో ప్రతి ఇంటి పెరట్లో పశువుల కొట్టం ఉండేది. ఆవులు, బర్రెలు, గేదెలు.. ఇవి కేవలం ఆస్తి కాదు, కుటుంబ సభ్యుల్లా భావించేవారు. ఉదయం మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి ఇంటి ముందు నిలబడే ఆ దృశ్యం పల్లెకు ప్రాణం. పెరట్లో తిరిగే కోళ్లు, గొర్రెలు, మేకలు.. ఇవన్నీ కలిసి గ్రామానికి సహజ స్వరాల్ని అందించేవి. ధాన్యం నిల్వకోసం గుమ్ముల దొడ్డి (గుమ్మి) ప్రతి ఇంటిలో ఉండేది. వడ్లు, జొన్నలు, సజ్జలు, కొర్రలు.. ఇవి ఎండలో ఎండబెట్టి ఏడాది పొడవునా నిల్వ చేసుకునే వారు. ఇది స్వయం సమృద్ధి యొక్క స్పష్టమైన రూపం. వ్యవసాయం కూడా సమిష్టి పద్ధతిలో జరిగేది. ఒకరి పంట పనికి మరొకరు తోడుగా ఉండేవారు. ఒకరికొకరు తోడు అనేది మాట కాదు.. జీవన విధానం.

ఎండాకాలంలో ఆరుబయట నిద్రించడం, ఆకాశం చూస్తూ కథలు చెప్పుకోవడం, పాటలు పాడుకోవడం.. ఇవి కుటుంబ బంధాలను బలపరిచే అనుభవాలు.

**పండుగలు: పల్లె సంస్కృతికి ప్రాణం**

పల్లెల్లో పండుగలు కేవలం ఆనంద క్షణాలు కాదు.. అవి ప్రకృతి, పశువులు, మనుషులు.. ఈ మూడింటి మధ్య ఉన్న అవినాభావ బంధానికి ప్రతీకలు. ప్రతి పండుగ వెనుక ఒక జీవన తత్వం, ఒక కృతజ్ఞత భావం, ఒక సమిష్టి ఆత్మ దాగి ఉండేది. పొలాల అమావాస్య రోజున పశువులను కృతజ్ఞతాపూర్వకంగా పూజించి, రైతు తన భూమికి నమస్కరిస్తూ, పంటకు పునాది అయిన ప్రకృతిని స్మరించేవాడు. సంక్రాంతి పండుగ రాగానే పల్లె మొత్తం ఒక పండుగ వాతావరణంగా మారేది. ఎడ్లు, ఆవులను రంగురంగుల అలంకరణలతో సిద్ధం చేసి, వాటికి పూజలు చేసి, గంగిరెద్దుల ఊరేగింపుతో ఊరంతా సంబరాల్లో మునిగిపోయేది. అది కేవలం ఉత్సవం కాదు, పశువుల పట్ల కృతజ్ఞత, వ్యవసాయానికి వాటి పాత్రను గుర్తించే సంస్కృతి. బోనాలు, ఉగాది వంటి పండుగలు గ్రామ దేవతల పట్ల విశ్వాసాన్ని, భక్తిని, ప్రకృతి చక్రంపై ఆధారపడి ఉన్న జీవన విధానాన్ని ప్రతిబింబించేవి. బోనం పెట్టడం అంటే కేవలం ఆచారం కాదు.. మాకు అన్నం పెట్టిన ఈ నేలకు, ఈ దేవతకు కృతజ్ఞత అని చెప్పే భావోద్వేగం. ఉగాది కొత్త సంవత్సరాన్ని మాత్రమే కాదు, కొత్త ఆశలను, కొత్త పంటల ఆశీస్సులను తీసుకొచ్చేది.

జాతరలు అయితే పల్లె సంస్కృతికి జీవంతమైన ప్రతిబింబాలు. ఎడ్లబండ్లపై కుటుంబాలంతా కలిసి ప్రయాణిస్తూ, దారిలో పాటలు పాడుకుంటూ, గమ్యానికి చేరుకుని రాత్రంతా బుర్రకథలు, ఒగులు, జానపద నృత్యాలతో మెలకువగా గడిపే ఆ వేళలు.. అవి కేవలం వినోదం కాదు, ఒక సామాజిక ఉత్సవం, ఒక సాంస్కృతిక పాఠశాల. చిన్నా పెద్దా, ధనికా పేదా అనే తేడా లేకుండా అందరూ ఒకేచోట చేరి ఆనందాన్ని పంచుకునే అరుదైన సందర్భాలు అవి.

ఈ పండుగలు పల్లె జీవనానికి ప్రాణం పోసేవి. అవి మనుషులను ఒకే తాటిపై నిలబెట్టేవి, అనుబంధాలను బలపరచేవి, మనం ఒకటే అనే భావాన్ని నాటేవి. ప్రతి ఇంటి ఆనందం ఊరి ఆనందంగా మారేది. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసే ఆ క్షణాలు..ఇవే పల్లె సంస్కృతికి అసలు శ్వాస.

**మార్పు దశ, హరిత విప్లవం**

హరిత విప్లవం భారత వ్యవసాయ చరిత్రలో ఒక కీలక మలుపు. అది పంటల ఉత్పత్తిని పెంచింది, ఆకలిని తగ్గించింది, దేశాన్ని ఆహార భద్రత వైపు నడిపించింది. ఇవన్నీ అనన్యసాధారణ విజయాలే. కానీ అదే సమయంలో, గ్రామీణ జీవన విధానాన్ని మౌనంగా, గమనించలేని విధంగా మార్చేసిన విప్లవం కూడా అదే.

ఒకప్పుడు ఎడ్లబండ్ల చక్రాల మోగింపుతో నిండిన పల్లె దారులు,



నేడు ట్రాక్టర్ల గర్జనతో మార్మోగుతున్నాయి. ఎడ్లు, ఆవులు, గేదెలు.. వ్యవసాయానికి ప్రాణంగా ఉన్న ఈ జీవాలు క్రమంగా యంత్రాల ముందు వెనుకంజ వేశాయి. పశువులపై ఆధారపడిన సాగు పద్ధతులు తగ్గిపోగా, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, హైబ్రిడ్ విత్తనాలు వ్యవసాయాన్ని పూర్తిగా మార్చేశాయి. రైతు ప్రకృతితో మాట్లాడే వ్యక్తి నుంచి మార్కెట్‌తో లెక్కలు చూసే వ్యక్తిగా మారాల్సి వచ్చింది. యాంత్రీకరణ వేగం పెరిగింది. పని త్వరగా పూర్తయ్యింది. కానీ మనుషుల మధ్య ఉన్న ఆప్యాయత తగ్గింది. ఒకప్పుడు పంట నాటడం, కోత, నూర్పిడి ఇవన్నీ కలిసి చేసే సామూహిక కార్యక్రమాలు. ఇప్పుడు అవి యంత్రాల చేతుల్లోకి వెళ్లడంతో, ఒకరికొకరు తోడు అనే భావన క్రమంగా మసకబారింది. పని వేగంగా పూర్తయినా, మనసుల మధ్య దూరం పెరిగింది.

ఇంకా ఒక ముఖ్యమైన మార్పు వలసలు. పల్లెల్లో అవకాశాలు తగ్గిపోవడంతో యువత నగరాల వైపు అడుగులు వేసింది. చదువు, ఉద్యోగం, జీవనోపాధి కోసం ఊరిని వదిలి వెళ్లిన వారు తిరిగి రావడం తగ్గింది. పల్లెల్లో పెద్దలు, వృద్ధులు మాత్రమే మిగిలి, ఒకప్పుడు కిలకిలలతో కళకళలాడిన ఆవరణలు నిశ్శబ్దంగా మారాయి.

చిన్న చిన్న భూములుగా విభజన, వ్యక్తిగత వ్యవసాయం పెరగడం కూడా సమిష్టి జీవనాన్ని దెబ్బతీశాయి. ప్రతి రైతు తన భూమి, తన లాభం, తన సమస్యలకే పరిమితమయ్యాడు. ఒకప్పుడు ఊరి మొత్తం కలిసి పనిచేసిన వ్యవసాయం, ఇప్పుడు వ్యక్తిగత బాధ్యతగా మారింది.

హరిత విప్లవం మనకు అన్నం ఇచ్చింది, కానీ అదే సమయంలో పల్లె జీవనంలో ఉన్న ఆత్మీయతను, సమిష్టి భావనను కొంతవరకు దూరం చేసింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే.. అభివృద్ధి పేరుతో మనం పొందిన దానికంటే, కోల్పోయింది ఎక్కువా? లేదా రెండింటి మధ్య సమతుల్యత సాధించగలమా?

ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిన సమయం ఇదే.

**సాంస్కృతిక ప్రభావం, కనిపించని నష్టం**

ఈ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామం మాత్రమే కాదు. అది నిశ్శబ్దంగా చోటుచేసుకున్న ఒక గొప్ప సాంస్కృతిక నష్టం. ఒకప్పుడు పల్లె జీవనం ప్రకృతితో ముడిపడి, పశువులతో ఆధారపడి, మనుషుల మధ్య అనుబంధాలతో నిండిపోయి ఉండేది. కానీ ఆ ఆధారం క్రమంగా దెబ్బతినడంతో, ఆ జీవన విధానం కూడా మెల్లగా కరిగిపోతోం ది.

పశువుల సంఖ్య తగ్గిపోవడం కేవలం పాల ఉత్పత్తి తగ్గడమే కాదు.. అది సేంద్రీయ వ్యవసాయానికి బలమైన ఆధారం కోల్పోవడం. ఆవుల ఎరువు, గోమయం, సహజ మూలికలతో సాగిన వ్యవసాయం ఇప్పుడు రసాయనాలపై ఆధారపడుతోంది. దాంతో భూమి ఫలదీకరణం మాత్రమే కాదు, రైతు ప్రకృతితో ఉన్న అనుబంధం కూడా తగ్గిపోయింది. ఒకప్పుడు రైతు తన పొలాన్ని జీవంగా చూసేవాడు. ఇప్పుడు అది ఉత్పత్తి యూనిట్‌గా మారిపోతున్నది.

స్థానిక పశు జాతులు, సంప్రదాయ విత్తనాలు.. ఇవి కేవలం జీవ వైవిధ్యం కాదు, పల్లె సంస్కృతికి మూలాలు. కానీ ఇవి ఇప్పుడు క్రమంగా అంతరించిపోతున్నాయి. వాటి స్థానంలో హైబ్రిడ్ జాతులు, వాణిజ్య విధానాలు వచ్చాయి. ఫలితంగా మనకు లాభాలు వచ్చి ఉండొచ్చు. కానీ మన గుర్తింపు, మన మూలాలు మసకబారుతున్నాయి.

**ఇంకా పెద్ద నష్టం.. సమష్టి పండుగల మార్పు**

ఒకప్పుడు పండుగ అంటే ఊరి మొత్తం కలిసి జరుపుకునే ఆనందం. జాతరలు అంటే కుటుంబాలు, బంధువులు, పొరుగువాళ్లు అన్నీ కలిసే ఒక మహోత్సవం. కానీ ఇప్పుడు అవి క్రమంగా వాణిజ్యీకరణకు గురవుతున్నాయి. ఆత్మీయత తగ్గి, ఆర్భాటం పెరిగింది. ఆనందం పంచుకునే పండుగలు, ఇప్పుడు చూసే వేడుకలుగా మారిపోతున్నాయి.

అతిథి సత్కారం కూడా మారిపోయింది. ఒకప్పుడు ఇంట్లో పెంచుకున్న కోళ్లతో, పాలు, అన్నంతో బంధువులను ఆహ్వానించడం.. అది ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక. ఇప్పుడు అదే సత్కారం మార్కెట్ నుంచి కొనుక్కొచ్చిన వస్తువులతో జరుగుతోంది. సొంతం అనే భావన క్రమంగా కొనుగోలుగా మారిపోతోంది.

ఇలా ఒక్కో మార్పు చూస్తే చిన్నదిగా అనిపించినా, ఇవన్నీ కలిసినప్పుడు ఒక పెద్ద ఖాళీని సృష్టిస్తున్నాయి. పల్లె జీవనంలో ఒకప్పుడు ఉన్న ఆత్మీయత, అనుబంధం, సహజత్వం.. ఇవి మెల్లగా కరిగిపోతున్నాయి. ఇది కంటికి కనిపించని నష్టం, మన సంస్కృతికి గుండెల్లో పడిన గాయం.

**పునరుద్ధరణే పరిష్కారం**

గత పల్లె జీవనం మనకు కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాదు.. ఒక గొప్ప జీవన తత్వాన్ని, ఒక సమతుల్యమైన మార్గాన్ని నేర్పిస్తోంది. ప్రకృతితో కలిసిమెలిసి జీవించడం, సమాజంతో కలిసి ముందుకు సాగడం, స్వయం సమృద్ధిని సాధించడం.. ఇవన్నీ ఆ కాలపు పల్లె మనకు అందించిన అమూల్యమైన పాఠాలు. నేడు అభివృద్ధి పరుగులో మనం ఆ పాఠాలను మరచిపోయినా ఇప్పుడు తిరిగి వాటి విలువను అర్థం చేసుకునే దశకు వచ్చేశాం. ఇప్పటి అవసరం కేవలం వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం కాదు, జీవన నాణ్యతను, పర్యావరణ సమతుల్యతను, సామాజిక అనుబంధాల ను కాపాడటం. అందుకే సేంద్రీయ వ్యవసాయం పునరుద్ధరణ అత్యంత కీలకం. పశువుల ఆధారిత సహజ ఎరువులు, సంప్రదాయ విత్తనాలు, ప్రకృతి చక్రానికి అనుగుణంగా సాగు — ఇవి భూమిని మాత్రమే కాదు, మన ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి.

అలాగే స్థానిక పశు జాతులను కాపాడటం అనేది కేవలం జీవ వైవిధ్యాన్ని రక్షించడం కాదు.. అది మన సంస్కృతిని నిలబెట్టే ప్రయత్నం. ఎడ్లు, ఆవులు తిరిగి పల్లెల్లో కనిపిస్తే అది కేవలం పశుపాలన పునరాగమనం కాదు, ఒక జీవన విధానం తిరిగి పునర్జన్మ పొందినట్లే.

సహకార రైతు సమూహాలు ఈ దిశగా కీలక పాత్ర పోషించగలవు. ఒకప్పుడు ఉన్న ఒకరికొకరు తోడు అనే భావనను ఆధునిక రూపంలో తిరిగి తీసుకురావడం ద్వారా రైతులు ఆర్థికంగా, సామాజికంగా బలపడతారు. సమష్టి కృషి, పంచుకునే వనరులు, పరస్పర సహకారం.. ఇవి పల్లె జీవనానికి మళ్లీ ప్రాణం పోస్తాయి.

పల్లె జీవనం మళ్లీ పునర్జీవం పొందాలంటే మార్పు బయట నుంచి రాదు.. అది మన ఆలోచనల్లో, మన చర్యల్లో మొదలవాలి. ఇదే నిజమైన పునరుద్ధరణ.

# దాహం చావలేదు.. మనుషులే చచ్చారు!

సాంకేతిక విప్లవం ఆకాశాన్ని తాకుతున్న వేళ, కృత్రిమ మేధస్సుతో ప్రపంచం పరుగులు తీస్తున్న తరుణంలో.. ఆఫ్రికా నేలమీద చిందిన నెత్తురు మానవ నాగరికతకే మాయని మచ్చగా మిగిలింది. 2026 ఏప్రిల్ చివరి వారంలో, చార్డ్ దేశంలోని వాదీ ఫిరా ప్రావిన్స్‌లో ఒకే ఒక నీటి బావి వద్ద జరిగిన మారణకాండ చూస్తే గుండె తరుక్కుపోతుంది. అక్కడ దాహం చావలేదు కానీ, ఆ దాహాన్ని తీర్చుకోవాల్సిన 42 మంది మనుషులు పీనుగులై పడి ఉండటం అంతర్జాతీయ సమాజం విస్మయానికి గురయ్యేలా చేసింది. రెండు కుటుంబాల మధ్య మొదలైన చిన్న ఘర్షణ, క్షణాల్లో తెగల మధ్య యుద్ధంగా మారి పల్లెలను నిలువునా దహనం చేసింది. ప్రాథమిక హక్కుగా ఉండాల్సిన నీటిచుక్క కోసం నిలువునా ప్రాణాలు కోల్పోవడం, నాగరిక సమాజం అని చెప్పుకుంటున్న అందరికీ సిగ్గుచేటు. ఇది కేవలం ఒక స్థానిక గొడవ కాదు, ప్రకృతి వనరులు అంతరిస్తున్న వేళ మనిషి ఉనికి కోసం సాగిస్తున్న అత్యంత దారుణమైన జీవన్మరణ పోరాటం.

**ఎండిన జలాశయాలు.. నిండిన స్మశానాలు**

దశాబ్దాల పర్యావరణ విధ్వంసం చార్డ్ దేశాన్ని మరుభూమిగా మార్చేసింది. ఒకప్పుడు ఆఫ్రికాలోనే అతిపెద్ద మంచినీటి వనరుగా వెలిగిన చార్డ్ సరస్సు, 1960వ దశకంతో పోలిస్తే ఇప్పుడు 90 శాతం మేర ఎండిపోయింది. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం, 25,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ జలాశయం ఇప్పుడు కేవలం 1,500 చదరపు కిలోమీటర్లకు కుంచించుకుపోయింది. దీని వల్ల 30 మిలియన్ల మంది ప్రజల జీవనాధారం ప్రమాదంలో పడింది. యూనిసెఫ్ 2026 అంచనాల ప్రకారం, సాహెల్ ప్రాంతంలో 40 శాతం గ్రామీణ జనాభాకు కనీసం సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేదు. పశువుల మరణాలు పెరగడం, వ్యవసాయ దిగుబడులు 30 శాతం పడిపోవడం వంటి గణాంకాలు అక్కడ నెలకొన్న భయానక కరువు పరిస్థితులకు ప్రత్యక్ష సాక్ష్యాలు.

**మంచు పర్వతాల కన్నా వేగంగా కరుగుతున్న మానవత్వం**

గ్లోబల్ వార్మింగ్ అనేది కేవలం సమావేశాల్లో మాట్లాడుకునే గాలి మాట కాదని, అది గొంతుకోసే నిజమని ఈ రక్తపాతం నిరూపిస్తోంది. వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ సంఘం స్పష్టం చేసినట్లుగా, సాహెల్ ప్రాంతం ప్రపంచ సగటు కంటే 1.5రెట్లు వేగంగా వేడెక్కుతోంది. 2024లో తూర్పు ఆఫ్రికాలో సంభవించిన కరువు వల్ల 23 మిలియన్ల మంది ఆహార భద్రత సమస్యలను ఎదుర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు విశ్లేషణల ప్రకారం, 2050 నాటికి నీటి ఎద్దడి వల్ల ప్రపంచ జీడీపీలో 6 శాతం తగ్గుదల సంభవించడమే కాకుండా, అనేక దేశాల్లో అంతర్గత యుద్ధాలు వచ్చే ప్రమాదం ఉంది. మంచు పర్వతాలను కరిగించడమే కాదు, కనీస అవసరాల కోసం మనుషులు ఒకరినొకరు చంపుకునేలా వాతావరణ మార్పులు మనల్ని మార్చేస్తున్నాయని ఈ ఘోర సంఘటన నిరూపించింది.

**శరణార్థుల సెగ.. వనరుల వేట**

ఈ అంతర్జాతీయ విషాదాన్ని మరింత జటిలం చేస్తోంది శరణార్థుల సంక్షోభం. పొరుగున ఉన్న సూడాన్ నుండి వలస వస్తున్న లక్షలాదిమంది వల్ల పరిమితంగా ఉన్న వనరులపై ఒత్తిడి తారాస్థాయికి చేరింది. యూఎన్ శరణార్థుల విభాగం 2026 గణాంకాల ప్రకారం, చార్డ్ దేశం ఇప్పుడు 10 లక్షలకు పైగా శరణార్థులకు ఆశ్రయం ఇస్తోంది. అంతర్జాతీయ వలసల సంస్థ నివేదికల ప్రకారం, 2030 నాటికి నీటి కొరత వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 700 మిలియన్ల మంది నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అశాస్త్రీయ నీటి నిర్వహణ, వ్యవస్థాగత లోపాల వల్ల ప్రశాంతంగా ఉండాల్సిన జలవనరులు ఇప్పుడు యుద్ధ క్షేత్రాలుగా మారుతున్నాయి. ఐక్యరాజ్య సమితి 2010లో నీటిని మానవ హక్కుగా ప్రకటించినప్పటికీ, వాస్తవంలో ఆ హక్కు రక్తం వెంటే వస్తోంది.

**అంతర్జాతీయ సమాజానికి కళ్ళు తెరిపించే గుణపాఠం**

చార్డ్ లో జరిగిన ఈ విషాదం కేవలం ఆ దేశానికో, ఆ ఖండానికో పరిమితమైనది కాదు. ఇది సమస్త మానవాళికి ప్రకృతి ఇస్తున్న తుది హెచ్చరిక. 'గ్రేట్ గ్రీన్ వాల్' వంటి ప్రాజెక్టులు వేగవంతం కాకపోతే, రేపటి యుద్ధాలు సరిహద్దుల కోసం కావు, కేవలం గుక్కెడు నీటికోసం మాత్రమే జరుగుతాయని 42మంది శవాలు మనకు చెబుతున్నాయి. మనిషి మనుగడ నీటిపైనే ఆధారపడి ఉంది, కానీ ఆ నీటినే మనం నెత్తుటితో తడిపేస్తున్నాం. జలవనరులను కాపాడుకోకపోతే, భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చేది జీవం కాదు, మరణశాసనం మాత్రమే. ప్రకృతిని ప్రాణంగా చూడకపోతే, మన ప్రాణాలు నిలబడవు అని గ్రహించే సమయం ఎప్పుడో దాటిపోయింది.

ఫిరోజ్ ఖాన్,
9640466464

## మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో

# ప్రత్యేక డిగ్రీ కళాశాలలు



● నైపుణ్యాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలి
● మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం
● మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, వాటిలో నైపుణాభివృద్ధి, ఎఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. సాంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సిఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సిఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహిజీబ్‌ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలని సిఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, టిజిఎంఆర్ఇఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ముఖ్యమంత్రి ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించేందుకే

# తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు



● రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అందుకే ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసిందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం తెలంగాణ విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్న రంగారెడ్డి జిల్లా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్‌ల బృందం సందర్శించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా... పైలెట్ ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఇట్టి పాఠశాలల పనితీరును, అక్కడ అందుతున్న విద్యా సౌకర్యాలను విప్‌లు స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్, విజయరమణారావు, రామచంద్ర నాయక్, అద్దంకి దయాకర్, వేముల వీరేశంలతో పాటు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఇక తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ చారకొండ వెంకటేష్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు విప్‌లకు పాఠశాల విశేషాలను వివరించారు. ప్రభుత్వ విప్‌ల బృందానికి తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌లు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' తీసుకువచ్చారని అన్నారు. ఇట్టి ఆరుట్ల పాఠశాల తెలంగాణ విద్యా విధానానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లు, నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను విప్‌లు అభినందించారు. అనంతరం తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అందుకే ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసిందని ఆకునూరి మురళి వివరించారు. ఈ పాఠశాలలో బోధన పద్ధతులు, మౌలిక సదుపాయాలు కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్వహణలో సరికొత్త ఒరవడితో ముందుకు వెళుతున్నామన్న కమిషన్ చైర్ పర్సన్, రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేశామని, ఆ కమిటీలు ప్రతిరోజూ పాఠశాల నిర్వహణను పర్యవేక్షిస్తుంటాయని అన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలను ప్రధాన్యతగా భావిస్తుందన్నారు. గత ప్రభుత్వ హాయంలో ఈ రంగాలను నిర్లక్ష్యానికి గురిచేస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దానికి భిన్నంగా... అభివృద్ధి చేస్తుందన్నారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ శోభాకుమారి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 25, 26న ఎస్‌బిఐ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజుల సమ్మెకు ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (ఎఐఎస్‌బిఐఎస్‌ఎఫ్) పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐఎస్‌బిఐఎస్‌ఎఫ్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్, స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కె.ఎస్.శాండిల్య, సిహెచ్.శ్రీధర్ (అధ్యక్షులు), ఆర్.నాగేంద్ర కుమార్ (అమరావతి సర్కిల్ అధ్యక్షులు), కె.అంజనేయప్రసాద్ (ఎఐబిఓసి), ఎన్.రాధాక్రిష్ణన్(ఎస్‌బిఐ పెన్షనర్స్ అసోసియేషన్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోవడం, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఉపసంహరించకపోవడంపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఎస్‌బిఐ శాఖల్లో తీవ్ర సిబ్బంది కొరత నెలకొన్నదని, దాదాపు 29 ఏళ్లుగా మెసెంజర్ పోస్టుల భర్తీ జరగకపోవడంతో క్లరికల్ సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని ఆరోపించారు. సబ్‌ఆర్డినేట్ స్టాఫ్, ఆర్మ్‌డ్ గార్డులు, క్లరికల్ ఉద్యోగుల నియామకాలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బ్యాంకింగ్ కార్యకలాపాల్లో ఔట్‌సోర్సింగ్ పెరగడం వల్ల ఉద్యోగ భద్రత, వినియోగదారుల సమాచారం గోప్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బందిపై అధిక టార్గెట్‌లు, క్రాస్ సెల్లింగ్ ఒత్తిడి పెరగడం వల్ల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్‌పిఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ ఎంపిక అవకాశం కల్పించాలని, 2019 తర్వాత నియమితులైన ఉద్యోగులకు ఇంటర్ సర్కిల్ బదిలీలు పునరుద్ధరించాలని కోరారు. ఈ నెల 23 రెండవ శనివారం, 24 ఆదివారం, 25, 26 సమ్మె, 27 బక్రీద్ కలుపుకొని మొత్తం ఐదు రోజులు వరుసగా బ్యాంకులకు సెలవులు రానున్నాయి. కస్టమర్లు బ్యాంకు ఉద్యోగుల సమ్మెకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కేంద్రం సహకరించాలి

● ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పట్టణ గృహ నిర్మాణ పథకాల పురోగతి, వాటి అమలులో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని భువనగిరి లోక్‌సభ సభ్యులు, పార్లమెంటరీ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. తిరుపతిలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటనలో పాల్గొన్న ఆయన, వివిధ శాఖల ప్రతినిధులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో పట్టణాభివృద్ధికి సంబంధించి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పలు కీలక అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కమిటీ హైదరాబాద్లో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగర భవిష్యత్తుకు కీలకమైన మెట్రో రైల్ రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులపై స్టాండింగ్ కమిటీతో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం, అర్బన్ డబుల్ బెడ్రూమ్ హౌసింగ్ పథకాల అమలు తీరును కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని వెల్లడించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ వంటి పథకాల ద్వారా స్థానిక సంస్థల సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం తోడ్పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

**నేడు ముఖ్యమంత్రితో భేటీ:**
మే 9న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగే సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన అజెండాగా చర్చిస్తామని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో గృహ నిర్మాణ పథకాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## మూసీ నివాసితులకు డిప్యూటీ సిఎం భరోసా

● ప్రజాభవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం మూసీ పునర్జీవన మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ్ (బిబ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకు చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటీ సిఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి జి.వి.శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్ రాయ్, రేణుధల్, నబీ సాహెబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వం పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండి ఈ.వి.నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

## రిటైర్డ్ డిజి భార్య హత్య

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిజిపి, సిపి



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** రిటైర్డ్ డిజి వినయ్ రంజన్ రే భార్య సునందన రే హత్యకు గురయ్యింది. నేపాలీ పనిమనిషితో పాటు మరో ముగ్గురు కలిసి నోట్లో గుడ్డలు కుక్కి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు సమాచారం. గురువారం రాత్రి జరిగిన ఈ హత్య ప్రశాసన్‌నగర్‌లో కలకలం రేపింది. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు వీవీఐపీలు నివాసముండే ప్రాంతంలో హత్య జరగడంతో నేపాలీ పనిమనుషులు, సెక్యూరిటీ గార్డుల విషయంలో ఆందోళన నెలకొంది. హత్య అనంతరం ఇంట్లో నుంచి భారీగా బంగారం ఎత్తికెళ్లారు. హత్యకు పాల్పడిన నేపాలీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలాఉండగా.. గ్రేటర్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలు నేపాలీలపై అనుమానాలు పెంచేలా చేస్తున్నాయి. ఈ ఘటనతో పనిమనుషులు, సెక్యూరిటీ గార్డులు, గుర్ఖాల నియామకం విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

## మహిళా సాధికారతకు కొత్త చిరునామా..

● జూన్ 2న 'జిల్లా మహిళా సమాఖ్య' భవనాల ప్రారంభం
● మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు మరింత బలం చేకూర్చే దిశగా జిల్లా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా ఈ భవనాల ప్రారంభానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 22 జిల్లాల్లో జిల్లా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులు చేపట్టగా, ఇప్పటికే 17 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఒక్కో భవనాన్ని సుమారు రూ.5 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నారు. గ్రామీణ మహిళల స్వయం సహాయక సంఘాలకు శాశ్వత వేదిక కల్పించడం, మహిళా సంఘాల కార్యకలాపాలను బలోపేతం చేయడం, గ్రామీణ మహిళల ఆర్థిక వ్యవస్థను మరింత విస్తరించడం లక్ష్యంగా ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు జిల్లాల్లో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

**ఉత్పత్తుల ప్రదర్శనకు ఎగ్జిబిషన్ హాళ్లు..** ఇప్పటి వరకు మహిళా సంఘాలకు స్థిరమైన కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. కొత్తగా నిర్మితమవుతున్న ఈ భవనాలు మహిళా సంఘాలకు శాశ్వత కేంద్రాలుగా మారనున్నాయి. జిల్లా స్థాయిలో మహిళా సంఘాల పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, గ్రామీణ మహిళలకు ఉపాధి, వ్యాపార, మార్కెటింగ్ అవకాశాలను అందించే కేంద్రాలుగా ఇవి ఉపయోగపడనున్నాయి. ఈ భవనాల్లో మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణపై అవగాహన శిబిరాలు, ఉపాధి మార్గదర్శకాలు నిర్వహించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు.

## ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమసమాజమే లక్ష్యంగా అణగారిన వర్గాల కష్టాలే ఇతివృత్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు నేటి వరకు తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులూ తమ ఆట పాటలతో ప్రజలను చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా అన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను నరసింహ్మా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు రామలింగయ్య, నాగభూషణం, మాదాల రంగారావు, టి.కృష్ణ, వందేమాతరం శ్రీనివాస్ రావు వంటి మహానటులు, దర్శకులు, సంగీత దర్శకులను సినిమా రంగానికి అందించిన ఘన చరిత్ర తెలంగాణ ప్రజానాట్యమండలిదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా మాట్లాడుతూ 83 ఏళ్ల నుండి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఘన చరిత్ర కలిగిన తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారథి తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25,26 తేదీలలో హైదరాబాద్, నారాయణగూడలోని మర్వెల్ ఫంక్షన్‌హాల్‌లో రెండు రోజులపాటు జరగనున్నాయని, 25వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎఐయుసి రాష్ట్ర కార్యాలయం నుండి వేలాదిమంది కళాకారులతో భారీ ప్రదర్శన, అనంతరం మర్వెల్ ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగసభలో ప్రొఫెసర్ ఎం.కోదండరాం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఎంఎల్‌సి గొరటి వెంకన్న తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం ప్రతినిధుల సభలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి కవులు, కళాకారులూ ప్రతినిధులుగా దాదాపు 500 మంది పాల్గొననున్నారని వెల్లడించారు. మహాసభల్లో కళాకారుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, కె.లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి కొండల్ రావు, కోశాధికారి పడాల నళిని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు కంపల్లి శ్రీనివాస్, సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

● సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కీలక నిర్ణయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలంగాణ ఆర్‌టిసి కార్మిక సమాఖ్య, టిపిసిసి ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కె.రాజిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఆర్‌టిసి ఉద్యోగుల పెండింగ్ బాండ్ల బకాయిలు, డిఎలు, పిఎఫ్, సిసిఎస్ బకాయిల చెల్లింపుతో పాటు 2017, 2021 వేతన సవరణ, ఆర్‌టిసిలో యూనియన్ల పునరుద్ధరణ, కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు, కొత్త నియామకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ బస్సుల విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా సబ్సిడీ సమస్యలు ఉన్నప్పటికీ, తెలంగాణ ఆర్‌టిసికి నేరుగా సబ్సిడీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని పేర్కొన్నారు. ఆర్‌టిసి అభివృద్ధి, కార్మిక సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కార్మికులు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కె.రాజిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

● బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న నేర సంఘటనలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన కెటిఆర్, పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపుల కోసం వినియోగించడం వల్ల ప్రజల భద్రత నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం డిజిపిని కలిసి శాంతిభద్రతల పరిస్థితిపై ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డిజి స్థాయి ఐపిఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురికావడం ఆందోళనకరమన్నారు. సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఓ యువకుడిని కత్తితో దారుణంగా హత్య చేసిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని తాజా ఎన్‌సిఆర్‌బి నివేదికలు సూచిస్తున్నాయని కెటిఆర్ గుర్తుచేశారు. హోం శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజల్లో భరోసా కల్పించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## అధికారుల కాళ్లపై పడే పరిస్థితికి తీసుకురావడం ప్రభుత్వ వైఫల్యం

● బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు టి.హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు టి.హరీశ్ రావు విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతులను అధికారుల కాళ్లపై పడే పరిస్థితికి తీసుకురావడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. రైతులు కల్లాల్లో రోజుల తరబడి పంటకు కాపలా కాస్తూ ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వమే పంట కొనుగోలు చేయకపోతే రైతులకు దిక్కెవరో చెప్పాలని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాల్సిన పాలకులే ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దిక్కుతోచని పరిస్థితిలో రైతులు పంట కొనండి అంటూ వేడుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల కన్నీటి శాపం పాలకులను వదలదని, ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చింతల్ సర్కిల్-54, క్యూబిజెడ్, సిఎంసి.

NIT No. 02/DB/EE-III/CNL/C-54/QBZ/CMC/2026-27, తేది: 08.05.2026, పని పేరు: నిర్వహణ & పెయింటింగ్ పనులు (3 పనులు). **అంచనా విలువ :** రూ.5.95 లక్షలు, **ప్రారంభ తేదీ & సమయం:** 11.05.2026 మ.3:00గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 14.05.2026 మ.3:00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, సిఎన్‌ఎల్ సి-54, సిఎంసి.
DIPR R.O. No. : 2191-PP/CL/ADVT/2026-27, Date: 08-05-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
**శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం**
పి.ఆర్.నగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

శ్రీయుత కమిషనర్, దేవాదాయ శాఖ వారి కార్యాలయ Rc. No. F4/2168/2025, తేది: 05-05-2026 ప్రకారము నమూనా ఫామ్-1 నిబంధన-4(1) చూడగలరు.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానము, పాండురంగనగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్‌కు వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియామకము కొరకు నోటిఫికేషన్ జారీ చేయబడినది. ఈ నోటీసు ప్రచురింపబడిన తేదీ నుండి 20 రోజుల అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87 (సవరించబడిన చట్టం 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016ను అనుసరించి) సెక్షన్-15, ఉపసెక్షన్-1కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల హిందూ మతమునకు చెందిన అభ్యర్థులు ధర్మకర్తగా నియామకము కొరకు వారి దరఖాస్తులను సెక్షన్-17 నందలి ఉపసెక్షన్-3 ను అనుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారమ్-11)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజులలోపు శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, సికింద్రాబాద్ కార్యాలయము (తుల్జాభవన్ ధర్మశాల, కాచిగూడ) నందు దరఖాస్తులు సమర్పించుకోవచ్చును.

తేది: 08-05-2026
సం/- కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్, తెలంగాణ
DIPR R.O. No. : 2130-PP/CL/ADVT/2026-27, Date: 08-05-2026

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
09-05-2026
www.prajapaksham.in
ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్
స్థానికం LOCAL NEWS

## ఆడబిడ్డలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా

మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/ మందమర్రి:** పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. మందమర్రి మండలం, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని అర్హత సాధించిన కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్నాయని, వీటి ద్వారా ఆడబిడ్డల పెళ్లిళ్లు గౌరవప్రదంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆలస్యం లేకుండా పథకాల ఫలాలు అందేలా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి. రఘునాథ రెడ్డి, సొత్కు సుదర్శన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ మార్గాలను అన్వేషిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్ ఆడిటోరియంలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జూలై నెలలోనే ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని, సాంకేతిక సమస్యల పరిష్కారానికి శాస్త్రవేత్తలతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో కొత్తగా 8 చెరువులు అందుబాటులోకి వస్తున్నాయని, చెరువుల్లో గుర్రపుడెక్క నివారణకు మురుగునీటి శుద్ధ ప్లాంట్లు ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. పొలాల్లో చేపల చెరువుల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, రవాణాకు ప్రభుత్వం ఇచ్చే ఫిష్ వెహికల్స్‌ను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా మత్స్యశాఖ అధికారి లాయక్ మోహిద్దీన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుషసతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఎల్లుల భోజన్న, మేకల అశోక్, బింగి వెంకటేష్, దూస సంతోష్, శ్రీనివాస్, చిత్రు పాల్గొన్నారు.

## బేల మార్కెట్‌లో ఎమ్మెల్యేకు రైతుల సెగ



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** బేల మండలం మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు శుక్రవారం రైతుల నుండి నిరసన సెగ తగిలింది. శనగలు, జొన్నలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. మార్కెట్‌లో గన్ని బ్యాగుల కొరతతో తీవ్రంగా నష్టపోతున్నామని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనేలా హామీ ఇవ్వాలని పట్టుబట్టారు.ఎమ్మెల్యే స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనడం లేదని పేర్కొనడం వివాదానికి దారి తీసింది. రైతుల నిరసనతో చేసేది లేక ఎమ్మెల్యే అక్కడి నుండి వెనుతిరిగారు. బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు

కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లాలో 533 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ కొనసాగుతుండగా, రోజుకు 480 లారీల ధాన్యం తరలిస్తున్నామని చెప్పారు. వేసవి ఉష్ణోగ్రతలు, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఉన్నప్పటికీ కొనుగోలు, రవాణా ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అకాల కర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా రెండు ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకుని నిల్వ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లా లో 67,489 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.62.87 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ శాతం చూసే యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## మలేరియా, తలసేమియాపై అవగాహన

**ప్రజాపక్షం/ జన్నారం:** జన్నారం మండలం సింగరాయపేట గ్రామంలో మలేరియా, తలసేమియా వ్యాధులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మలేరియా నివారణ చర్యలను వివరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. గ్రామస్తులు డ్రై డే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం తలసేమియా డే సందర్భంగా గర్భవతులు, కిశోర బాలికలు, గ్రామస్తులకు ఆ వ్యాధి లక్షణాలు, నివారణా మార్గాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుడసం రజిత రాంపాల్, ఉప సర్పంచ్ వరలక్ష్మి , ఎమ్మెల్ హెచ్పి నవనీల, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరు కమలాకర్, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త తిరుమల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి ధరల సెగ!

### భారంగా మారిన ఇసుక, ఇటుక ధరలు
### అధికారులపై పని ఒత్తిడితో సతమతం

**ప్రజాపక్షం / నిర్మల్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకం నిర్మల్ జిల్లాలో ఒక కీలక దశకు చేరుకుంది. అయితే, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని భావిస్తున్న పేద లబ్ధిదారులకు ప్రస్తుతం పెరుగుతున్న నిర్మాణ సామాగ్రి ధరలు పెను సవాలుగా మారాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి దశ కింద మంజూరైన ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మార్కెట్‌లో ఒక్కసారిగా పెరిగిన ధరల వల్ల లబ్ధిదారులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. అటు అధికారుల నుండి గడువు లోపు పూర్తి చేయాలనే ఒత్తిడి, ఇటు జేబుకు చిల్లు పెడుతున్న సామాగ్రి ధరల మధ్య లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### ఆకాశాన్నంటుతున్న ధరలు

గత కొన్ని నెలల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం ఇసుక, ఇటుక వంటి నిత్యావసర నిర్మాణ సామాగ్రి ధరలు రెట్టింపు అయ్యాయి. గతంలో ఒక ట్రాక్టర్ ఇసుక ట్రిప్పు కేవలం 3000 రూపాయలకు లభించేది. కానీ నేడు అది ఏకంగా 7000 రూపాయల వరకు పలుకుతోంది. అదే విధంగా, గతంలో 4000 రూపాయలకు లభించిన ఒక ట్రాక్టర్ ఇటుకల ధర ప్రస్తుతం 14000 నుండి 16000 రూపాయల వరకు పెరిగింది. దీనికి తోడు సిమెంట్, ఇనుము , కూలీల రేట్లు కూడా గణనీయంగా పెరగడంతో సామాన్య లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రస్తుత ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదని, సొంతంగా అప్పులు చేయాల్సి వస్తోందని చాలామంది లబ్ధిదారులు వాపోతున్నారు. భరించలేక ఇప్పటికే పునాదులు వేసిన వారు, పిల్లర్ల వరకు పనులు చేసిన వారు పనులను ముందుకు తీసుకెళ్ళక వెనకముందు అవుతున్నారు.

### జిల్లాలో నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులు

హౌజింగ్ విభాగం అందించిన తాజా గణాంకాల ప్రకారం నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ ప్రగతి ఇలా ఉంది. జిల్లా మొత్తం 7651 ఇళ్ళు మంజూరు కాగా, అందులో 6640 ఇళ్ళ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. గ్రౌడింగ్ వీటిలో 1144 ఇళ్ళు మార్క్‌డ్ దశలో ఉండగా, 1436 ఇళ్ళు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. మరో 881 ఇళ్ళు పిల్లర్ల దశలో 2198 ఇళ్ళు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. ఇప్పటివరకు కేవలం 981 ఇళ్ళు మాత్రమే నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాయి.వేల సంఖ్యలో ఉన్న ఇళ్ళను త్వరితగతిన పూర్తి చేయడమే ఇప్పుడు జిల్లా యంత్రాంగం ముం దున్న ప్రధాన లక్ష్యం.

### అధికారులపై పెరుగుతున్న పని ఒత్తిడి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరులోగా మొదటి దశ ఇళ్ళను ఏలాగైనా పూర్తి చేయాలని కఠినమైన గడువును విధించింది. దీంతో హౌజింగ్‌విభాగం అధికారులపై పని ఒత్తిడి అసాధారణంగా పెరిగింది. క్షేత్రస్థాయిలో ఉన్న



ఇంజనీర్లు, ఇతర అధికారులు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటిస్తూ లబ్ధిదారులను నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రోత్సహిస్తున్నారు. పెరిగిన ధరల వల్ల లబ్ధిదారులు పనులు ఆపివేస్తుంటే, వారిని ఒప్పించి పనులు పూర్తి చేయించడం అధికారులకు ఒక పెద్ద సవాలుగా మారింది. లక్ష్యాలను చేరుకోకపోతే పై స్థాయి అధికారుల నుంచి వివరణ ఇచ్చుకోవాల్సి వస్తుందనే ఆందోళనలో క్షేత్రస్థాయి యంత్రాంగం ఉంది.

### సమన్వయ లోపం.. గందరగోళ పరిస్థితులు

ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే అటు అధికారులకు, ఇటు లబ్ధిదారులకు మధ్య కొంత అయోమయం నెలకొన్నట్టు కనిపిస్తోంది. ఒకవైపు మొదటి దశ పనులు ఇంకా సగానికి పైగా పెండింగ్‌లో ఉండగానే రెండో దశ అనుమతుల ప్రక్రియపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. సామాగ్రి ధరలు నియంత్రణలో లేకపోవడం, బిల్లుల మంజూరులో సాంకేతిక కారణాల వల్ల వచ్చే జాప్యం కూడా నిర్మాణాల వేగాన్ని తగ్గిస్తోంది. ఈ సవాళ్ళన్నింటిని అధిగమించి నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ లక్ష్యాన్ని గడువులోగా ఎలా చేరుకుంటారో వేచి చూడాల్సిందే. ప్రభుత్వం వెంటనే స్పందించి ధరల నియంత్రణకు లేదా లబ్ధిదారులకు అదనపు సాయం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## ఆకాశవాణి జిల్లాకు గొప్పవరం

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/మావల:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆకాశవాణి కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం ఆకాశవాణి కేంద్రం 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వాక్‌థాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా చరిత్రలో ఆకాశవాణికి ప్రత్యేక స్థానం ఉందని, దేశంలోని తొలి మూడు కేంద్రాలలో ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. టీబీ ముక్త భారత్, ఆరోగ్య పాఠశాల వంటి పథకాలను మారుమూల గిరిజన గ్రామాలకు చేరవేయడంలో రేడియో సేవలు అమోఘమని ప్రశంసించారు. ఆదివాసీ సంస్కృతిని పరిరక్షించడంలో ఆకాశవాణి పాత్ర గొప్పదని, గిరిజన కళలను జిల్లా వేదుకల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ద్వారా ఇప్ప పువ్వు లడ్డు గురించి ప్రస్తావించడంతో జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా తెలిసిందని గుర్తు చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మంత్రి జూపల్లి కృష్ణా రావు



**ప్రజాపకం/ కాగజ్ నగర్ :** రాజకీయాలకు అతీతంగా అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సం క్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. బోరిగాం శివారులో నిర్మించిన 288 రెండు పడక గదుల ఇండ్లను లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాగజ్ నగర్ పట్టణానికి మొదటి విడతలో 630 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. అర్హత ఉండి మొదటి విడతలో రానివారు నిరాశ చెందవద్దని, తదుపరి విడతలో వారికి అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి రహదారుల విస్తరణ, మురుగు కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ హరిత, ఎస్పి నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ హాజీపూర్:** హాజీపూర్ మండలం లోని పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం సందర్శించారు. టికన్నపల్లి, పెద్దంపేట, గొల్లపల్లి, దొనబండ గ్రామాల్లోని కేంద్రాలను పరిశీలించి, ధాన్యం సేకరణ, రవాణా అంశాలపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. లారీల రాకలో జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. లారీలు అందుబాటులో లేని పక్షంలో రైతులు తమ సొంత ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవచ్చని ఆయన సూచించారు. ట్రాక్టర్ల రవాణా ఖర్చులను ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, అకాల వర్షాల నేపథ్యంలో తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రం చేసి కేంద్రాలకు తీసుకురావాలని, నాణ్యత బాగుంటే మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలో రోజువారీ ధాన్యం సేకరణను 8 వేల మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. తహశీల్దార్ పుష్పలత, ఆర్ఐలు ప్రభు, మంగ, ఐకేపి ఏపీఎం వెంకటేష్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు

**ప్రజాపక్షం/మెదక్ :** ధాన్యం రవాణా విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. రైతులు ఆందోళన పడాల్సిన పని లేదని, ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని అవుసులపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్ తో కలిసి అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం తూకం, పలు రికార్డులు, ట్యాబ్ ఎంట్రీ, లోడింగ్ ప్రక్రియను, తేమశాతాన్ని పరిశీలించారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందాబాటులో ఉంచుకోవాలన్నారు. లోడింగ్ ప్రక్రియను అతి త్వరగా చేపట్టాలని, లేబర్ ను, లారీలను అందుబాటులో ఉంచుకోవాలని, నిర్వాహకులకు సూచించారు. మిల్లర్లు ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా చేసుకోవాలని ఆదేశించారు. ఏసీ వెంట కొనుగోలు సెంటర్ నిర్వాహకులున్నారు.



## బక్రీద్ పండుగకు పటిష్ఠ ఏర్పాట్లు

ఎస్పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** జిల్లాలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవులు, దూడల అక్రమ రవాణా, వధను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా 7 చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని హెచ్చరించారు. మత పెద్దలు, యువత శాంతి సామరస్యాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు సునీల్‌కుమార్, నాగరాజు,ఫణిధర్, మత పెద్దలు పాల్గొన్నారు.



## దివాకర్‌రావు, రఘునాథ్‌రావు ఆరోపణలు నిరాధారం

### బిఆర్ఎస్ హయాంలో రైస్‌మిల్లర్లు నష్టపోయారు
### రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్లు తీవ్రంగా నష్టపోయామని రైస్‌మిల్లర్స్ మంచిర్యాల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చిలువేరు వైకుంఠం అన్నారు. శుక్రవారం వేంపల్లిలోని జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఇటీవల లక్షెట్టిపేటలో గోడకూలి రైతులు చనిపోయే జరిగిన ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు రైస్‌మిల్లర్లు లక్షల్లో ముట్టచెప్పారని ఆరోపించడంను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే బిజెపి నాయకుడు వెరబెల్లి రఘునాథ్ రెండు కిలోలు ఎక్కువగా జోకుతూ ముఖ్యమంత్రికి ఒక కిలో, ఎమ్మెల్యేకు కిలో ఇస్తున్నామని ఆరోపించడం అర్థరహితమనే ఈ ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2019 నుండి 2023 వరకు కరోనా సమయంలో అడ్డగోలుగా మిల్లులకు ధాన్యం కేటాయించడంతో మిల్లుల్లో పెట్టుకునే పరిస్థితి లేక బయట బస్తాలు పెడితే వర్షాలకు తడిసి ధాన్యం నుండి సరైన బియ్యం రాక తీవ్రంగా



నష్టపోయామని వాపోయారు. జిల్లాలో గతంలో 54 మిల్లులు ఉంటే ప్రస్తుతం నష్టాలతో మూతపడి ఓనర్లు రోడ్డున పడిన సంఘటనలు వివరించారు. మరి కొన్ని మిల్లులకు డిఫాల్టర్ పేరుతో ధాన్యం కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పది మిల్లులకే ధాన్యం కేటాయింపు జరిగిందన్నారు. గత ప్రభుత్వం డిఫాల్టర్ పేరుతో 25 శాతం పెనాల్టీ విధించడంతో పొరుగు జిల్లాలో ఓ మిల్లు యజమాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. బిల్లులు పెట్టి రైతులకు సేవ చేస్తు వందల మందికి ఉపాధి కల్పిస్తున్న తమను రాజకీయ లబ్ది కోసం వాడుకోవద్దని కోరారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరి చిలువేరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చెప్యాల మధు, కొత్త రాజేశం, నాయకులు ముక్త శ్రీనివాస్, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

# దిగుబడి మెండు.. నిబంధనలు అడ్డు

### ఎకరాకు 32క్వింటాళ్ల పరిమితితో బేజారు
### అదనపుధాన్యం అమ్ముకోలేక అయోమయం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఈ ఏడాది వేసవి కాలం రైతులకు తీపి కబురుతో పాటు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ప్రకృతి కరుణించి, చీడపీడల బెడద లేకపోవడంతో పొలాలు పసిడి రంగు పులుముకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా దిగుబడులు రావడంతో మురిసిపోతున్న రైతన్నకు ప్రభుత్వ కొనుగోలు నిబంధనలు ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దిగుబడి ఎక్కువ.. లిమిట్ తక్కువ అన్న చందంగా మారిన తీరుపై అన్నదాతలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రికార్డు స్థాయిలో దిగుబడులు...

సాధారణంగా వరి సాగులో ఎకరాకు 30నుంచి 32క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం పరిపాటి కానీ, ఈ వేసంగిలో వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు ఏకంగా 35నుంచి 40క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. వైరస్ ప్రభావం అసలే లేకపోవడంతో గింజ గట్టిపడి నాణ్యమైన పంట చేతికొచ్చింది. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని సంతోషించే లోపే, కొనుగోలు కేంద్రాల్లో పెట్టిన లిమిట్ రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

### అడ్డంకిగా మారిన 32క్వింటాళ్ల నిబంధన...

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక ఎకరానికి కేవలం 32క్వింటాళ్లను మాత్రమే సేకరించాలని నిబంధన విధించారు. దీని వల్ల ఎకరాకు అదనంగా పండిన ఐదు నుంచి 8క్వింటాళ్ల ధాన్యాన్ని ఏం చేసుకోవాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వానికి అమ్మాలి. తీరా అక్కడికి వెళ్తే లిమిట్ దాటిందని వెనక్కి పంపుతున్నారు.

### భారీగా పెరిగిన లోడింగ్...

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ సోసైటీ పరిధిని గమనిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. గతంలో సగటు ధాన్యం సేకరణ సుమారు 40,000 బస్తాలు అయితే అధిక దిగుబడుల నేపథ్యంలో ప్రస్తుత



అంచనా 50,000బస్తాలకు పైగా ఉంది. కేవలం ఒక్క సోసైటీ పరిధిలోనే ఇంత వ్యత్యాసం ఉంటే, జిల్లా వ్యాప్తంగా వేల క్వింటాళ్ల అదనపు ధాన్యం నిబంధనల సుడిగుండంలో చిక్కుకుపోయింది.

### ప్రత్యామ్నాయాల వేటలో రైతన్న...

నిబంధనల నుంచి గట్టెక్కేందుకు రైతులు రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. తమకు తెలిసిన ఇతర రైతుల పేర్ల మీద ధాన్యాన్ని తోలడం లేదా వేరే వారి పట్టాదారు పాస్ పుస్తకాల కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. మద్దతు ధర దక్కించుకోవడానికి ఇంతలా కష్టపడలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాయకష్టం చేసి పంట పండిస్తే, ఎక్కువ పండిందని శిక్ష వేస్తారా..? ప్రభుత్వంస్పందించి దిగుబడికి అనుగుణంగా సేకరణ పరిమితిని పెంచాలని పలువురు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో ఉన్న దిగుబడి ఆధారంగా ధాన్యం సేకరించి అన్నదాతను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

# రైతులు కష్టాల్లో ఉంటే రాజకీయం చేయడమా?

## మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/జగిత్యాల/పెగడపల్లి: రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో రాజకీయాలు చేయడం తగదని, రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి జగిత్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం, మక్కజొన్న పంటలను జగిత్యాల మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా పంటలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 4వేల కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోరి ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే పెద్ద ఎత్తున పంట దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. జగిత్యాల మార్కెట్ యార్డులో 487 మంది రైతుల వద్ద 1151 మెట్రిక్ టన్నుల మక్కలు సేకరించగా ఈ ఏడాది ఇప్పటికే 697 మంది రైతుల వద్ద 2607 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంతో పాటు మక్కజొన్నలను కొనుగోలు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు.రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకులు రాజకీయాలు చేయడం తగదని మంత్రి హితవు పలికారు. ఫ్యూచర్ సిటీపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ముందుచూపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఫ్యూచర్ సిటీనిఅభివృద్ధి చేస్తున్నారని ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా రాష్ట్రానికి వివిధ పనుల ద్వారా ఆదాయం పెరుగుతుందని మంత్రి అడ్లూరి అన్నారు.కొనుగోలు ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వ తీరు కారణమని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి న ఆన్‌లైన్ యాప్ ద్వారా 15 రోజులపాటు కొనుగోలు లో జాప్యం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకొని పాత పద్ధతిలోని ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇచ్చారని మంత్రి వివరించారు. రవాణా, హమాలి సమస్యలను పరిష్కరించి కొనుగోలు వేగవంతం చేస్తామని మంత్రి వివరించారు.మంత్రి వెంట జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ స మిండ్ల వాణి, జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడునందయ్యతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### రైతులకు ఇబ్బంది కలిగిస్తే మిల్లర్లపై చర్యలు తప్పవు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే మిల్లర్లు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మద్దులపల్లి చౌరస్తా వద్ద గల పాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తూకం విషయంలో రైతులు నష్టపోకూడదని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం కొనుగోళ్లు జరగాలని, రైతులకు అనవసరమైన కోతలు పెట్టి ఇబ్బంది గురిచేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, సర్పంచ్ వెలమ బలరాం రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఓరుగల శ్రీనివాస్, ఏలగొండ కృష్ణ హరి, ఆరెల్లి స్వామి, ధనాల సురేష్, జక్కుల మల్లేశం, రామాంజనేయులు, పిఎసిఎస్‌సిఇఒ తడకమట్ల గోపాల్ రెడ్డి, సిబ్బంది బొమ్మన అనిల్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, పాల్గొన్నారు.

## జనగణన -2027 విజయవంతానికి ప్రజలుభాగస్వామ్యం కావాలి



ప్రజాపక్షం/ సిద్దిపేట : జనగణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా ప్రజలు చురుకుగా భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వం కల్పించిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. జనగణన 2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనాన్ని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ప్రణాళికలు,సంక్షేమ పథకాల రూపకల్పన, వనరుల పంపిణీ వంటి కీలక అంశాల జనగణన ఆధారంగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రచార వాహనం ద్వారా సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లాలోని అన్ని మండలాలు. మున్సిపాల్టీలు 20 రోజుల పాటు పర్యటిస్తూ పాటలు, సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలలకు జనగణన ప్రాముఖ్యతను వివరిస్తామని తెలిపారు. జనాభా లెక్కల నమోదు ప్రక్రియలో ప్రతి కుటుంబం తమ పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించటం అవసరమని కలెక్టర్ చెప్పారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు ఈనెల 10ల తేదీవరకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు తమ మోబైల్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డిపిఆర్ఓ రవికుమార్, కలెక్టరేట్ ఎఓ రాజ్‌కుమార్, డిపిఆర్ఒ సిబ్బంది రాంబాబు, సాంస్కృతిక సారధి కళాకారులు కళాంజలి రాజేశ్, వెంకటపురం రవి, డప్పుబాబు, కొమ్ము రవి. ఎల్లం, రవి తిరుమలేశ్, భార్గవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటిఐలు), ఎటిసిలలో 2026–27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్, కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సి మెమో, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, టిసి తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు [ITI Telanganaవెబ్‌సైట్] (https:/ /iti.tela ngana. gov.in/ ?utm_source=chatgpt.com) ద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని,అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడిని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడిని ఐటిఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు.రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటిఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. శుక్రవారం రగుడు, చంద్రంపేట ముష్టిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. నిన్నటి రోజున కురిసిన అకాల వర్షంతో తడిసిన ధాన్యం రైతులను కలిసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందే ప్రారంభించి ఉంటే రైతులకు ఈ కష్టాలు తప్పేవని అన్నారు. కచ్చితంగా రైతులు పండించిన చివరి గింజ వరకు నానిన ధాన్యంతో సహా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసే క్రమంలో 42 కిలోల 600 గ్రాములకు తూకం వేస్తున్నప్పటికి రైస్ మిల్లుల్లో ధాన్యం దించుతున్నప్పుడు అక్కడ ఒక లారీ లోడ్ వెంబడి సుమారు 6 క్వింటాళ్ల వరకు తక్కువగా చూపిస్తున్నారన్నారు. దీనివల్ల రైతులు చాలా ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. లారీల, హమాలీల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ధాన్యం కొనుగోలు నిర్వహణ చేస్తున్న మెప్మా సంస్థ రైతులకు టార్పరిండ్లను ఇవ్వాలని కోరారు. మున్సిపల్ విప్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్ సభ్యులు, మొగిలి నాగరాజు, మాజీ కౌన్సిలర్ సభ్యులు పాతూరి రాజిరెడ్డి, మెప్మా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 'రాజాపూర్' సమస్యలు పరిష్కరించండి

### ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/రామగిరి: రామగుండం 3 ఏరియా ఓసీ2 విస్తరణలో భాగంగా ఇండ్లు, భూములు కోల్పోతున్న రాజాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు. గతనెల 28న తేదిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల. తిరుపతి యాదవ్, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల. భాగ్యలక్ష్మి , కొమురయ్య గ్రామ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ఆనుకుని ఉన్న భూములకు, ఇండ్లకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామంలో టెంపరరీ నెంబర్లు కేటాయించిన ఇండ్లకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాజాపూర్ గ్రామ శివారులో(ఆదివారంపేట) 18ఎకరాలకు 14 ఎకరాలే తీసుకున్నారని, మిగతా 4ఎకరాల్లోని ఇండ్లని, భూములను తీసుకోవాల్సిందిగా కోరారు. సింగరేణి బ్లాస్టింగ్ల వల్ల గ్రామంలోని కొన్ని ఇండ్లు పగుళ్లు ఏర్పడి కూలిపోయే దశలో ఉన్నాయని, కావున వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతేకాకుండా రాజాపూర్ గ్రామానికి సంబంధించి కుల, నివాసం, ఆదాయ సర్టిఫికెట్లు నిలిపివేశారని వెల్లడించారు. దానివల్ల గ్రామస్తులు, ముఖ్యంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ మంథని ఆర్డీవో, రామగిరి తహసీల్దార్, ఆర్జీ3 జీయంకు రాజాపూర్ గ్రామంలోని సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## రోడ్డెక్కిన మొక్కజొన్న రైతులు

### నిర్వాహకుడిని తొలగించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టాలంటూ రైతుల విజ్ఞప్తి



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మొక్కజొన్న రైతుల ఆగ్రహం చెలరేగింది. గత 45 రోజులుగా మొక్కజొన్న కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో విసిగిపోయిన రైతులు శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం గేటు ఎదుట రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. సుమారు గంటపాటు బైఠాయించి నిర్వాహకుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, నిర్వాహకుడి అలసత్వం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని రైతులు మండిపడ్డారు. వెంటనే ప్రస్తుత నిర్వాహకుడిని తొలగించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ,50 కిలోలకు కాంట పెట్టాల్సింది 52 కిలోలు కాంట పెడుతూ రైతులను మోసం చేస్తున్నారు. తూకాల్లో భారీ అవకతవకలు జరుగుతుండడమే కాకుండా చికెన్, తంసప్ ఇస్తే నిర్వాకుడు తూకం వేస్తున్నాడని రైతులు ఆరోపించారు.గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి యార్డులో ఉన్న మొక్కజొన్న తడిసిపోవడంతో రైతులం తీవ్ర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కూలీల ఖర్చులు నిర్వాహకులే భరించాలని రైతులు డిమాండ్ చేశారు.ఆందోళన సమాచారం అందుకున్న తహసీల్దార్ వరప్రసాద్, ఎస్ఐ నవీన్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం ఫోన్ ద్వారా మార్క్‌ఫెడ్‌డిఎంకు రైతుల సమస్యలను తహసీల్దార్ వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా నిర్వాహకుడు రాజేందర్ ను తొలగించి మార్క్‌ఫెడ్‌ఆధ్వర్యంలో వేరే వారినినియమించి కొనుగోలు బాధ్యతలను అప్పగిస్తామని మార్క్‌ఫెడ్‌డిఎం ఫోన్లో మాట్లాడిన విషయాన్ని రైతులకు వివరించడంతో రైతులు ఆందోళన విరమించారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మొక్కజొన్నరైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు నల్ల రమేష్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, సింగిల్ విండో చైర్మన్ జిల్లాల పవన్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం తనిఖీ



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లోని ఇవిఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్‌డిఒ మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కిషన్ ,జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలులో ఇబ్బంది కలగొద్దు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం, కల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం, ఓదెల మండలంలోని పోత్కపల్లి, ఓదెల మండల కేంద్రం, సుల్తానాబాద్ మండలంలోని రేగడి మధికుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.అలాగే సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలోని జై హనుమాన్ రైస్ మిల్, సాంబశివ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కనకమహాలక్ష్మి రైస్ మిల్, సుగ్లంపల్లి గ్రామంలోని లక్ష్మీ భవాని రైస్ మిల్లులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు.నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని సూచించారు.రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం స్వీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్‌లో వేగం

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రం, ఎగ్లాస్ పూర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నాగారం, కనగర్తి గ్రామాల్లో ఐకెపిఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొలనూర్ గ్రామంలోని మారుతి రైస్ మిల్లును, కనగర్తి గ్రామంలోని సరస్వతి, కనకదుర్గ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను అధికారులు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వాహనాల ద్వారా తరలించిన ధాన్యం బస్తాలను వేగంగా దింపుకొని, తిరిగి వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని రైస్ మిల్లర్ల యజమానులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం అన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతుందని, దీని వల్ల కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు ఎక్కువ సంఖ్యలో నిల్వ ఉంటున్నాయని అన్నారు. హమాలీల సంఖ్యను పెంచుకుని అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తనిఖీలో కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి , నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

### 9.50 తులాల బంగారు నగలు స్వాధీనం* సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రశ్మీపేరుమాళ్




ప్రజాపక్షం/ సిద్దిపేట : అంతర్ జిల్లా పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న 5గురు నిందితులను అరెస్టు చేసి 9.50 తులాల అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రశ్మీపేరుమాళ్ వెల్లడించారు. శుక్రవారం సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దొంగల ముఠా అరెస్టు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా అచ్చంపేట మండల కేంద్రానికి చెందిన ఆవుల నాగమణి (34) అదే జిల్లాకు చెందిన ఆవుల లక్ష్మి (44) కంకణాల మరియమ్మ (60), యాతం కోటేశ్వర్ రావు (40), గంజనబోయిన దినేశ్ (17)లు డబ్బులు సంపాధించాలని ముఠాగా ఏర్పడ్డారు. బస్సులు, ఆటోలో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు అభరణాలు, నగదును దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. దొంగల ముఠాలో ముగ్గురు మహిళలు ఒకే కుటుంబానికి చెందిన అక్క చెల్లెళ్లు,తల్లి ఉన్నట్లు తెలిపారు. దొంగతనాలు చేసిన అనంతరం పారిపోవటానికి కిరాయికి ఇన్నోవా తీసుకున్నట్లు తెలిపారు. గత పదిరోజుల క్రితం గుంటూరులో ఒక ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధమహిళ చేతిలో ఉన్న బ్యాగును గమనించి అందులో విలువైన వస్తువులు ఉన్నాయని గమనించి ఆమెను ఏమార్చి బ్యాగులో నుండి బంగారు నెక్లెస్ దొంగతనం చేసినట్లు తెలిపారు. గత నెల 30న యాదగిరిగుట్ట నుండి వచ్చిన ఈ ముఠా జనగామ జిల్లా బచ్చన్నపేట బస్టాండ్ వద్ద ఒక కుటుంబం వద్ద నల్లటి బ్యాగును గమనించినట్లు తెలిపారు. ఆకుటుంబం సిద్దిపేటకు వెళ్తున్న బస్సులో ఎక్కగా నాగమణి, లక్ష్మి అదే బస్సులో ఎక్కినట్లు తెలిపారు. బస్సులో రద్దీని ఆసరగా చేసుకొని నాగమణి అస్వస్థతగా నటించి బాధితురాలి దగ్గర కూర్చోని బ్యాగు జిప్ మెల్లగా తెరిచి అందులో ఉన్న బంగారు కాసుల పేరును దొంగిలించినట్లు తెలిపారు. అనంతరం చేర్యాలలో దిగిన వీరు ముందుగా సమాచారం ఇచ్చి ఇన్నోవా కారులో ఎక్కి అక్కడి నుండి పారిపోయారు. అదే ఇన్నోవా వాహనంలో చేర్యాల వైపు వస్తుండగా చుంచనకోట ఎక్స్ రోడ్డు అనుమానస్పదంగా కన్పించటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల నుండి రెండు తులాల బంగారు గొలుసు, ఏడున్నర తులాల కాసుల పేరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సిపి రశ్మీ పేరుమాళ్ మాట్లాడుతూ బంగారంధరలు వీపరీతంగా పెరగటంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, వృద్ధులు పిల్లలతో ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేయటంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ అపూర్వ, కానిస్టేబుళ్లు రవి, అశోక్, హోంగార్డులు శ్రీనివాస్, మంజుల, కవితలను సిపి అభినందించారు.

## స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలి: కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జన గణన 2027 లో భాగంగా స్వీయ గ ణన నమోదులో భాగస్వామ్యులు కావాలని, ఈ నెల 10 వ తేదీతో స్వీ య గణన నమోదు గడువు ముగియనుందని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సె న్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు. స్వీయ గణన కోసం https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా లాగిన్ కావాలని సూచించా రు. ఈ మొత్తం ప్రక్రియకు కేవలం 5 నిమిషాల సమయం పడుతుందని, వెబ్ సైట్ పూర్తి స్థాయిలో సురక్షితమని స్పష్టం చేశారు. ప్రజల సమాచారం పూర్తిభద్రంగా ఉంటుందని వెల్లడించారు. 34 ప్రశ్నలకు సరైన స మాచారం నమోదు చేసి ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శా ఖల అధికారులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ/ ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకుని ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అ గ్రవాల్ కోరారు. జనగణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 1855కు సంప్రదించాలని, ఈ నంబర్ 24x 7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

**నేడు జిల్లా కేంద్రంలో మారథాన్..**

జనగణన–2027 తొలి దశపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రం సిరిసిల్లలోని అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు నేడు (శనివారం) ఉదయం 7 గంటలకు మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ మారథాన్ లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## 'మాస్టర్‌మైండ్స్'లో ఉపాధి అవకాశాలు

సంస్థ డీన్ విజయ్‌చందర్

**ప్రజాపక్షం/ఖమ్మం ఎడ్యుకేషన్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో ప్రఖ్యాతి గాంచిన మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆసంస్థ డీన్ డాక్టర్ సిహెచ్.విజయ్‌చందర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్శిటీ పీజి కళాశాలను ఆయన తన అధ్యాపక బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్లేస్‌మెంట్ నిర్వహించి అర్హులైన విద్యార్థులకు తమ సంస్థలో ఉపాధి కల్పిస్తామన్నారు. తొలుత ఆయన పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోపికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అర్హులైనవారికి ఆకర్షణీయమైన వేతనంతో పాటు వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్‌మైండ్ అధ్యాపకుడు నర్సింహారావు, పిజి కళశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్యాంబాబు, డాక్టర్ టి.శేఖర్, డాక్టర్ కె.చలపతిరావు, డాక్టర్ బి. నర్సింహనాయక్, డాక్టర్ గిరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు

## గిరిజన, దళిత మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన

**ప్రజాపక్షం/కూసుమంచి:** మత్స్య పరిశోధన స్థానం, పాలేరు ఆధ్వర్యంలో గిరిజన, దళిత మత్స్యకారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ సహకారంతో, భారతీయ వ్యవసాయ, పరిశోధన మండలి (ఐసిఎఆర్), న్యూఢిల్లీ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నారు. జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అనే అంశంపై జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమానికి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు హాజరయ్యారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఆధునిక మత్స్య పెంపక పద్ధతులపై మత్స్యకారులకు ప్రాయోగిక అవగాహన కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## బూర్గంపాడు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మందా నాగరాజు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల సర్పంచుల సంఘం నూతన కమిటీ ఎన్నికలు శుక్రవారం సారపాకలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మందా నాగరాజును మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 8 మే 2026 నుండి ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించినట్లు సమావేశంలో ప్రకటించారు. నూతన కమిటీ ఎన్నికల సందర్భంగా సర్పంచులు పరస్పరం అభినందనలు తెలియజేసి ఐక్యతకు సంకేతంగా నిలిచారు. అదే విధంగా సంఘం ఉపాధ్యక్షులుగా తాటి వాణి, బానోతు పద్మ, గుమ్మడి కృష్ణవేణి, శర్పా నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూణెం సురేందర్, కోశాధికారిగా కుంజా కొండమ్మలను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా గుండి బాబురావు, బానోతు సరోజ, బొర్రా సుభద్ర, పోతునూరు సూరమ్మ, బొల్లి నిరోషా, బొల్లా సైదమ్మ, తాటి లక్ష్మి, బానోతు నరసింహ, వర్సా మంగమ్మ తదితరులు ఎంపికయ్యారు. సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, సంఘం బలోపేతంలో స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు గుగులోత్ శివరాం నాయక్, లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డిలు తదితరులు పాల్గొని, అభినందనలు తెలిపారు.




## ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని రామానగరం గ్రామంలో కూలీలను కలిసిన ఆయన 15న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఆయన మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి విబి రాంజీ బిల్లు తెచ్చిందని, నిధులు 60%కి కుదించిందని, పని దినాలను వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు బంద్ చేస్తోందని విమర్శించారు. రెండుసార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12,000 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఒంటెద్దు వెంకటమ్మ, మండల అధ్యక్ష కార్యదర్శులు పిల్లి నాగమణి, కువ్వారపు లక్ష్మణరావు, అయినంపుడి సునందరావు తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో పోలీసులపై దాడి యత్నం

**ప్రజాపక్షం/ఖమ్మం/మణుగూరు :** మద్యం మత్తులో పోలీసులపై కత్తితో దాడికి యత్నించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం తొగ్గూడెం వద్ద జరిగింది. శుక్రవారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఓ యువకుడు మద్యం మత్తులో వాహనం నడుపుకుంటూ వస్తున్నాడు. అది గమనించిన పోలీసులు యువకుని వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా మోటార్ సైకిల్‌ను కిందపడేసి కత్తితో పోలీసులపై దాడికి యత్నించాడు. తనను పట్టుకోవాలని చూసినా కత్తితో నరుకుతానంటూ హల్‌చల్ చేశాడు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది.

## కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

**ప్రజాపక్షం/కారేపల్లి :** కారేపల్లి మండలం మాధారంలో నిర్వహిస్తున్న సొసైటీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఆకాల వర్షాలు, గాలి దుమారాల నేపథ్యంలో తహసీల్ధార్ మాదారం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. వర్షాలకు పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. టార్పలిన్ లేని రైతులకు కొనుగోలు కేంద్రం ద్వారా కొన్ని టార్ఫలిన్ అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో ప్రారంభించిన అప్పాయిగూడెం మొక్కజొన్న స్టాక్ పాయింట్ మండలం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. దానిని వినియోగించుకోని కల్లాలో ఉన్న మొక్కజొన్న పంటను తరలింపుకు సొసైటీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్ధార్ వెంట సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఆర్ఐ జగదీశ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా నాయకులు కిలారి అప్పారావు, రైతులు కోయశేషయ్య, భూక్య లాలు తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షానికి తడిసిన పంటలు

# మద్దతు ధరకే కొనుగోలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్

ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు




**ప్రజాపక్షం/పాల్వంచ :** అకాల వర్షానికి తడిసిన వరిధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి తదితర పంటలను ఎటువంటి ఆంక్షలు లేకుండా మద్దతు ధరకు తక్షణమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యవర్గ సమావేశం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో చిల్లాక్రిష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను ప్రభుత్వం త్వరలో జరిపే అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ గృహాలను విడతల వారీగా మంజూరు చేస్తున్నారని, కొందరికే ఇవ్వటం వలన అర్హులైన పలువురు నిరుపేదలు నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో ఇందిరమ్మ గృహాల కమిటీలకు చెందిన వారు చేతివాటం ప్రదర్శించి అర్హులకు పక్కన బెట్టి అనర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, దీనితో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. గ్రామాలలో నిజమైన అర్హులను గుర్తించి ఒకే విడత ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. సర్వే చేసిన పోడు భూములకు ఎటువంటి హక్కు పత్రాలు ఇవ్వకపోగా అటవీ అధికారులు ట్రంచ్‌లు తీస్తామని, మొక్కలు నాటుతామంటూ పోడు రైతులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనితో గత కొన్ని ఏండ్లుగా పోడు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్న పేదలు తమ భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకొంటే జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావునా సర్వే చేసిన పోడు భూములకు హక్కు పత్రాలను ఇచ్చి, పోడు రైతులను ఆదుకోవాలన్నారు, ఫారెస్ట్ అధికారుల వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, మండల నాయకులు కొంగర అప్పారావు, ఉండ్రాతి రవి, వడ్లకొండ మేరమ్మ, యండూరి ప్రభావతి, వగ్గెల పద్మ, ఇరుకులపాటి సుధాకర్, భూక్యా రమేష్, ఎల్లంకి శివరావు, మేక రాంబాబు, కొంక వెంకటరత్నం, లాల్‌పాషా,మందపాటి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు చేయడంలో సర్కారు విఫలం

తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి చంద్ర నరేందర్

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలకు తడుస్తున్నటువంటి ధాన్యం, మొక్కజొన్నలు షరతులు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు సొసైటీ కార్యాలయంలోని కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలలో వేలాది బస్తాలు ధాన్యం, మొక్కజొన్నలు మూలుగుతున్నాయని అన్నారు. నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాన్ని తీసుకొచ్చిన పంటను తేమ శాతం ఎక్కువగా ఉందని, తాలు ఎక్కువగా, రంగు మారింది అంటూ అధికారులు పలు విధాలుగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పంట వివరాలను నమోదు చేయడానికి యాప్ మూసివేశారని, దీనిపై అవగాహన లేక పంట వివరాలు నమోదు చేయలేదని తెలిపారు. అధికారులు రైతు యాప్‌ను నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఎల్లంకి మధు తూము కోటయ్య, సిరిపురపు వెంకటేశ్వర్లు, గార్లపాటి వీరభద్రం, ఎల్లంకి శీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## తాండ్ర లలితాదేవి భౌతికకాయానికి ఘన నివాళులు

**ప్రజాపక్షం/ములకలపల్లి :** మండల పరిధిలోని పొగళ్లపల్లి గ్రామంలో తాండ్ర లలితాదేవి భౌతికకాయానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఊకంటి గోపాలరావు, పైడి వెంకటేశ్వర్లు, బత్తుల అంజి, తాండ్ర ప్రభాకర్, మోరంపూడి అప్పారావు, నరాటి ప్రసాద్, పర్వతనేని అమర్నాథ్, మంగపతి, సెనగపాటి సీతారాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాయిబాబా పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, దుర్గా ప్రసాద్, నూకల రంగరావు, ముదిగొండ రాంబాబు, ఊకంటి రవి, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై నివాళులర్పించారు.

# రైతుకు భారంగా మారుతున్న ఎరువులు

ఏటేటా ధరలు పైపైకి

ఏడాదిలో 1 లక్ష మెట్రిక్ టన్నుల ఎరువుల వాడకం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులు వ్యవసాయం చేసేందుకు ఎరువులు పెద్ద భారంగా మారుతున్నాయి. ఏడాదికేడాది ఎరువుల ధరలు పైపైకి పోతున్న క్రమంలో అన్నదాత పెట్టుబడులు పెట్టలేక అయోమయ స్థితికి చేరుకుంటున్నాడు. ప్రతీ ఏటా వానా కాలంలో సీజనల్లో జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు చేస్తుంటారు. ఇందు కోసం సుమారు 1 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల వాడకం ఉండే అవకాశం ఉంది.

**ధరలు పైపైకి :** ఎరువుల ధరలు పైపైకి పోతున్నాయి. ఇందుకు పలు రకాల కారణాలే చెబుతున్నాయి కంపెనీలు, ఈ ఏడాది యుద్ధ వాతావరణం, తయారీ ముడి సరుకు పెరిగిపోవడం, ఇతర దేశాల నుండి సహజ వాయివు సరఫరా సరిగా లేకపోవడంతో ఈసారి ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు అంతా భావిస్తున్నారు. పొటాష్, కాంప్లెక్స్ ధరలు అమాంతం పెరిగాయి. 202020 పాత ధర రూ.1500 ఉండగా ప్రస్తుతం రూ.1800లకు చేరింది. 191919 ధర రూ.2075 ఉండగా ఇప్పుడు రూ.2300లకు చేరుకుంది. 123216 ఎరువు పాత ధర రూ.2025 ఉండగా, ఇప్పుడు రూ 2250 అయ్యింది. 143514 ఎరువు పాత ధర రూ.2175 ఉండగా ప్రస్తుతం అది రూ.2250కి చేరింది. పొటాష్ పాత ధర రూ.1850 ఉండగా, ఇప్పుడు రూ.1975కు చేరుకుంది. శాస్త్రవేత్తల సూచనలతో రైతులు డిఎపి, యూరియా వాడకాన్ని తగ్గించారు. కానీ కాంప్లెక్స్ ఎరువుల అధికంగా పెరుగుతున్నాయి. జిల్లాలో వ్యవసాయం చేసే వారు ఎక్కువగా ఉండటంతో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాలు తదితర పంటలు పండిస్తున్నారు. ఇదిలా ఉండగా పశు సంపద క్రమంగా తగ్గిపోతుండటంతో పంటలకు పోషకాలను చేర్చేందుకు ఎరువుల వాడకం తప్పడం లేదని రైతులు అంటున్నారు. పంటలు కాపాడుకునేందుకు ప్రస్తుతం పెరిగిన ధరలను చూస్తే జిల్లా వ్యాప్తంగా రైతులపై కోట్ల రూపాయాల అదనపు భారం పడుతోందని రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సహాయం అందిస్తున్నప్పటికీ ప్రతీ ఏటా పెరుగుతున్న ధరలతో అవి ఎటూ సరిపోవడంలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.




# మంత్రిగా తుమ్మల 40 వసంతాలు

సత్తుపల్లిలో ఘనంగా వేడుకలు

భావోద్వేగంతో మాట్లాడిన తనయుడు డాక్టర్ యుగంధర్

బిఆర్‌ఎస్ పుకార్లకు ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దీటైన కౌంటర్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రభుత్వంలో తొలిసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 వసంతాల వేడుకలను తుమ్మల రాజకీయ పురిటిగడ్డ సత్తుపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన 'తుమ్మల అభిమాన వారోత్సవాల'కు రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో 40 ఏళ్లుగా తుమ్మలతో నడిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. మంత్రి తుమ్మల చేసిన అభివృద్ధి పనులను ఏఐ వీడియో ద్వారా ప్రదర్శించగా అభిమానులు, కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు.

తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ భావోద్వేగంగా మాట్లాడుతూ సత్తుపల్లి ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేం. మా నాన్న ఏ శాఖలో ఉన్నా, ఏ నియోజకవర్గంలో ఉన్నా ఆయన శ్వాస, ధ్యాస సత్తుపల్లిపైనే ఉంటుంది అని అన్నారు. అనంతరం కాంగ్రెస్, తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



**బిఆర్‌ఎస్ పుకార్లపై ధ్వజం..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు రాజకీయ కుట్రలో భాగంగా చేస్తున్న పుకార్లకు ఘాటుగా సమాధానమిచ్చారు. "3500 ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు మట్టి, ఇసుక లేకుండా ఎలా జరుగుతాయన్నారు. గత ప్రభుత్వాలు ఇళ్లు ఇవ్వకుండానే మట్టి, ఇసుక అక్రమ రవాణా చేశాయని, భూములు దోచుకున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ చౌదరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, వినుకొండ కృష్ణ, ఎన్ఎస్‌యుఐ నాయకులు, డీసీసీ నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు

ఎస్‌బిఐ రీజినల్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల మౌన నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం :** బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ పక్షాన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ నాయకులు కె. రాంబాబు హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఎస్‌బిఐ ఖమ్మం రీజినల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు మౌనం పాటించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కె.రాంబాబు మాట్లాడుతూ ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ప్రభుత్వం ముందు 16 డిమాండ్లను ఉంచిందన్నారు. మూడు దశాబ్దాలుగా నిలిచిపోయిన మెసెంజర్ల నియమాకాలు చేపట్టడం ఆర్మ్‌డ్ గార్డుల నియమాకం, ఎన్‌పిఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మార్చుకునే అవకాశం కల్పించడం సహా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడం జరిగిందన్నారు. శాశ్వత ఉద్యోగాల అవుట్‌సోర్సింగ్ నిలిపివేయడం, తగిన సిబ్బందిని నియమింకపోవడం ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిందని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



## సోలార్ ప్రాజెక్టు ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : కలెక్టర్ దివాకర్

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** లాభంతో కూడిన వ్యాపారం సృష్టించుకుని మరొకరికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఖమ్మంజిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. శుక్రవారం ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో ఇందిరా మహిళా శక్తిపథకం కింద నిర్మాణంలో ఉన్న ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతకు బలమివ్వడం పథకం ముఖ్యలక్ష్యమని అన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కచే త్వరలో ప్రారంభించనున్న పవర్ ప్లాంట్‌కు అవసరమైన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్లాంట్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై పూర్తిగా అవగాహన మహిళ సంఘాలకు కల్పించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఇందిరా మహిళా డైరీని సందర్శించారు. డైరీ నిర్వహణను పరిశీలించి తగిన సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమండో డిఆర్‌డిఓ కొండపల్లి శ్రీరామ్, రెడ్కో డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.అజయ్‌కుమార్, డిఆర్‌డిఓ ఎపిడి జయశ్రీ, ఎడిఏ విజయచందర్, ఎర్రుపాలెం తహసీల్దార్ ఉషాశారద, ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, చైతన్య మహిళా సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాద బాధితులకు సత్వరమే న్యాయం : దివ్వెల డిమాండ్

**ప్రజాపక్షం/మధిర :** ఖమ్మం జిల్లా మధిర సాయిబాలాజీ కోల్ట్‌స్టోరేజి అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే న్యాయం చేయాలని రైతు పోరాట కమిటీ నాయకులు దివ్వెల వీరయ్య, పడకంటి మురళీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతులతో ధర్నా నిర్వహించారు. అనంతరం మధిర తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాద ఘటనలో తమ కళ్ల ఎదుటే మిర్చి పంట కాలి బూదిదైపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడ్డారన్నారు. రైతులకు మనోధైర్యం కల్పించి వారి కుటుంబాల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం చేయాలని, అదేవిధంగా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి నూరుశాతం నష్టపరిహారం ఇప్పించేలా అధికార యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేలప్రోలు రాధాకృష్ణ, బాధిత రైతులు పాల్గొన్నారు.

## పార్టీలు మారడం తప్ప ఒరిగిందేమీ లేదు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో గడిచిన ఐదేండ్ల కాలంలో కౌన్సిలర్లు పార్టీలు మారడం తప్ప పెద్దగా ఒరిగింది ఏమి లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. వ్యక్తిగత లబ్ది కోసం కార్పొరేటర్లు పార్టీలు మారడంతోనే సరిపుచ్చుకున్నారన్నారు. శుక్రవారం లెనిన్ నగర్‌లో జరిగిన సిపిఐ సమావేశంలో సలాం మాట్లాడుతూ ఒక చోట నిర్మించడం మరో చోట తవ్వడంతో డివైడర్లు, డ్రైన్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తీర్చేందుకు ముందస్తు ప్రణాళిక లేదని సలాం తెలిపారు. అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎస్‌కె చానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, నాయకులు ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు, ఎండి రెహ్మాన్, సతీష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తలసేమియా దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్తం ఎక్కించడం ఎంతో ముఖ్యమని రక్తదాన విషయంలో మా సహకారం ఉంటుందని ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, ఐఎంఏ అధ్యక్షురాలు రేహనాబేగం తెలిపారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని శుక్రవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎసిపి రమణమూర్తి మాట్లాడుతూ సంకల్ప స్వచ్ఛంద సంస్థతో తనకు అనుబంధం ఉందని తలసేమియా చిన్నారుల కోసం సంకల్ప సంస్థకు పలుమార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో కూడా శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. తలసేమియా చిన్నారులకు రక్తం కావాలంటే పోలీస్ శాఖ తరుపున తాను సహకరిస్తానని తెలిపారు. ఐఎంఏ అధ్యక్షురాలు రేహనాబేగం మాట్లాడుతూ తలసేమియా చిన్నారులు జీవితంలో మంచిగా చదువుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు. రక్తదానంతో పాటు ఇతర ఏ అంశంలోనైనా తన సహకారం ఉంటుందని తెలిపారు. తలసేమియా జన్యుపరమైన వ్యాధి అని దీనిని దృష్టిలో ఉంచుకుని గర్భిణీలు రోటిన్ హిమోగ్లోబిన్, ఎలక్ట్రోఫ్లోరోసిస్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. పెళ్లికి ముందు కూడా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు.

## ప్రతిపక్ష ఉపనేత పదవికి
# పట్టుబడుతున్నాం

**• కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం**



**తిరువనంతపురం :** కేరళలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ విజయం సాధించింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ ఇక ప్రతిపక్ష పాత్రను పోషించనుంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడి హోదా కోసం తమ పార్టీ పట్టుబడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం తెలిపారు. శుక్రవారం ఆయన తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి పదవి సిపిఐ(ఎం)కే దక్కుతుందని విశ్వం పేర్కొన్నారు. అయితే, ప్రతిపక్ష ఉప నాయకుడి పదవిని మాత్రం సిపిఐ కోరుతుందని ఆయన చెప్పారు. 'ఇందులో అనేక సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి. కానీ వాటిని అధిగమించే శక్తి ఎల్‌డిఎఫ్‌కు ఉంది. గతంలోనూ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడి పదవి ఉండేది, అది మళ్ళీ సాధ్యమే' అని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు స్వీకరించడంపై సిపిఐ ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ఆ విషయాన్ని నిర్ణయించాల్సింది సిపిఐ(ఎం) మాత్రమేనని ఆయన తెలిపారు. ఒకే ఉమ్మడి లక్ష్యం కోసం పని చేస్తున్న అనేక పార్టీల కూటమి అయిన ఎల్‌డిఎఫ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విశ్వం అభిప్రాయపడ్డారు. ఒక కూటమిలో రాజకీయ సంస్కృతి, పరస్పర సంప్రదింపులు, చర్చలు, అవగాహన తప్పనిసరిగా ఉండాలి అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఎదురైన పరాజయానికి అనేక కారణాలు ఉన్నాయని, కేవలం ఒక్క పార్టీని మాత్రమే దానికి బాధ్యురాలిని చేయలేమని ఆయన పేర్కొన్నారు. 'మేము సిపిఐ(ఎం)ను విమర్శించడానికి సిద్ధంగా లేము. సిపిఐ(ఎం), సిపిఐ రెండు పార్టీల వైపు నుంచీ దిద్దుబాటు చర్యలు అవసరం. ఈ దశలో మనం సిపిఐ(ఎం)ను ఏకాకిని చేయకూడదు. ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన విషయం ఎల్‌డిఎఫ్ ఐక్యతను కాపాడటమే' అని విశ్వం అన్నారు. ఎల్‌డిఎఫ్‌లో సిపిఐ కీలక భాగస్వామ్య పక్షమని, ఈ కూటమి ప్రాముఖ్యతను తాము పూర్తిగా అర్థం చేసుకున్నామని విశ్వం తెలిపారు. సిపిఐ వివిధ అంశాలను బహిరంగంగా లేవనెత్తుతుంది, కానీ అది వామపక్ష కూటమిని బలహీనపరిచే ఉద్దేశంతో మాత్రం కాదని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంతో 'పిఎం శ్రీ' ఒప్పందం కుదుర్చుకునే విషయంలో సిపిఐ(ఎం) నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సరిదిద్దడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని కూడా ఆయన గుర్తు చేశారు. 'పిఎం శ్రీ ఒప్పందంతో ముందుకు వెళ్లడానికి ఒక ప్రయత్నం జరిగింది, కానీ ఆ ప్రయత్నాన్ని ఎల్‌డిఎఫ్ కూటమి సమష్టిగా గుర్తించి సరిదిద్దింది. ఆ దిద్దుబాటు చర్యలో సిపిఐ పాత్ర ఉంది, ఆ విషయం అందరికీ తెలిసిందే' అని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్ పునాదులు వామపక్ష విలువలు, సిద్ధాంతాలపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన తెలిపారు. వామపక్ష విలువలను పరిరక్షించడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, భవిష్యత్తులోనూ ఆ పాత్ర కొనసాగుతుందని విశ్వం వెల్లడించారు. 140 మంది సభ్యులు కలిగిన కేరళ శాసనసభ ఎన్నికల్లో, కేవలం 35 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఎల్‌డిఎఫ్‌లో రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన సిపిఐ ఎనిమిది స్థానాలను గెలుచుకుంది.

## తమిళ గవర్నర్ తీరును వ్యతిరేకిస్తూ...
# టివికె, కాంగ్రెస్ నిరసనలు





**చెన్నై :** తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన టివికెకు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అవకాశం కల్పించకపోవడంపై కాంగ్రెస్, టివికె పార్టీలు వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం నీలంగరైలోని టివికె అధినేత విజయ్ నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు భారీ సంఖ్యలో గుమిగూడటంతో హైడ్రామా చోటుచేసుకుంది. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి విజయ్ ధరిస్తున్న లేత గోధుమరంగు ప్యాంటు, తెల్ల చొక్కా కలయికతో కూడిన టివికె 'యూనిఫాం'లో కొందరు మద్దతుదారులు ఉండటంతో, విజయ్‌ను శాశ్వత ముఖ్యమంత్రిగా కీర్తిస్తూ నినాదాలు చేయడంతో అక్కడి వాతావరణం ఉద్రిక్తంగా మారింది. భద్రతా సిబ్బంది, స్థానికులు అడ్డుకునేలోపు, మోటార్‌సైకిల్‌పై వస్తున్న ఒక మద్దతుదారుడు కాపలా ఉన్న ప్రాంగణం బయట అకస్మాత్తుగా ఆగి విజయ్‌కు మద్దతుగా నినాదాలు చేయడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కార్యకర్తలు 'తలపతి వాజ్గా', 'ఎంద్రెండ్రు ముదల్వార్' (శాశ్వత ముఖ్యమంత్రి) వంటి నినాదాలు చేశారు. అయితే జనసమూహం అంతకంతకూ పెరిగిపోవడంతో, స్థానిక పోలీసులు, ప్రైవేట్ భద్రతా సిబ్బంది శాంతిభద్రతలను కాపాడటానికి తీవ్రంగా శ్రమించారు. కొందరు కార్యకర్తలు తమ నాయకుడిని కలిసేందుకు ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించగా, మరికొందరు శాంతంగా ఉండాలని, మద్దతుదారులు సహనం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, గత రెండు రోజులుగా నిరసనలు కొనసాగుతున్న లోక్‌భవన్ వద్ద, ప్రభుత్వ ఏర్పాటులో జాప్యానికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన అనంతరం, సురేష్ అనే పార్టీ సభ్యుడితో సహా పలువురు టివికె కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నర్ నివాసం బయట గుమిగూడిన నిరసనకారులు, విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. లోక్‌భవన్ చేస్తున్నది అన్యాయమైన జాప్యమని వర్ణిస్తూ టివికె కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజల తీర్పును విస్మరిస్తే 'భారీ ప్రజా వ్యతిరేకత' ఎదురవుతుందని మద్దతుదారులు హెచ్చరించారు.

**రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు**

గవర్నర్‌ను తీరును వ్యతిరేకిస్తూ తమిళనాడు కాంగ్రెస్ కమిటీ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. చెన్నైలోని అన్నా సాలై వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహిస్తూ, తమిళనాడు ఎఐసిసి ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్, టిఎన్‌సిసి అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కనుసన్నల్లో నడిచే కీలుబొమ్మలా రాజ్‌భవన్ వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. నిరసన స్థలంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటులో గవర్నర్ చేస్తున్న జాప్యంపై చోడంకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'గవర్నర్‌కు ఒక నిర్దిష్ట బాధ్యత ఉంది, కానీ ఆయన (కేంద్ర హోం మంత్రి) అమిత్ షా ఆదేశాలను పాటిస్తున్నారు. అదే ఆయన సమస్య' అని అని చోడంకర్ ఆరోపించారు. తమిళనాడులో బిజెపి లేదా ఆర్‌ఎస్‌ఎస్ పాలన ప్రవేశించడాన్ని చూడటానికి అనేక లౌకిక పార్టీలు సిద్ధంగా లేవని, అవి కచ్చితంగా దీనిని వ్యతిరేకిస్తాయని తనకు నమ్మకం ఉన్నట్లు చోడంకర్ పేర్కొన్నారు. డిఎంకె నేతృత్వంలోని కూటమి నుండి తమ పార్టీ ఇటీవల వైదొలగి, విజయ్ స్థాపించిన టివికెకు మద్దతు ఇవ్వడం గురించి ప్రస్తావిస్తూ, డిఎంకె చేసిన వెన్నుపోటు ఆరోపణలను చోడంకర్ కొట్టిపారేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని, తాము ప్రజల తీర్పును గౌరవించామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏకైక అతిపెద్ద పార్టీని గవర్నర్ వెంటనే ఆహ్వానించాలని సెల్వపెరుంతగై డిమాండ్ చేశారు.

## లోక్‌సభలో
# సీట్లు మార్చండి

**• లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాకు డిఎంకె లేఖ**



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో తమ ఎంపిల సీట్ల కేటాయింపులో మార్పు చేయాలని డిఎంకె శుక్రవారం కోరింది. కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసిందని, కాంగ్రెస్ సభ్యుల పక్కనే తమ సభ్యులు కూర్చోవడం సముచితం కాదని ఆ పార్టీ పేర్కొంది. మారుతున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సీట్ల కేటాయింపులో మార్పులు చేయాలని కోరుతూ డిఎంకె నాయకురాలు కనిమొళి కరుణానిధి లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాకు లేఖ రాశారు. 'లోక్‌సభలో ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) కు చెందిన పార్లమెంటు సభ్యుల సీట్ల కేటాయింపులో తగిన మార్పులు చేయాలని నేను వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను. మారుతున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, భారత జాతీయ కాంగ్రెస్‌తో మా పొత్తు ముగిసిపోయినందున, సభలో వారి పక్కనే ప్రస్తుతం ఉన్న సీట్లలో మా సభ్యులు కొనసాగడం సముచితం కాకపోవచ్చు' అని తూత్తుకుడి ఎంపి బిర్లాకు రాసిన తన లేఖలో పేర్కొన్నారు. డిఎంకె పార్లమెంటరీ పార్టీ సభ్యులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆమె స్పీకర్‌ను కోరారు, తద్వారా వారు సభలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలుగుతారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఐదు సీట్లు మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్, ప్రభుత్వం ఏర్పాటులో టివికెకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. తద్వారా తన పాత మిత్రపక్షమైన డిఎంకెతో ఉన్న పొత్తుకు ముగింపు పలికింది. డిఎంకెతో ఎన్నికల పూర్వ పొత్తులో భాగంగానే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. ఈ పరిణామం రెండు పార్టీల మధ్య వైమనస్యానికి దారితీసింది; కాంగ్రెస్ తీసుకున్న ఈ చర్యను డిఎంకె సీనియర్ నాయకులు 'వెన్నుపోటు', 'ద్రోహం' అని అభివర్ణించారు. అయితే, కాంగ్రెస్ మాత్రం తన చర్యను సమర్థించుకుంది.

# ఖర్గేకు చేరిన కేరళ సిఎం ఎంపిక నివేదిక

**న్యూఢిల్లీ :** కేరళలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించడానికి నియమితులైన ఇద్దరు కాంగ్రెస్ పరిశీలకులు, శుక్రవారం తమ నివేదికను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సమర్పించారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం తీసుకోవాలని వారు పార్టీ అధిష్టానాన్ని కోరారు. అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో పాటు పార్టీ ఎంపిలతోనూ మాట్లాడి, తమ పరిశీలనలను పార్టీ నాయకత్వానికి సమర్పించారు. ఈ ఇద్దరూ బుధవారం కేరళకు వెళ్లి, గురువారం శాసనసభ్యులు, ఎంపీలందరినీ కలిసిన అనంతరం జాతీయ రాజధానికి తిరిగి వచ్చారు. పార్టీ ఎమ్మెల్యేలలో అత్యధికులు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కె.సి. వేణుగోపాల్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి మద్దతు ఇస్తున్నారని, అయితే ప్రజలు మాత్రం గత కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించిన సీనియర్ నేత వి.డి. సతీశన్ వైపు మొగ్గు చూపుతున్నారని వర్గాలు తెలిపాయి. మాకెన్, వాస్నిక్, కొత్తగా ఎన్నికైన పార్టీ శాసనసభ్యులను ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా కలిసినప్పుడు వారు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఖర్గేతో చర్చించారు. వారు పార్టీ ఎంపిలతోనూ, కొంతమంది మాజీ ఎంపిలతోనూ కూడా మాట్లాడారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వేణుగోపాల్, సతీశన్‌లతో పాటు, సీనియర్ నేత రమేష్ చెన్నితాల కూడా ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్నారు. తుది నిర్ణయం తీసుకునే ముందు, పోటీలో ఉన్న ఈ ముగ్గురు అభ్యర్థులను ఖర్గే చర్చల కోసం పిలిచారని ఆ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టడానికి వేణుగోపాల్ కూడా ఆసక్తిగా ఉన్నారని, తన ఎంపిక కోసం పార్టీ నాయకత్వంపై తనకున్న ప్రభావాన్ని వినియోగించుకుంటున్నారని వారు తెలిపారు. రాహుల్ గాంధీతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం అందరికీ తెలిసిందేనని, అది ఆయనకు అనుకూలంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. 140 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో కాంగ్రెస్ సొంతంగా 63 స్థానాలను గెలుచుకోగా, యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) కూటమి మొత్తం 102 స్థానాలను కైవసం చేసుకుని, ఈ దక్షిణ రాష్ట్రంలో తిరిగి పుంజుకుంది.

# మెజారిటీ నిరూపించుకునే అవకాశమివ్వాలి

**• తమిళనాడు పరిణామాలపై ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్య**



**శ్రీనగర్ :** తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా టివికె నాయకుడు విజయ్‌ను అడ్డుకోవడంలో తమిళనాడు గవర్నర్‌కు ఎటువంటి సమర్థన లేదని, అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకునే అవకాశాన్ని కల్పించాలని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం అన్నారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యాబలం తన పార్టీకి లేదని పేర్కొంటూ, టివికె అధినేత విజయ్ చేసిన ప్రభుత్వ ఏర్పాటు ప్రతిపాదనను తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ గురువారం తిరస్కరించారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సాధారణ మెజారిటీని సాధించడంలో తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ వెనుకబడింది. ఐదుగురు ఎమ్మెల్యేలు కలిగిన కాంగ్రెస్ పార్టీ టివికెకు మద్దతు ప్రకటించినప్పటికీ, 234 మంది సభ్యులు కలిగిన తమిళనాడు అసెంబ్లీలో సాధారణ మెజారిటీకి అవసరమైన 118 స్థానాలను సాధించడంలో విజయ్ పార్టీ విఫలమైంది. ఎన్నికల తర్వాత అతిపెద్ద ఏకైక పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, ఆపై సభలో తమ మెజారిటీని నిరూపించుకునే అవకాశం కల్పించాలని నొక్కిచెప్పే అనేక సుప్రీం కోర్టు తీర్పుల దృష్ట్యా, తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించడానికి ఎటువంటి సమర్థన లేదని అబ్దుల్లా అన్నారు. 'మనం సుప్రీం కోర్టు తీర్పులను పరిశీలిస్తే, అక్కడ రాష్ట్రపతి పాలన ఉండకూడదు. ఎన్నికల తర్వాత, అతిపెద్ద ఏకైక పార్టీని (ప్రభుత్వ ఏర్పాటు కోసం) ఆహ్వానించాలని, అసెంబ్లీలో తమ మెజారిటీని నిరూపించుకునే అవకాశాన్ని వారికి కల్పించాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొన్న అనేక సందర్భాలు ఉన్నాయి' అని తమిళనాడులోని రాజకీయ పరిస్థితుల గురించి విలేకరులు అడిగినప్పుడు అబ్దుల్లా ఇక్కడ తెలిపారు. 'వాజ్‌పేయి 13 రోజుల పాటు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు కూడా ఇదే జరిగింది; అప్పుడు భారత రాష్ట్రపతి ఆయన తన సంఖ్యాబలాన్ని చూపించే వరకు వేచి చూడలేదు. భారత రాష్ట్రపతి ఆయన్ని ఆహ్వానించారు, ప్రభుత్వం 13 రోజుల పాటు కొనసాగింది, కానీ వాజ్‌పేయికి తగిన సంఖ్యాబలం లేదని తేలగానే, ఆయన రాజీనామా చేశారు' అని ఆయన గుర్తుచేశారు. కాబట్టి, సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుంటే, ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి తమిళనాడులోని 'లోక్ భవన్' (గవర్నర్ భవన్)కు ఎటువంటి సమర్థన లేదని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి జోడించారు. 'విజయ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించాలి, ఆపై తన మెజారిటీని నిరూపించుకునే అవకాశాన్ని ఆయనకు కల్పించాలి. ఒకవేళ ఆయన మెజారిటీని నిరూపించుకుంటే, ఆయన పదవిలో కొనసాగుతారు; లేదంటే, ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది' అని అబ్దుల్లా అన్నారు. జమ్ముకశ్మీర్‌లో 'సర్' ప్రభావం ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు, ఆ కేంద్రపాలిత ప్రాంతంలో 2029 వరకు అసెంబ్లీ ఎన్నికలు జరగనందున, దాని ప్రభావం ముందుగా దేశంలోని మిగతా ప్రాంతాల్లో చూడాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.'ఇప్పటివరకు 'సర్' బెంగాల్‌లో మాత్రమే జరిగింది. మీరెందుకంత జమ్ముకశ్మీర్ గురించి ఆందోళన? ఇక్కడ 2029 వరకు ఎన్నికలు జరగవు. ముందుగా దేశంలోని మిగతా ప్రాంతాల్లో దీని ప్రభావం చూద్దాం. జమ్ముకశ్మీర్‌లో మేము పడిన కష్టాలన్నీ పడ్డాం. బిజెపికి, దాని మిత్రపక్షాలకు లబ్ధి చేకూర్చేందుకు చేసిన నియోజకవర్గాల పునర్విభజన వల్ల మేము నష్టపోయాం. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం' అని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించనందువల్లే మంత్రివర్గ విస్తరణ నిలిచిపోయిందని అబ్దుల్లా అన్నారు. 'మంత్రివర్గ విస్తరణ ఏ భయం వల్ల నిలిచిపోలేదు. అందుకే, బిజెపికి అధికారం లభించే వరకు మమ్మల్ని సజావుగా పనిచేయనివ్వరని, జమ్ముకశ్మీర్‌ను మళ్లీ రాష్ట్రంగా చేయరని ప్రతిపక్షం ఇలాంటి ప్రకటనల ద్వారా నిరూపిస్తోందని నేను తరచుగా చెబుతుంటాను' అని ఆయన అన్నారు.

# కష్టకాలంలో వదిలి వెళ్లం

**• టిఎంసి, డిఎంకెలకు ఎస్‌పి అధినేత అఖిలేష్ బాసట**



**లక్నో :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన టిఎంసి, డిఎంకెలకు ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ బాసటగా నిలిచారు. 'కష్టకాలంలో వదిలి వెళ్లేవాళ్లం మేము కాదు' అని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తన మిత్రపక్షమైన డిఎంకెతో సంబంధాలు తెంచుకుని, తమిళనాడులో విజయ్ టివికెకు మద్దతు ప్రకటించింది. కాగా, కోల్‌కతాలో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతో, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్‌తో తాను సమావేశమైన ఫోటోలను యాదవ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కష్టకాలంలో వారిని వదిలి వెళ్లేవాళ్లం తాము కాదు అని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ నాయకత్వానికి సంఘీభావం తెలుపుతూ, మాజీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గురువారం కాళీఘాట్‌లోని బెనర్జీ నివాసంలో మమతా బెనర్జీని కలిశారు. బెదిరింపులు, అవకతవకల ద్వారా ఉత్తరప్రదేశ్ నమూనాలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించారని ఆయన ఆరోపించారు. పలు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష పార్టీలు తమ వ్యూహాలను పునఃసమీక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, టిఎంసి ఎన్నికల పరాజయం తర్వాత 'ఇండియా' కూటమిని బలోపేతం చేస్తానని బెనర్జీ ప్రతిజ్ఞ చేసిన తరుణంలో ఈ సమావేశం రాజకీయ ప్రాముఖ్యతను సంతరించుకుంది. బెంగాల్ ఎన్నికలలో బిజెపి, ఎన్నికల సంఘం, అంతర్గత శక్తులు పాలుపంచుకున్న 'బహుళ అంచెల మాఫియా ఎత్తుగడలు' చోటు చేసుకున్నాయని యాదవ్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగినదే బెంగాల్‌లో పునరావృతమైందని, ప్రతిపక్ష పోలింగ్ ఏజెంట్లను బెదిరించారని, భయాందోళనల మధ్య ఓటింగ్ నిర్వహించారని, ప్రతిపక్షం ఓటమిని ఖాయం చేయడానికి కేంద్ర బలగాలను ఉపయోగించారని అఖిలేష్ మండిపడ్డారు. టిఎంసి, డిఎంకె, ఎస్‌పిలు ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి.

# చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్ల నష్టం

**ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం**

**న్యూఢిల్లీ :** ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నాయి. అయినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ముడి చమురు ధర ఒక దశలో యాభై శాతం పెరిగింది. కానీ మన వద్ద చమురు కంపెనీలు ధరలను స్థిరంగా కొనసాగించాయి. దాంతో చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఒక బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల వద్ద ఉండగా.. ప్రస్తుతం 100 డాలర్లకుపైగా పలుకుతోంది. ఒక దశలో 144 డాలర్లకు కూడా చేరుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఇంధన సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాయి. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ, దేశీయ చమురరంగ సంస్థలు పెంచకపోవడంతో ఈ మూడు కంపెనీలు రూ.30 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయి. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్‌పై లీటర్‌కు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దాంతో నష్టాలు రూ.62,500 కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు తగ్గాయి. అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరకు అదనంగా మరి కొన్ని ఖర్చులను భరించాల్సి వచ్చింది. రవాణా నౌకలను దారి మళ్లించడం, బీమా ప్రీమియాలు పెరగడం వంటి ఖర్చులు జత కలిశాయి.

# నౌకలో 'హంటావైరస్'తోనే మరణాలు

**ప్రజారోగ్యానికి ప్రమాదం చాలా తక్కువే: డబ్ల్యుహెచ్‌ఒ**



**జెనీవా :** అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న క్రూయిజ్ నౌకలో జరిగిన మరణాలకు హంటా వైరస్‌తో సంబంధం ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ధ్రువీకరించింది. ఐదు కేసులను గుర్తించగా మరో ముగ్గురు వ్యక్తుల్లో కూడా ఈ వైరస్ ఆండెస్ స్ట్రెయిన్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పరిస్థితి తీవ్రత ఎక్కువగా ఉందని, మరిన్ని ఇన్ఫెక్షన్లు బయటపడే అవకాశం ఉందని డబ్ల్యుహెచ్‌ఒ తెలిపింది. అయితే, దీనివల్ల ప్రజారోగ్యానికి విస్తృత ప్రమాదం చాలా తక్కువగానే ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. గురువారం జరిగిన పత్రికా సమావేశంలో డబ్ల్యుహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఈ మేరకు వివరించారు. 'ఇది ఒక తీవ్రమైన ఘటన అయినప్పటికీ, ప్రజారోగ్య ప్రమాదం తక్కువగానే ఉంటుందని డబ్ల్యుహెచ్‌ఒ అంచనా వేస్తోంది. ఇప్పటివరకు ఎనిమిది కేసులు వెలుగులోకి వచ్చాయి. వారిలో ముగ్గురు మరణించగా, ఐదు కేసులు ధ్రువీకరించారు. మరో ముగ్గురు అనుమానితులు ఉన్నారు. హంటావైరస్ వ్యాప్తి కాలం ఆరు వారాల వరకు ఉండవచ్చు కాబట్టి, మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉంది' అని డబ్ల్యుహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ తెలిపారు. డచ్ జెండా కలిగిన 'హోండియస్' నౌకలో తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతున్న ప్రయాణికుల గురించి యునైటెడ్ కింగ్‌డమ్ తమ సంస్థను అప్రమత్తం చేసిందని వెల్లడించారు. ఈ నౌక ప్రస్తుతం కేప్ వెర్డే నుంచి స్పెయిన్‌లోని టెనెరిఫేకు ప్రయాణిస్తోంది.

**వైరస్‌పై వివరణ ఇచ్చిన డబ్ల్యుహెచ్‌ఒ**

అంతకుముందు ఈ వైరస్ నౌకలోకి ఎలా ప్రవేశించిందన్న దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ఇచ్చింది. ఎంవీ హోండియస్ అనే డచ్ నౌక ఏప్రిల్ 1న అర్జెంటీనా నుంచి బయలుదేరింది. ఏప్రిల్ 6న ఓ డచ్ పౌరుడు తలనొప్పి, జ్వరం లక్షణాలతో అనారోగ్యానికి గురైనట్లు తమకు సమాచారం అందిందని చెప్పింది. ఏప్రిల్ 11న శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి నౌకలోనే ఆయన మరణించారని వివరించింది. మరణించిన వ్యక్తి భార్య కూడా అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అదే నౌకలో ప్రయాణిస్తున్న జర్మన్ మహిళ కూడా న్యుమోనియా మృతి చెందినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

# బెంగాల్‌లో నేడు లెఫ్ట్ ఫ్రంట్ నిరసన ప్రదర్శన




**కోల్‌కాత:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజలపై, ముఖ్యంగా శ్రామిక వర్గాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా లెఫ్ట్ ఫ్రంట్ (ఎల్‌ఎఫ్) ఈరోజు కోల్‌కాతలో నిరసన ర్యాలీ చేపట్టనుంది. బిజెపి సాధించిన నిర్ణయాత్మక విజయం నేపథ్యంలో, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విజయ వేడుకల ముసుగులో విపక్ష కార్యకర్తలపై, కార్మికులపై దాడులు జరుగుతున్నాయని లెఫ్ట్ ఫ్రంట్ ఆరోపించింది. నగరంలోని ఎస్ప్లానేడ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఈ ఆందోళన నిర్వహించనున్నట్లు ఫ్రంట్ ప్రతినిధి ఒకరు తెలిపారు. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేకపోయిన లెఫ్ట్ ఫ్రంట్, ఈసారి ముర్షిదాబాద్లోని డోమ్కల్ స్థానాన్ని కైవసం చేసుకుని తన ఖాతా తెరిచింది. కాగా, ఈ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను బిజెపి 207 స్థానాల్లో భారీ విజయం సాధించగా, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ 80 స్థానాలకు పరిమితమైంది.

# ఢిల్లీ, హర్యానాల్లో ఉగ్రదాడులకు ఐఎస్‌ఐ కుట్ర..




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రదాడులకు పాల్పడేందుకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్‌ఐ కుట్ర పన్నింది. తన లక్ష్యాల జాబితాలో ఢిల్లీ–సోనిపట్ హైవేపై పాపులర్ దాబా, హర్యానాలోని మిలిటరీ క్యాంప్, ఢిల్లీలోని ఓ ప్రముఖ ఆలయం ఉన్నట్లు తెలిసింది. షహజాద్ భట్ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న ఆపరేటివ్‌ల ద్వారా ఈ దాడులు జరిపేందుకు ప్లాన్ చేసింది. ఇప్పటికే ఈ గ్యాంగ్‌లో 9 మంది అరెస్టయ్యారు. ఢిల్లీ పోలీసు విభాగంలోని స్పెషల్‌సెల్ అధికారులు వీరిని విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల్లో ఒకరు ఢిల్లీలోని ఒక ప్రముఖ ఆలయం వద్ద రెక్కీ నిర్వహించారని, అక్కడి ఫొటోలను సోషల్‌మీడియా వేదికల ద్వారా పాక్‌కు చెందిన హ్యాండ్లర్లకు పంపినట్లు గుర్తించారు. ఆలయం వద్ద మోహరించిన సిబ్బంది లక్ష్యంగా కాల్పులు జరిపి, భయాందోళనలు సృష్టించాలని ప్రణాళిక రచించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

# ఒక కాలు బదులు మరో కాలుకు ఆపరేషన్..!

**జైపూర్:** గొడవలో ఒక వృద్ధురాలు గాయపడింది. ఆమె రెండు కాళ్లకు ఫ్యాక్చర్ అయ్యింది. కుడి కాలికి ఆపరేషన్ అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. అయితే పొరపాటు వల్ల మరో కాలికి సర్జరీ చేశారు. ఈ నేపథ్యంలో నిర్లక్ష్యానికి కారణమైన డాక్టర్‌పై చర్యలు చేపట్టారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 66 ఏళ్ల చంపా దేవి ఒక గొడవలో గాయపడింది. దీంతో జోధ్‌పూర్‌లోని ఎండిఎం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమెను చేరారు. కాగా, ఆ వృద్ధురాలికి రెండు కాళ్లు విరిగినట్లు డాక్టర్లు గుర్తించారు. అయితే ఆమె కుడి కాలికి మాత్రమే శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. ఏప్రిల్ 27న ఆపరేషన్ నిర్వహించారు. పొరపాటున వృద్ధురాలి ఎడమ కాలికి ఆపరేషన్ చేసినట్లు బయపడింది. దీంతో నిర్లక్ష్యం ఆరోపణలపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మరోవైపు తాజాగా ఆ కమిటీ నివేదికను సమర్పించింది. పర్యవేక్షణలో నిర్లక్ష్యమే ఈ పొరపాటుకు కారణమని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో ఆర్థోపెడిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకిషన్ చౌదరిపై చర్యలు చేపట్టారు. ఎండిఎం ఆసుపత్రి బాధ్యతల నుంచి ఆయనను తప్పించారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS10UB 4233 | Madhukar Perumandla | MAHINDRA XYLO-P | 2017 |
| 2 | TS25T 0512 | Rajesh Pulusu | EICHER 380 | 2017 |
| 3 | TG038458 (Old Reg No: AP39EQ 5842) | Udutha Rajender | CLASS CT40 M 460 CROP TIGER COMBINE HARVESTER | 2018 |

AUCTION DATE : 09-05-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

# ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం

## అమెరికా కోర్టు తీర్పు




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు న్యాయస్థానంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ టారిఫ్‌లు చెల్లవని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు తేల్చిచెప్పింది. అమెరికా కాంగ్రెస్ అధ్యక్షుడికిచ్చిన అధికారాలను ట్రంప్ అతిక్రమించారని, ఈ టారిఫ్‌లు చట్టబద్ధం కావని త్రిసభ్య ధర్మాసనం 21 మెజారిటీతో తీర్పు నిచ్చింది. సుంకాల విషయంలో అధ్యక్షుడికి చట్టం మరింత వెసులుబాటు కల్పిస్తుందని ఒక న్యాయ వర్తి అభిప్రాయపడ్డారు. గతేడాది ప్రతి దేశంపై ట్రంప్ భారీ టారిఫ్‌లు విధించగా, ఫిబ్రవరిలో అమెరికా సుప్రీం కోర్టు వాటిని కొట్టివేసింది. ఆ వెంటనే ట్రంప్ 'ట్రేడ్ యాక్ట్ 1974'లోని సెక్షన్ 122ను ఉపయోగించి జులై 24 వరకు అమల్లో ఉండేలా ఈ 10 శాతం తాత్కాలిక టారిఫ్‌లు ప్రవేశపెట్టారు. చిన్న వ్యాపారాలు దెబ్బతింటున్నాయని 'బర్లాప్ అండ్ బారెల్', 'బేసిక్ ఫన్' వంటి సంస్థలు కోర్టును ఆశ్రయించగా, వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు నిర్ణయం రెండు వ్యాపార సంస్థలైన బర్లాప్ బారెల్ (సుగంధ ద్రవ్యాల సంస్థ), బేసిక్ ఫన్ (బొమ్మల సంస్థ) నుంచి సుంకాల వసూలును నేరుగా నిరోధించింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం టారిఫ్‌లను నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు ఉంటుందని కోర్టు గుర్తు చేసింది. ట్రంప్ యంత్రాంగం ఈ తీర్పుపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం అప్పీలుకు వెళ్తే, ఈ వివాదం మళ్లీ వాషింగ్టన్‌లోని అప్పీలేట్ కోర్టుకు, ఆ తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. చైనా, ఈ వంటి దేశాలు వస్తువులను అధికంగా ఉత్పత్తి చేస్తూ ధరలు తగ్గిస్తున్నాయనే సాకుతో మరిన్ని కొత్త టారిఫ్‌లు విధించేందుకు ట్రంప్ ప్రభుత్వం అన్వేషిస్తోంది. చైనా, రోపియన్ నియన్, జపాన్‌తో సహా 16 అమెరికా వాణిజ్య భాగస్వాములు వస్తువులను అధికంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ఫలితంగా ధరలు తగ్గి అమెరికా తయారీదారులకు నష్టం కలిగిస్తున్నాయనే విషయాన్ని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం పరిశీలిస్తోంది. నైజీరియా నుంచి నార్వే వరకు ఉన్న 60 ఆర్థిక వ్యవస్థలు (ఇవి అమెరికా దిగుమతుల్లో 99 శాతం వాటాను కలిగి ఉన్నాయి) బలవంతపు కార్మికులతో తయారైన ఉత్పత్తుల వాణిజ్యాన్ని నిషేధించడానికి తగినంతగా కషి చేస్తున్నాయా అనే విషయాన్ని కూడా ఇది దర్యాప్తు చేస్తోంది. ఇదిలా ఉండగా, రోపియన్ నియన్‌కు ట్రంప్ ఓ హెచ్చరిక చేశారు. జులై 4వ తేదీలోగా 27సభ్యుల కూటమి వాణిజ్య చట్టాన్ని ఆమోదించడంలో విఫలమైతే, ఈ నుంచి వచ్చే వస్తువులపై అధిక సుంకాలు విధిస్తామని తెలిపారు. ఈ ఆటోలపై 25 శాతం అధిక సుంకం విధిస్తామని గత శుక్రవారం ట్రంప్ చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ వస్తువులన్నింటిపై సుంకాల రేట్లు పెరుగుతాయని ట్రంప్ సూచిస్తున్నారా లేదా కేవలం ఆటోలకు వర్తిస్తుందా అనేది స్పష్టంగా తెలియలేదు. గత సంవత్సరం కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని రప్ పార్లమెంట్ ఖరారు చేయకపోవడంపై ట్రంప్ అసంతృప్తితో వున్నారు.

# హోర్ముజ్‌పై ఇరాన్ కొత్త నిబంధనలు

**తెహ్రాన్:** హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ వ్యవహారాలు చూసేందుకు పర్షియన్ గల్ఫ్ స్ట్రేట్ అథారిటీ ఏర్పాటు అయింది. జల సంధి మార్గంలో పయనించే నౌకలు కచ్చితంగా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిందేనని ఇరాన్ స్పష్టం చేసింది. సరకు వివరాలు, యాజమాన్యం, సిబ్బంది జాతీయత వంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిందేనని షరతు పెట్టింది. నిబంధనలను ఉల్లంఘిస్తే డ్రోన్, క్షిపణి దాడులు తప్పబోవని, ఆ నౌకలను స్వాధీనం చేసుకుంటామని ఇరాన్ తేల్చిచెప్పింది.

**ఆమోదయోగ్యం కాదు: మార్కో రూబియో**

హోర్ముజ్ జల సంధిని తమ నియంత్రణలో పెట్టుకునేందుకు ఇరాన్ తీసుకుంటున్న చర్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని అమెరికా మంత్రి మార్కో రూబియో అన్నారు. ఈ జల సంధికి



సంబంధించిన వ్యవహారాలను చూసేందుకు ఓ యంత్రాంగాన్ని ఇరాన్ ఏర్పాటు చేయడాన్ని దుయ్యబట్టారు. అంతర్జాతీయ సముద్ర మార్గాన్ని తమ సొంతంగా, తమ నియంత్రణలోనిదిగా ఇరాన్ చెప్పుకుంటోంది. ఇది ఆమోదయోగ్యం కాదు అని రోమ్‌లో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా రూబియో అన్నారు. యుద్ధాన్ని ముగించడం కోసం చేసిన ప్రతిపాదనలపై ఇరాన్ స్పందన కోసం అమెరికా ఎదురు చూస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఇరాన్ అదుపులో 'ఓషియన్ కోయి'**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చమురు ట్యాం కర్ ఓషియన్ కోయిని ఇరాన్ స్వా ధీనం చేసుకుంది. ఇరాన్ చమురు దిగుమతులకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినట్లు సైన్యం ప్రకటన క్రమంలో ఈ చర్యలు తీసుకున్నది. బార్బాడోస్ జెండాతో ఉన్న ఈ ట్యాంకర్ ఇరాన్ చమురును తరలిస్తూ, ప్రాదేశిక పరిస్థితులను అదునుగా చేసుకొని చమురు ఎగుమతులకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించింది. ఫిబ్రవరి నుంచి అమెరికా ఆంక్షల పరిధిలో ఉన్న చమురు ట్యాంకర్‌ను ఇరాన్ దక్షిణ తీరానికి తీసుకెళ్లి న్యాయాధికారులకు అప్పగించినట్లు మీడియా పేర్కొంది. ఫిబ్రవరి 28న నుంచి హోర్ముజ్‌కు కొత్త నిబంధనలు తీసుకొస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది.

## పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకున్న 1,500 నౌకలు

**దుబాయ్:** ఇరాన్ అమెరికా యుద్ధంతో వాణిజ్య నౌకలు, చమురు ట్యాంకర్లు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయాయి. వీటిలో చాలా వరకు నౌకలు, ట్యాంకర్లు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. 1,500 నౌకలు ఆగినట్లు ఎన్ ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో) చీఫ్ వెల్లడించారు. వాటిలో 20వేల మంది నావికులు ఉన్నట్లు తెలిపారు.రెండు నెలలకుపైగా అందులోనే చిక్కుకుపోయారన్నారు. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో 30 నౌకలపై దాడులు జరగ్గా.. 10 మంది సెయిలర్లు మరణించినట్లు వెల్లడించారు. ప్రమాదాలు జరగకుండా గల్ఫ్ దేశాలకు నౌకలను తాత్కాలికంగా ఆపేయాలని ప్రపంచ దేశాలకు ఐఎంవో అధినేత సూచించారు. జలసంధిలో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా తరలించేందుకు చేపట్టిన నావికాదళ ఆపరేషన్‌ను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు సౌదీ ప్రభుత్వం నిరాకరించడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నది.

## చైనా ఫ్యాక్టరీలో పేలుడు

### 37కి పెరిగిన మృతులు



**బీజింగ్:** దక్షిణ చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లో ఓ బాణసంచా కర్మాగారంలో పేలుడు జరిగింది. ఈ ఘటనలో చనిపోయిన వారి సంఖ్య 37కి పెరిగింది. ఈ మేరకు జిన్హువా వార్తా సంస్థ శుక్రవారం నివేదించింది. బాణసంచా రాజధానిగా ప్రసిద్ధి చెందిన హునాన్‌లోని లియుయాంగ్‌లోని కర్మాగారంలో ఈ ఘటన జరిగింది. సహాయక చర్యలు పూర్తయ్యాయి. గాయపడిన 51 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

## పుతిన్ హత్యకు కుట్ర!

### రష్యా అధ్యక్షుడి భద్రత పెంపు

**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగింది. కొన్ని నెలల క్రితం నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని ప్రైవేటు నివాసం వద్ద పుతిన్‌పై ఉక్రెయిన్ హత్యాయత్నానికి పాల్పడినట్లు మాస్కో అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆయనను హత్యకు కుట్ర జరుగుతున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. భద్రతా కారణాల దష్ట్యా ఈ విషయాన్ని బయటకు వెల్లడించలేదని తెలిపాయి. అదే సమయంలో పుతిన్ భద్రతను రష్యా ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ మరింత కట్టుదిట్టం చేసింది. దీంతో ఆయన పర్యటనలు గణనీయంగా తగ్గిన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పుతిన్ భూగర్భ బంకర్లలోనే ఎక్కువగా ఉంటున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రదేశంలో మొబైల్, ఇంటర్నెట్‌పై నిషేధం ఉంది. ఉక్రెయిన్ డ్రోన్ల ముప్పును ఎదుర్కోవడానికి ఎఫ్ఎస్ఓ ఏజెంట్లు తనిఖీలను విస్తరించారని, మాస్కో నది వెంబడి బలగాలను మోహరించారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఉన్నతాధికారుల రక్షణను కూడా పెంచినట్లు తెలిపాయి. అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకొన్న వార్తలను అమెరికా, ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ వర్గాలు తోసిపుచ్చాయి. కాగా, పుతిన్‌పై హత్యాయత్నాలు ఇంతకుముందు కూడా జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



## కాలయాపన చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మారిందన్నారు. ధాన్యం లోడ్ చేయడానికి లారీ ఓనర్లు భయపడుతున్నారని, కాంటా వేసిన ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఏర్పడంతో కొనుగోలు సెంటర్లలో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిగా మందగించిందని పేర్కొన్నారు. ఫలితంగా రైతులు ధాన్యంతో మార్కెట్ యార్డులు, కొనుగోలు సెంటర్లలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ధాన్యంలో తాలు ఉందని, నాణ్యత లేదనే నేపంతో అనేక కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఫలితంగా రైతులు తీసుకెళ్ళిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతున్నదని, కొన్నిచోట్ల రాశులుగా పోసిన ధాన్యం వరదకు కొట్టుకపోతున్నాయని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని లేఖలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాపితంగా మార్కెట్ యార్డులలో మొక్కజొన్నలు కొనుగోలు నిలిచిపోవడంతో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాయాల్సిరావడంతో పాటు గన్నీ సంచుల కొరత కూడా తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందన్నారు.

## ఆందోళనకరం

(మొదటి పేజీ తరువాయి)

ఇది బెంగాల్‌కే కాకుండా, దేశం మొత్తానికి అనేక సవాళ్లను సృష్టిస్తోందన్నారు. ఈ సవాళ్లను వామపక్షాలు ఎలా ఎదుర్కోబోతున్నాయి అనేదే ఇప్పుడు మన ముందున్న ప్రధాన అంశమని రాజా పేర్కొన్నారు. దీనిపై తాము చర్చిస్తున్నామని, వామపక్షాలు తిరిగి పుంజుకుని, దేశంలోనూ, బెంగాల్‌లోనూ ఒక బలమైన శక్తిగా తిరిగి ఆవిర్భవిస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. బెంగాల్‌తో పాటు దేశ రాజకీయ గతిని మలిచే శక్తిగా వామపక్షాలు ఎదుగుతాయని, అదే మా ఆశయం అని ఆయన పేర్కొన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంటులో తగినంత ప్రాతినిధ్యం ఉండటం అత్యవసరమని పేర్కొంటూ, వామపక్ష పార్టీలు కఠినంగా శ్రమించాల్సి ఉంటుందని, ప్రజలకు చేరువ కావాలని, తమ వర్గ, ప్రజా సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. తాము కేరళను కూడా కోల్పోయాము, ఇప్పుడు ఏ ప్రభుత్వంలోనూ వామపక్షాలకు స్థానం లేదు, ఇది తమ పార్టీ సిపిఐకి, అలాగే మొత్తం వామపక్ష కూటమికి ఒక ప్రధాన ఆందోళన కలిగించే విషయమని చెప్పారు. రాబోయే రోజుల్లో భవిష్యత్తు కోసం తమ వ్యూహాలను, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుంటామని రాజా స్పష్టం చేశారు. తమిళనాడు పరిణామాలపై మాట్లడుతూ 'గవర్నర్ ఏకైక అతిపెద్ద పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలి. ఆ ప్రభుత్వం తన మెజారిటీని గవర్నర్ నివాసంలోని హాలుల్లోనో లేదా కారిడార్లలోనో కాకుండా, అసెంబ్లీ సభాప్రాంగణంలోనే నిరూపించుకునే అవకాశం కల్పించాలి' అని ఆయన అన్నారు. టివికెను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, అలాగే 'స్థాపితమైన సంప్రదాయాలు, ఆచరణలను' గవర్నర్ తప్పక పాటించాలని ఆయన నొక్కి చెప్పారు. తమిళనాడులో రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే, మతతత్వ మితవాద శక్తులను దూరంగా ఉంచే, లౌకిక ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలని తాము కోరుకుంటున్నామన్నారు.

## మూసీ పునరుజ్జీవనం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టమైన కాలపరిమితిని విధించింది. ఆగస్టు 2026 నాటికి అన్ని అనుమతులు పూర్తి చేసుకుని పనులు ప్రారంభించాలి. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు.సుమారు రూ.7,055 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ దశకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) నుంచి నిధుల సమీకరణపై చర్చలు సఫలీకృతమైనట్లు వెల్లడించారు.

**క్షేత్రస్థాయి కార్యాచరణ**

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల పరిధిలో, ఎటువంటి నిర్మాణాలు లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను తక్షణమే ప్రారంభించాలని మంత్రులు ఆదేశించారు. నది ప్రక్షాళనకు చెత్త తొలగింపు, రివర్ బెడ్ ప్రొఫైలింగ్. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రిటైనింగ్ వాల్స్, నదికి ఇరువైపులా రోడ్లు, మురుగు నీటి కాలువలు, బ్యారేజీల నిర్మాణం. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఈస్ట్‌టువెస్ట్ కారిడార్ పేరుతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం.

**మానవీయ కోణంలో అభివృద్ధి**

ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని కమిటీ స్పష్టం చేసింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేయాలి. ఆస్తులపై తక్కువ ప్రభావం పడేలా అవసరమైతే అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలి. 'అభివృద్ధి ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలి అని అధికారులను మంత్రులు ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

**అత్యాధునిక సాంకేతికత - రబ్బర్ డ్యాంలు**

నదిలో నీటి నిల్వను పెంచి, జలక్రీడలు, బోటింగ్‌ను ప్రోత్సహించేందుకు 'ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ'తో కూడిన రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. నాసిక్, ముంబైలలో ఉన్న ఇలాంటి డ్యాంలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. సాంకేతిక అంశాల్లో ఐఐటి, జెఎన్‌టియు నిపుణుల సహకారం తీసుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగింపు ప్రయత్నాలు

## హజ్ యాత్రికుల బస్సు ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు తెలంగాణలో పునరావృతం కాకుండా అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో మైనారిటీలకు సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నాంపల్లి హజ్ హౌజ్‌లో శుక్రవారం హజ్ యాత్రికుల బస్సులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ, ఎంఎల్‌ఎ జాఫర్ హుస్సేన్, ఎంఎల్‌సి మీర్జా రియాజ్, టిజిఎంఆర్ఈఐఎస్ అధ్యక్షులు ఫహీముద్దీన్ ఖురేషి, హజ్ కమిటీ చైర్మన్ గులామ్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టిజిఎంఎఫ్‌సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తాహెర్ బిల్ హమద్, ఎంపి ఎం.అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో, ఉద్యోగాలలో మైనారిటీలకు దక్కాల్సిన వాటాను ప్రభుత్వం అందిస్తోందన్నారు. విదేశీ విద్యకోసం మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని తెలిపా రు. హైదరాబాద్‌లో జీవనోపాధి కోసం ఆటోలు నడుపుతున్న మైనారిటీ కుటుంబాలు అధికంగా ఉన్నాయని, ఔటర్‌రింగ్ రోడ్ లోపల నడిచే అన్ని ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవి ఆటోలుగా మార్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీనివల్ల ఆటో డ్రైవర్లకు ఖర్చు లు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. గత ఏడాది హజ్ యాత్ర సందర్భంగా జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణించిన విషయా న్ని సిఎం గుర్తు చేస్తూ ప్రతి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుందన్నారు.



ప్రస్తుతం ఇరాన్‌ఇరాక్ యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన ఇంధన ఛార్జీలు పెరిగి ప్రయాణ ఖర్చులు అధికమయ్యాయని, అయినప్పటికీ హజ్ యాత్రికులపై భారం పడకుండా అదనపు ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంద ని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందూముస్లిం భేదాభిప్రాయాలు లేవని, హిందూ ముస్లింలు భాయీభాయీ అని సిఎం పేర్కొన్నారు.

## కేంద్ర సర్కార్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎఐవైఎఫ్ అధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయం ముందు ఫుట్‌పాత్‌పై బైఠాయించి ప్లకార్డులు చేతబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎఐవైఎఫ్ ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ రైల్వేలో 2 శాతం (29,608) పోస్టులు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం సాధారణ పరిపాలనా చర్య కాదని, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించే కుట్రలో భాగమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాల్సింది పోయి ఉద్యోగాలను తగ్గించడమంటే ఇది స్పష్టమైన ఉద్యోగ వ్యతిరేక విధానమని విమర్శించారు. రైల్వే శాఖలోఉద్యోగుల కొరతతో కీలక భాగాలతో పాటు లోకో పైలట్లు, మెయింటెనెన్స్ సిబ్బంది, సిగ్నలింగ్ సిబ్బంది, టెక్నికల్ వర్కర్స్ ఎక్కువ పని గంటలు పనిచేస్తూ ఇప్పటికే తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారన్నారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు 2 శాతం ఉద్యోగాల కోతలు ఎందుకు? ఇదేనా యువతకు ఇచ్చిన హామీ? ఇదేనా అభివృద్ధి? ఇదేనా నూతన భారత్? అని ప్రశ్నించారు. ధర్మేంద్ర మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్ఆర్‌బిఅభ్యర్థుల నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరిస్ (ఎన్‌టిపిసి), గ్రూప్‌డి, జూనియర్ ఇంజనీర్ (జెఇ), టెక్నీషన్ ఫలితాలు వెల్లడించకపోవడంతో లక్షలాది మంది యువత నిరీక్షణలో వున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2 శాతం పోస్టుల తగ్గింపు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని, అన్ని పెండింగ్ ఆర్ఆర్‌బి ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, రైల్వే శాఖ ప్రైవేటీకరణ నుండి రక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించనట్లయితే యువతను పెద్దఎత్తున సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం అనంతరం ఎఐవైఎఫ్ ప్రతినిధుల బృందం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, ఎం.శ్రీమాన్, కోశాధికారి పి.మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, ఎల్లంకి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కోసమే

(మొదటి పేజీ తరువాయి)

పరిరక్షించడానికి టివికెకు మద్దతు కొనసాగిస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రకటించింది.ఈ మేరకు శుక్రవారం ఇక్కడ సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటన విడుదల చేసింది. అతిపెద్ద పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించి, అసెంబ్లీలో దాని మెజారిటీని నిరూపించుకునేలా అవకాశం కల్పించకుండా తెరవెనక ఎత్తుగడలతో ప్రభుత్వాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా అనిశ్చితిని సృష్టించడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నం అప్రజాస్వామికం, ప్రజలను అగౌరవపర్చడమేనని సిపిఐ ఆక్షేపించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును అక్షరరూపంలోనూ, స్ఫూర్తి రూపంలోనూ గౌరవించాలని, అలాకాకుండా, మెజారిటీకి సంబంధించి లేవనెత్తే ప్రశ్నలను అసెంబ్లీలో పరిష్కరించకుండా, రాజ్‌భవన్ గోడల వెనక రాజకీయ కుతంత్రాల ద్వారా మోకాలడ్డడం సహేతుకం కాదని హితవు పలికింది.

కార్మిక హక్కులు, మత సామరస్యం, హేతువాదం, సామాజిక న్యాయం, సమాఖ్యావాదం, సమానత్వం కోసం జరిగిన పోరాటాల ద్వారా రూపుదిద్దుకున్న గర్వించదగిన రాజకీయ, సామాజిక ఘన వారసత్వం తమిళనాడుకు ఉందని పార్టీ గుర్తుచేసింది. ఈ విలువలు తమిళనాడు రాష్ట్ర ప్రజలలో లోతుగా పాతుకుపోయాయని తెలియజేసింది. అయితే ఆర్ఎస్ఎస్, బిజెపి రాజకీయాలు, భావజాలం ఈ చారిత్రక వారసత్వానికి వ్యతిరేకంగా నిలుస్తున్నాయని, ఫలితంగా తమిళనాడు సామాజిక సామరస్యానికి, లౌకిక స్వరూపానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తున్నాయని సిపిఐ గట్టిగా విశ్వసిస్తోందని, సమాజాన్ని మతపరంగా విభజించే ప్రయత్నాలను ప్రజలు తిరస్కరించారని, ఈ తీర్పును ప్రతిబింబించే ప్రభుత్వం ఏర్పడాలనే ఆశతో ప్రజలు ఓట్లేసి టివికెకు పట్టం కట్టారని, విభజన రాజకీయాలను ప్రజలు నిరంతరం తిరస్కరిస్తున్న తమిళనాడు రాష్ట్రంలో బిజెపికి అవకాశం కల్పించడానికి చట్టపరమైన, సాంకేతిక అంశాలను, పక్షపాత వ్యాఖ్యానాలను ఆయుధాలుగా ఉపయోగించలేరని హెచ్చరించింది. టివికె నేతృత్వంలోని రాబోయే ప్రభుత్వం పరిపాలనలో, ప్రజా జీవితంలో ఈ చారిత్రక విలువలను నిలబెట్టి, బలోపేతం చేయడంతో పాటు, తమిళనాడు ప్రజల ఆకాంక్షలకు కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తెలియజేసింది.

ఈ అవగాహనతో సుసంపన్నమైన, ప్రజాస్వామ్యయుతమైన, సమానత్వంతో కూడిన తమిళనాడు అనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ టివికెకు తన మద్దతును అందించాలని నిర్ణయించినట్లు పేర్కొంది.సిపిఐ, వామపక్ష ఉద్యమం ఎల్లప్పుడూ తమిళనాడు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ జీవితంలో అంతర్భాగంగా ఉంటూ కార్మికులు, రైతులు, మహిళలు, అన్ని అణగారిన వర్గాలకు అండగానిలుస్తుందని ప్రకటించింది. సిపిఐ నిరంతరం ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, శాసనసభలోపలా, వెలుపలా అణగారిన వర్గాల గొంతుకను వినిపించడాన్ని కొనసాగిస్తుందని భరోసా ఇచ్చింది.

## 2021 లఖీంపూర్ ఖేరీ హింసాకాండ కేసు విచారణలో సాక్షులను హాజరుపర్చకపోవడంపై 'సుప్రీం'నిరాశ

**న్యూఢిల్లీ :** లఖీంపూర్ ఖేరీ హింసాకాండ (2021 ఘటన ) కేసులో మాజీ కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా, ఇతరులపై కొనసాగుతున్న విచారణలో సాక్షులను హాజరుపర్చకపోవడంపై సుప్రీంకోర్టు శుక్రవారం నిరాశ వ్యక్తంచేసింది.ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సాక్షులను హాజరుపర్చకపోవడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తమకు సమర్పించిన స్టేటస్ రిపోర్టులో ఎటువంటి కారణాన్ని పేర్కొనలేదని తెలిపింది. గత రెండు మాసాలుగా విచారణలో ఏ సాక్షినీ విచారించలేదని ధర్మాసనం తెలిపింది. సాక్షుల హాజరు విషయంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని మేం ప్రిసైడింగ్ జడ్జికి మార్గనిర్దేశం చేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. విచారణను కాలపరిమితిలోగా ముగించేందుకు ప్రయత్నించాలని, అలాగే తమకు విచారణ స్థితి నివేదికను సమర్పించాలని ధర్మాసనం విచారణ న్యాయమూర్తిని కోరింది.ఈ ఘటనకు సంబంధించిన రెండు కేసుల విచారణ ఉత్తరప్రదేశ్‌లోని కోర్టులో జరుగుతోంది. మొదటి కేసులో విచారించిన 131 మంది సాక్షులలో 44మందిని విచారించారని, 15మందిని విడుదల చేయగా, 72మందిని హాజరుపర్చాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. రెండవ ఎఫ్ఐఆర్‌లో 35మంది సాక్షులలో 26మందిని విచారించగా 9మంది వదిలివేయబడ్డారని బెంచ్ తెలిపింది. ఆశిష్ మిశ్రా తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ సిద్దార్థ్ దావేఉత్తరప్రదేశ్ దాఖలు చేసిన తాజా స్టేటస్ రిపోర్టు ప్రకారం..మొదటి ఎఫ్ఐఆర్‌లో ఇప్పటి వరకూ 44మంది సాక్షులను విచారించారని తెలిపారు. 'గత రెండు నెలలుగా ఏ సాక్షులనూ విచారించలేదు' అని దావే అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దాఖలు చేసిన చివరి స్టేటస్ రిపోర్టులో 44మంది సాక్షులను విచారించినట్లు కూడా పేర్కొన్నారని ఆయన వాదించారు. దీనిపై స్పందిస్తూ 'మార్చి నుంచి ఇప్పటివరకు మీరేమి చేశారు' అని ఉత్తరప్రదేశ్ తరపున హాజరైన న్యాయవాదిని బెంచ్ ప్రశ్నించింది.విచారణ సమయంలో వారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి 3నుంచి 4మంది సాక్షులను పిలిపించినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఒక రోజుకు ముగ్గురు లేదా నలుగురికి బదులుగా కనీసం 7 నుంచి 8మంది సాక్షులను పిలవాలనుఇ, తద్వారా కొందరు హాజరుకాకపోయినా, విచారణ కోర్టు తన ముందు హాజరైన వారి వాంగ్మూలాలను నమోదు చేసే ప్రక్రియను కొనసాగించవచ్చని బెంచ్ తెలియజేసింది.

## అనూహ్య మలుపులు

(మొదటి పేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని విజయ్‌ను తిరుమావళవన్ డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఇది సాధ్యం కాదని చెప్పడంతో ఆయన డిఎంకె నేత ఎం.కె. స్టాలిన్‌తో సమావేశమయ్యారు. ఈలోగా గవర్నర్ కార్యాలయ వర్గాలు విజయ్‌కు ఈ–మెయిల్ ద్వారా పంపిన విసికె మద్దతు లేఖ చెల్లదని చెప్పినట్లు సమాచారం. మరోవైపు డిఎంకె, ఎఐడిఎంకెలు తెరవెనుక ప్రభుత్వ ఏర్పాటుకు మంతనాలు జరుపుతున్నాయి. తిరుమావళవన్ కోరుకునే ఏ పదవైనా ఇచ్చేందుకు ద్రవిడ పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. తమ నిర్ణయం శనివారం ప్రకటిస్తామని విసికె తరుఫున ప్రకటన వెలువడింది.దీంతో చివరి నిమిషంలో శనివారం జరగాల్సిన ప్రమాణ స్వీకారంపై అనిశ్చితి నెలకొంది. మరోవైపు ముఖ్యమంత్రిగా ఎఐఎడిఎంకె శాసనసభాపక్ష నాయకుడు ఎడప్పాడి పళని స్వామికి అవకాశం కల్పించాలని కోరుతూ, వారి కూటమిలో ఎఎంఎంకె పార్టీ అధ్యక్షుడు టి.టి.వి.దినకరన్ శుక్రవారం రాత్రి గవర్నర్‌కు లేఖ సమర్పించారు. ఆ పార్టీకి ఒక్క ఎంఎల్‌ఏ ఉన్నారు.

కాగా, శుక్రవారం సాయంత్రం మూడోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. అయితే, టివికె ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు లోక్‌భవన్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. గవర్నర్‌తో సమావేశం ముగిసిన వెంటనే విజయ్ నేరుగా చెన్నైలోని సిపిఐ, సిపిఐ(ఎం) కార్యాలయాలకు వెళ్లారు. తనకు మద్దతు ప్రకటించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు కృతజ్ఞతలు చెప్పారు. కాగా, తమిళ ప్రజల కోసం స్థిరమైన, లౌకిక, ప్రజాస్వామ్య పాలన కోసం విజయ్ నేతృత్వంలోని పార్టీకి షరతులతో కూడిన మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ ప్రకటించింది. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి టివికెకు మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ(ఎం) అధికారిక లేఖ విడుదల చేసింది.

**బయటి నుంచే మద్దతు..మంత్రివర్గంలో చేరం: లెఫ్ట్**

టివికెకు బయట నుంచే తాము మద్దతిస్తామని.. ప్రభుత్వంలో చేరబోమని సిపిఐ(ఎం) నేత యు.వాసుకి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ''సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీలు శుక్రవారం సమావేశమయ్యాయి. టివికెకు ప్రభుత్వ ఏర్పాటుకు బయటి నుంచే మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాయి. అసెంబ్లీలో బల పరీక్ష సమయంలో టివికెకు మద్దతుగానే కచ్చితంగా ఓటు వేస్తాం. కానీ, మంత్రివర్గంలో మాత్రం చేరం. ఇది కేవలం బయటి నుంచి మద్దతే. వామపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని విసికే సైతం చెప్పింది. అందువల్ల వారు కూడా అదే తరహాలో వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం. ప్రజలు టివికెకు అధిక మెజార్టీ ఇచ్చారు.. వారి విశ్వాసం మేరకు ప్రభుత్వ ఏర్పాటు కోసమే మేం మద్దతు తెలుపుతున్నాం. ప్రజా సమస్యల ఆధారంగానే మేం స్వతంత్రంగా వ్యవహరించి పనిచేస్తాం. లౌకికవాదం, ప్రజల ఐక్యత, రాష్ట్రాల హక్కులు.. ఇలా ఇతర ఏ అంశమైనా సరే ప్రస్తావనకు వచ్చినప్పుడు మాతో కలిసొచ్చే ఏ లౌకిక పార్టీతోనైనా కలిసి నడుస్తాం'' అని తెలిపారు.

# గేమ్ చేంజర్ నితీశ్..

ఐపిఎల్‌లో సత్తా చాటుతున్న

తెలుగు కుర్రాడు

సన్‌రైజర్స్ విజయాల్లో కీలక పాత్ర



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తోంది. రాజస్థాన్ రాయల్స్‌ను రెండుసార్లు ఓడించి.. జోరు మీదున్న పంజాబ్ కింగ్స్ పని పట్టి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి చేరుకుంది. విధ్వంసకర బ్యాటర్లు హెన్రిచ్ క్లాసెన్ (494 పరుగులు), అభిషేక్ శర్మ (475) బ్యాట్‌తో దంచుతుండగా.. పేసర్ ఈషాన్ మలింగ (16 వికెట్లు) బంతితో అదరగొడుతున్నాడు. అయితే, వీళ్లందరికంటే సన్‌రైజర్స్ విజయాల్లో నితీశ్‌రెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నాడు. అటు బ్యాటు, ఇటు బంతితో రాణిస్తూ ఆల్‌రౌండర్‌పదానికి అసలైన అర్థం చెబుతున్నాడు. హేమాహేమీలు ఉన్న ఈ జట్టులో నితీశ్ ఓ గేమ్ చేంజర్‌గా మారి జట్టును విజయ తీరాల వైపు నడిపిస్తున్నాడు. ఐపిఎల్‌లో ప్రవేశపెట్టిన ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన వల్ల ఆల్‌రౌండర్ల ప్రాధాన్యత తగ్గిపోతుందనే వాదనలు ఉన్నా, నితీశ్ వాటిని పటాపంచలు చేస్తున్నాడు. సన్‌రైజర్స్ ఈ ఏడాది టైటిల్ వేటలో ఉండాలంటే అతను అందించే ఈ ఆల్‌రౌండ్ ప్రదర్శనే అత్యంత కీలకం కానుంది. రెండు విభాగాల మధ్య వారధిలా.. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు టాప్ ఆర్డర్ బ్యాటర్లు అభిషేక్, హెడ్, ఇషాన్, క్లాసెన్ అద్భుతంగా రాణిస్తూ ఏకంగా 1739 పరుగులు రాబట్టారు. బౌలింగ్‌లోనూ ఈషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్ (10 వికెట్లు) ప్రత్యర్థులను వణికిస్తున్నారు. అయితే, రెండు విభాగల్లో నితీశ్ ప్రదర్శన జట్టుకు ఊపిరిగా మారింది. బ్యాటింగ్‌లో 166.91 స్ట్రయిక్ రేట్తో ఇప్పటివరకు 222 పరుగులు సాధించిన అతను బ్యాటర్ల స్వర్గధామం లాంటి పిచ్లపై సైతం 10.39 ఎకానమీతో 7 వికెట్లు పడగొట్టాడు. సన్‌రైజర్స్ తుది జట్టును పరిపూర్ణం చేయడంలో నితీశ్ గురించి చెప్పేందుకు ఆదివారం సొంతగడ్డపై కోలకతాతో మ్యాచే ఉదాహరణ. అనారోగ్యం కారణంగా నితీశ్ దూరం అవ్వడంతో ఆ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఒక ఫినిషర్ను మాత్రమే కాకుండా, మిడిల్ ఓవర్లలో పట్టు బిగించే బౌలర్‌ను కూడా కోల్పోయి ఓడిపోయింది. అయితే మూడు రోజులు తిరిగే సరికి పంజాబ్ కింగ్స్‌తో పోరుకు నితీశ్ అందుబాటులోకి రావడంతోనే ఆరెంజ్ ఆర్మీ శిబిరంలో ఉత్సాహం ఉట్టిపడింది. ఆ మ్యాచ్‌లో నితీశ్ కేవలం 13 బంతుల్లోనే 29 పరుగులు పిండుకుని జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఆపై బౌలింగ్‌లోనూ చెలరేగి ప్రమాదకరమైన ప్రభ్సిమ్రాన్ సింగ్‌ను పెవిలియన్‌కు పంపాడు. కేవలం 2 ఓవర్లలో 11పరుగులు మాత్రమే ఇచ్చి కీలక వికెట్ తీయడం అతని పరిణతికి నిదర్శనం.

నిజానికి ఎంసీజీలో ఆస్ట్రేలియాపై అద్భుత శతకంతో నితీశ్ ఒక్కసారిగా హీరో అయ్యాడు. కానీ, ఆ స్టార్డమ్ తర్వాత పెరిగిన అంచనాలను అందుకోలేదు. నిరుడు ఐపిఎల్‌లో ఆకట్టుకోలేకపోయిన ఈ వైజాగ్ కుర్రాడు ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్లో నిరాశ పరిచాడు. ఆ తర్వాత అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లోనూ రాణించలేని 'బిట్స్ అండ్ పీసెస్' క్రికెటర్ అంటూ నెటిజన్లు ఎగతాళి చేశారు.అయితే ఈ విమర్శలు పట్టించుకోని తెలుగు కుర్రాడు తన ఆటను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాడు. ఆ ఫలితాన్ని ప్రస్తుత ఐపిఎల్లో చూస్తున్నాం. 2027 ప్రపంచకప్ దృష్ట్యా భారత్‌కు ఒక పటిష్టమైన సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అవసరం ఉంది. హార్దిక్ పాండ్యాకు ప్రత్యామ్నాయంగా నితీశ్ కనిపిస్తున్నాడు. టెస్టుల్లో సెంచరీ, టీ20ల్లో 180 స్ట్రయిక్ రేట్ ఉన్న నితీశ్ ఇదే జోరు కొనసాగిస్తూ ఫిట్నెస్ కాపాడుకుంటే భారత జట్టుకు తిరుగులేని ఆస్తిగా మారతాడనంలో సందేహం లేదు.

## టి–20 జట్టులో భారీ మార్పులు..

# సూర్య స్థానంలో శ్రేయాస్‌కు పగ్గాలు !



**ముంబై:** టీమిండియా టి–20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండియాకు 2026 టి–20 వరల్డ్‌కప్‌ను సూర్యకుమార్ అందించిన విషయం తెలిసిందే. అయితే అతన్ని సారథ్యం నుంచి తప్పించాలని బిసిసిఐ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ .. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. టిమిండియా టి–20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు ఛాన్స్ ఇవ్వాలని బిసిసిఐ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ యేటి ఐపిఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ ఇరగదీస్తున్నాడు. రాబోయే సిరీస్‌లో కెప్టెన్సీతో పాటు యువ ఆటగాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలని బిసిసిఐ భావిస్తున్నది. ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్లకు వెళ్లే జట్టుల్లో యువతకు చోటు దక్కే ఛాన్సు ఉన్నది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ తన బ్యాట్‌కు పెద్దగా పనిచెప్పడం లేదు. సూర్య రాణించలేక పోతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కూడా సూర్య విషయంలో సహనాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఫామ్‌లో లేని సూర్య స్థానంలో శ్రేయాస్‌ను కెప్టెన్‌గా దించాలని భావిస్తున్నారు. మరీ పేలవంగా ఆడుతున్న సూర్య టీమిండియా బృందంలో చోటు దక్కించుకుంటాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిజానికి టి–20ల్లో సూర్యకు మంచి రికార్డు ఉన్నది. కానీ ఇటీవల అతని ఫామ్ సరిగాలేదు. ఐపిఎల్‌లో ఈసారి అతను ముంబై ఇండియన్స్ తరపున 10 మ్యాచుల్లో కేవలం 195 రన్స్ మాత్రమే చేశాడు. అయితే చేతిమడిమ సమస్యతో సూర్య బాధపడుతున్నాడని, అయినా నొప్పితోనే ఆడుతున్నాడని ఓ నివేదిక ద్వారా తెలిసింది. ఇక శ్రేయాస్ అయ్యర్ ఈ ఐపిఎల్ సీజన్‌లో 9 మ్యాచుల్లో 333 రన్స్ చేశాడు. అయితే రోహిత్ శర్మ కెప్టెన్‌గా రిటైర్మెంట్ అయిన తర్వాత సూర్యకుమార్ ఇప్పటి వరకు ఒక్క టి–20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇక అయ్యర్ గత రెండేళ్ల నుంచి ఒక్క అంతర్జాతీయ టి–20 మ్యాచ్ కూడా ఆడలేదు. 2023 డిసెంబర్లో చివరిసారి అతను ఇండియా తరపున ఆడాడు.

# సైన్స్

## క్వాంటం క్షేత్రాల్లో నిక్షిప్తమైన సమానత్వాలు..



క్వాంటం సిద్ధాంతం రోజురోజుకూ విస్తృతమవుతున్నది. క్వాంటం క్షేత్రంలో సమానత్వాలు (సిమ్మెట్రి) నిక్షిప్తమై ఉన్నాయని కొందరు శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్నారు. కొన్ని మార్పులు చేసినా ప్రకృతి నియమాలు మారకపోవడాన్ని భౌతిక శాస్త్రంలో సమానత్వం అంటారు. ఉదాహరణకు, మీరు ప్రయోగాన్ని నిన్న చేసినా, ఇవాళ చేసినా ఫలితం ఒకేలా రావడం ఒక సమానత్వం. కానీ క్వాంటం క్షేత్రాలలో ఇంకా లోతైన సమానత్వాలు ఉన్నాయి. అవి సాధారణ పరిస్థితుల్లో కనిపించవు, ఎందుకంటే అవి వేరువుగా విభజింపబడి ఉంటాయి. అయితే, అవి ఎందుకు కనిపించడం లేదు? అన్నది ప్రశ్న. సిద్ధాంతాన్ని అనుసరించి మన విశ్వం శక్తి చాలా తక్కువ స్థాయిలోనే, అంటే, చల్లగా, స్థిరంగా ఉంది. ఈ పరిస్థితుల్లో క్వాంటం క్షేత్రాల సమానత్వాలు లాక్ అయి ఉన్నట్లుగా ప్రవర్తిస్తాయి. దాని ఫలితంగా, వేర్వేరు కణాలు.. వేర్వేరు భారాలు.. వేర్వేరు శక్తులు (ఎలక్ట్రోమాగ్నెటిక్, వీక్, స్ట్రాంగ్) కనిపిస్తున్నాయి. ఈ వైవిధ్యమే మనకు రోజువారీ ప్రపంచాన్ని ఇస్తుంది. అపార శక్తుల వద్ద ఏం జరుగుతుందనేది ఆసక్తికరమైన భావన. శక్తి స్థాయి చాలా ఎక్కువగా పెరిగితే (ఉదాహరణకు, బిగ్‌బ్యాంగ్ జరిగిన మొదటి క్షణాల్లో లేదా అత్యంత శక్తివంతమైన కణ యాక్సిలరేటర్లలో), వేరువేరుగా విభజింపబడి ఉన్న సమానత్వాలు మళ్లీ మేల్కొంటాయి. నియమాలు సరళంగా మారుతాయి. ఈస్థితిలో వేర్వేరు శక్తులు ఏకం కావచ్చు.. వేర్వేరు కణాలు ఒకే కుటుంబంలా ప్రవర్తించవచ్చు.. విశ్వం మొదట అత్యంత సమానత్వంతో ప్రారంభమైంది. కాలం గడిచేకొదీ, విశ్వంచల్లబడింది. సమానత్వాలు ఒక్కొక్కటిగా మార్పుచెందాయి. ఈ క్వాంటం సిద్ధాంతం లోతులకు వెళుతున్న కొద్దీ, ఇప్పటి వరకూ ప్రచారంలో ఉన్న చాలా సిద్ధాంతాలపై అనుమానాలు రావచ్చు. అంతమాత్రం చేత, భౌతిక సిద్ధాంతాలను తప్పుగా చెప్పలేం. క్వాంటం సిద్ధాంతం లేదా సూత్రాలను పాత సిద్ధాంతాలను మరింత ముందుకు తీసుకెళుతున్నది. వాటికి మెరుగులు దిద్దుతున్నది. అంచనాలకు పదును పెడుతున్నది. ప్రకృతి తన రహస్యాలను తొందరగా చూపదని, అధ్యయనం చేస్తున్న కొద్దీ ఎన్నో విశేషాలు బయటకు వస్తాయ ని క్వాంటం అధ్యయనం స్పష్టం చేస్తున్నది.



## చంద్రునిపై రష్యా అణు విద్యుత్ కేంద్రం

మనిషి ఆకాశమే హద్దుగా ఎదిగిపోతున్నాడు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే రష్యా ఏకంగా చంద్రుడిపైన విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. దశాబ్దకాలంలో ఈ ఆలోచన కార్యరూపం దాలుస్తుంది. ఈ కేంద్రం ద్వారా రష్యా యొక్క చంద్ర అన్వేషణ కార్యక్రమానికి, అలాగే రష్యా–చైనా సంయుక్త అంతర్జాతీయ చంద్ర పరిశోధనా కేంద్రానికి విద్యుత్ సరఫరా చేయనున్నారు. ప్రపంచ ప్రధాన శక్తులు చంద్ర అన్వేషణలో పోటీపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అంతరిక్ష సంస్థ రోస్కోస్మోస్ ప్రకటన ప్రకారం, 2036 నాటికి చంద్ర విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు లావోచ్కిన్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ కేంద్రం అణు విద్యుత్ ఆధారితమని స్పష్టంగా ప్రకటించకపోయినా, ప్రాజెక్టులో రష్యా ప్రభుత్వ అణు సంస్థ రోసాటమ్, ప్రముఖ అణు పరిశోధనా కేంద్రం కుర్చాటోవ్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వాములుగా ఉండటం గమనార్హం. ఈ విద్యుత్ కేంద్రం ద్వారా చంద్ర రోవర్లు, ఖగోళ పరిశీలనా కేంద్రం (అబ్జర్వేటరీ), అలాగే రష్యా–చైనా సంయుక్త పరిశోధనా స్థావరానికి అవసరమైన మౌలిక సదుపాయాలకు విద్యుత్ అందించనున్నారు. ఒక్కసారి జరిగే మిషన్ల నుంచి దీర్ఘకాలిక చంద్ర అన్వేషణ కార్యక్రమానికి మారడంలో ఇది కీలక అడుగు కానుంది. 1961లో యూరి గగారిన్ తొలి అంతరిక్షయాత్రతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన రష్యా, అమెరికా, చైనాతో పోలిస్తే వెనుకబడి ఉంది. 2023 ఆగస్టులో లూనా25 మిషన్ చంద్రునిపై కూలిపోవడం రష్యా ఆశయాలకు ఎదురుదెబ్బగా మారింది. ఆ వైఫల్యాల నుంచి బయటపడి, తిరిగి తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నది. కాగా, అమెరికా కూడా చంద్రునిపై అణు రియాక్టర్ ఏర్పాటుచేయాలనే ఉద్దేశాన్ని ప్రకటించింది. నాసా ప్రకారం, 2030 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికంలోనే చంద్రునిపై అణు విద్యుత్ రియాక్టర్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో చూడాలి.

## గురుత్వాకర్షణకు కొత్త సిద్ధాంతం!



గురుత్వాకర్షణ అనేది ఒక మూల లేదా ప్రాథమిక బలమన్న సిద్ధాంతాన్ని ఇప్పటి వరకూ దాదాపు శాస్త్రవేత్తలందరూ అంగీకరిస్తూ వచ్చారు. అయితే, ఫిన్లాండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇందుకు పూర్తి భిన్నమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంతో, ప్రపంచ వ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రకృతిలో సాధారణంగా మూడు బలాలు ఉంటాయని సంప్రదాయ సిద్ధాంతం పేర్కొంటుంది. వాటిలో స్థూల ఆకర్షణ బలం లేదా గురుత్వాకర్షణ, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ బలం, బలమైన లేదా బలహీనమైన న్యూక్లియర్ బలం. ఈ మూడింటినీ కాదని ఎమర్జెంట్ గ్రావిటీ సిద్ధాంతాన్ని అల్టో వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్నారు. అంటే గురుత్వాకర్షణ ఒక ప్రత్యక్ష మూల బలం కాకుండా, మరిన్నింటి నుంచి ఉద్భవించిందని అర్థం. అంతర్లీనమైన స్పేస్‌టైమ్ డైమెన్షన్ ఫీల్డ్ యొక్క సమతుల్య లక్షణాలతో కూడుకున్న కొత్త ప్రవర్తలను శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఈ సమతుల్యాలు, ఫిజిక్స్ ప్రముఖ స్టాండర్డ్ మోడల్‌లోని ఇతర బలాల విధానానికి దగ్గరగా ఉంటాయని, గ్రావిటీ కూడా విద్యుత్, సూక్ష్మ, బలమైన వారధి శక్తుల మాదిరి ఒక గేజ్ థియరీ ద్వారా వివరించవచ్చని చెప్తున్నారు.ఈ సిద్ధాంతం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, కృష్ణ బిలాలు (బ్లాక్‌హోల్స్), స్పేస్‌టైమ్ నిర్మాణం, విశ్వ పుట్టుక వంటి అనేకానే అంశాలపై మన అవగాహనను పూర్తిగా మార్చివేసే సామర్థ్యం దీనికి ఉంది. శాస్త్రవేత్తల అంచనాలు నిజమైతే, గ్రావిటేషన్ మీద మన అర్థం పూర్తిగా తలకిందులు కావచ్చు. ఈ కొత్త దృక్పథం సిద్ధాంత పరంగా మాత్రమే కాదు, భవిష్యత్‌లో క్వాంటం మెకానిక్స్ గ్రావిటేషన్ ఏకీకృత మోడల్ దిశగా కీలకమైన అడుగు పడుతుంది.

# వ్యక్తిగత దూషణలు సరికాదు

రాజకీయ పార్టీలు హుందాతనంతో

సమస్యలపై స్పందించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

చాడ వెంకట్‌రెడ్డి హితవు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** రాజకీయల్లో వ్యక్తిగత దూషణలు సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ నాయకులు హుందాతనంతో సమస్యలపై స్పందించాలని, ప్రజలకు ఉపయోగపడే విధానాలతో ముందుకు రావాలని ఆయన సూచించారు. శుక్రవారం హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రాజకీయ పార్టీల నాయకులు హుందాతనాన్ని మరిచి, సమస్యలపై స్పందించి చర్చలకు తావులేకుండా, వ్యక్తిగత దూషణలతో ప్రజలు అసహ్యించుకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి, సమస్యలపై చర్చలు లేవనెత్తాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పూర్తిచేస్తే, మిట్ట ప్రాంతానికి వరప్రసాదంగా రైతాంగానికి ఉపయోగపడుతుందన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. రెండో విడత ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని, మిషన్ భగీరథ నీళ్లు నిరంతరం సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల ఎన్నికైన గోపాల్‌పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మిని చాడ వెంకట్‌రెడ్డి సన్మానించారు. సర్పంచ్‌గా ఎన్నికైన లక్ష్మి ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల మనలను పొందే విధంగా పనిచేయాలని, ఏసమస్య వచ్చినా అందుబాటులో ఉండి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయి తినిపించారు. విలేకరుల సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, ఏదునూరి వెంకటరాజు, కొట్టె పాక రవి, మాలోత్ శంకర్ నాయక్, ఉట్కూరు ప్రణీత్ గౌడ్, కొట్టే వెంకటేష్, సూరా మొగిలి, మనోహర్ రావు, మాధవరావు, రాజు, యాకూబ్ పాల్గొన్నారు.

# నేరం ప్రభుత్వానిది.. శిక్ష విద్యార్థులకా?

గందరగోళంలో

పేద విద్యార్థుల భవిష్యత్తు

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం నేరం చేస్తే శిక్ష విద్యార్థులు అనుభవించాలా అని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేసేందుకే జిఒ నెం.7ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, న్యూడెమోక్రసీ నాయకులు ఖాసీం, వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. 14 లక్షల మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆసరాగా నిలుస్తుందని, ఆ పథకాన్ని రద్దు చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా చేసేందుకే ప్రభుత్వం యత్నిస్తుందని వారు ఆరోపించారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ విషయమై ఆందోళన చేపట్టిన ప్రభుత్వం స్పందించలేదని కళాశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని ప్రకటించి విద్యార్థులను చేర్చుకున్నారని ఇప్పుడు ప్రభుత్వం ఫీజులు చెల్లించేది లేదని చెబితే ఎలా అని వారు ప్రశ్నించారు. స్కాలర్‌షిప్ కూడా యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి ఎఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్ అధ్యక్షత వహించగా ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, మాస్‌లైన్ జిల్లా నాయకులు సివై పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, బిసి సంఘం నాయకులు మేకల శ్రీనివాసరావు, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు నందిపాటి మనోహర్, పగిడిపల్లి ఏసు, జగన్, తుడుం ప్రవీణ్, గోకినేపల్లి మస్తాన్, జమ్మి అశోక్, చింతల రమేష్, బషీరుద్దీన్, మధు, పవన్, గోపి, శివ, చైతన్య, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/రెబ్బెన :** రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. రెబ్బెన మండలంలోని ఈ ఆరోగ్య కేంద్రం జాతీయ రహదారి పక్కన ఉండటం వల్ల రోడ్డు ప్రమాద బాధితులు ఎక్కువగా వస్తున్నారని, ఇక్కడ అత్యవసర వైద్యసౌకర్యాలు లేక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రసవాలు, పాము కాటు వంటి అత్యవసర కేసులకు స్పెషలిస్ట్ డాక్టర్లు లేక గర్భిణీలు, రోగులు ఆసిఫాబాద్ లేదా మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చి జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, అలాగే 30 పడకల వార్డు, ఆధునిక ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, 24 గంటల ల్యాబ్ సౌకర్యాలు కల్పించి పేద ప్రజలకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు.

# రైతుల ఆందోళనలు పట్టించుకోరా?

70 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే..

సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ :** మక్కలు, ధాన్యం కొనుగోలు నిలిచి రైతులు చేస్తున్న ఆందోళనలు ప్రభుత్వానికి, అధికారులు పట్టించుకోరా అని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో పండించిన మక్కలు, ధాన్యం కొనుగోలు విషయంలో అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ బాధ్యతారహిత్యం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దగ్గరవుతున్న సమయంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో మక్కలు, ధాన్యం పెద్ద ఎత్తున దిగుబడి రావడంతో దిగుబడి, కొనుగోలు, సరిపడిన గోనె సంచులను రైతులకు అందించే విషయంలో గానీ, సివిల్ సప్లై అధికారులు, కో ఆపరేటివ్ జిల్లా అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు, ఐకేపీ వంటి జిల్లా అధికారులు, సమన్వయం చేయాల్సిన జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ వంటి వారితో సమన్వయం లోపం ఈ పరిస్థితికి కారణమవుతుందన్నారు. జిల్లాలో 234 ఐకేపీ సెంటర్ల ద్వారా 6 కో ఆపరేటివ్ పీఏసీఎస్‌ల ఇతర సెంటర్‌ల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు సుమారు 50 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనగలిగారన్నారు. అందులో నుండి సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యమును, రైస్ మిల్లులు గోదాంలో చేర్చగలిగారన్నారు. అందులో ఇప్పటికి కల్లంలో నుండి లారీల వంటి వాహనాలు లేని కారణంగా మిల్లులకు గోదాంకు చేరని బస్తాలు కొనుగోలు కేంద్రాల వద్ద వేల సంఖ్యలో ఉన్నాయన్నారు. ఇప్పటికీ కొన్ని ఐకేపీ సెంటర్లు కొనుగోలు ప్రారంభించలేదన్నారు. ఇంకా కల్లాలో 70శాతం ధాన్యాన్ని ఖరీదు చేయనందున, అలాగే కుప్పలు పోసి పరదాలు కప్పి ఉంచారని వారికి గోనె సంచులు ఇచ్చి కాంటాలు పెట్టించే పరిస్థితి కూడా కనబడడం లేదన్నారు. రఘునాథపల్లి మండలం పెద్ద గ్రామమైన కంచనపల్లిలో సుమారు 60 వేల బస్తాల మక్కలు దిగుబడి వచ్చి కల్లాలలో నెల రోజుల క్రితమే పోయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 5వేల స్తాలు మాత్రమే కొనుగోలు చేసి లిఫ్ట్ చేయగలిగారన్నారు. ఈ నెల 25 నుండి తిరిగి మళ్లీ రోహిణి కార్తి ప్రవేశం వస్తుందని నూతన సంవత్సరం కోసం రైతులు భూములు మళ్లీ చదును చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 70 శాతం ధాన్యం మక్కలు కొనుగోలు కాకుండా ఇంకా ఆ విధంగానే ఉంటే కొనుగోలు చేసేది ఎప్పుడు? కాంట పెట్టేది ఎప్పుడు ? ఎగుమతి జరిగే ఎప్పుడు ? రైతుల బ్యాంక్ అకౌంట్లో డబ్బులు పడేది ఎప్పుడు ? అని ఆందోళనలో రైతులు ఉన్నారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సీరియస్‌గా ఆలోచన చేసి, తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రైతుల కోపానికి, ప్రభుత్వం గురికాకతప్పదని ఆయన హెచ్చరించారు.

## రైల్వే ఉద్యోగాల కోత నిర్ణయం రద్దు చేయాలి

ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో 'పోస్టు కార్డు' ఉద్యమం

**ప్రజాపక్షం/మునుగోడు:** రైల్వే శాఖలో ఉద్యోగాల కోత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎఐవైఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఉన్న ఉద్యోగాలను తగ్గించే చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. రైల్వే శాఖలో ఉద్యోగాల కోత వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైల్వే,టెలికం, రక్షణ శాఖలను ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగంగానే ఉద్యోగాల కోత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి పోస్టు కార్డుల ద్వారా నిరుద్యోగుల సమస్యలను తెలియజేస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, సంపంగి నరసింహ, కోటి, లక్ష్మణ్, వెంకట్, సైదులు తదితరులు పాల్గొన్నారు.





## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించి అండగా నిలుస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలో రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 92 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ధాన్యం ఎగుమతుల్లో రైతులు ఎదుర్కొంటున్న లారీల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. అనంతరం చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.అభినందనీయమని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ మాధవరావు, ఎంపీడీవో జాల రజిత,డీటీ వరప్రసాద్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరిగె నరసింహ,ఫాక్స్ చైర్మన్ తాళ్లూరి మురళి,వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి,సర్పంచులు చాడ సురేష్ రెడ్డి, గుజిలాల్ శేఖర్ బాబు పాల్గొన్నారు.

## ముగ్గురు మైనర్ బైక్ దొంగలు అరెస్ట్

### 4 ద్విచక్ర వాహనాలు రికవరీ:టూ టౌన్ ఎస్ఐ సైదులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** చెడు వ్యసనాలు,జల్సాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా యువత చదువు, క్రమశిక్షణపై దృష్టి పెట్టాలని టూ టౌన్ ఎస్ఐ వై.సైదులు సూచించారు.శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టూ టౌన్ పరిధిలో రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని ముగ్గురు మైనర్ యువకులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సీఐ పర్యవేక్షణలో ముగ్గురు మైనర్ల గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి 4ద్విచక్ర వాహనాలను రికవరీ చేశామన్నారు. మేము లోకల్,ఎవరూ గుర్తుపట్టరు అనే ధైర్యంతో జల్సాలకు అలవాటు పడి వాహనాలను అపహరించారు.దొంగిలించిన వాహనాల రూపురేఖలు, నంబర్ ప్లేట్లు మార్చి తిరుగుతున్నట్లు విచారణలో వెల్లడైంది.ఫిర్యాదుల మేరకు ప్రత్యేక బృందంతో గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నామని,3హోండా యాక్టివా స్కూటీలు,1పల్సర్ ఎన్ఎస్ 200 బైక్ సహా మొత్తం 4 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.3.5లక్షలు ఉంటుందని తెలిపారు.కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుళ్లు ఎండీ షకీల్, ఎల్. బాలకోటిని ఉన్నతాధికారులు అభినందించారు.

## వేగంగా ధాన్యం అన్‌లోడింగ్

### మిల్లర్లకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశం



**ప్రజాపక్షం/వేములపల్లి :** రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.శుక్రవారం వేములపల్లి మండలం శెట్టిపాలెంలోని వసంత రైస్ ఇండస్ట్రీస్, పద్మశ్రీ రైస్ ఇండస్ట్రీస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. బి రిజిస్టర్, ట్రక్ షీట్స్,మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్‌లను తనిఖీ చేశారు.ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సరిపడా హమాలీలు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అన్‌లోడింగ్‌లో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు.అదనపు కలెక్టర్ వెంట మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం తదితరులు ఉన్నారు.

## 75 మొబైల్ ఫోన్ల రికవరీ..

### బాధితులకు అందజేసిన యాదాద్రి భువనగిరి పోలీసులు



**ప్రజాపక్షం/భువనగిరి :** జిల్లాలో పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను యాదాద్రి భువనగిరి పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి బాధితులకు అందజేశారు. జిల్లాలో పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను యాదాద్రి భువనగిరి పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి బాధితులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో మొత్తం 75 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు జిల్లా పోలీసులు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్ల విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సెల్ ఫోన్లు పోయిన వెంటనే బాధితులు సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయడం వల్ల ఫోన్ల ట్రాకింగ్ సులభమైందని అధికారులు వివరించారు. పోయిన ఫోన్ల ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సాంకేతిక బృందం ప్రత్యేకంగా పరిశీలించి వాటి లొకేషన్ను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో వినియోగంలో ఉన్న ఫోన్లు కూడా ట్రేస్ చేసి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నెలల తరబడి ఆశలు వదులుకున్న తమ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని కుడకుడ 11కెవి లైన్‌లో నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుండి 1 గంటల వరకు చెట్టుకొమ్మలు తొలగించుట కొరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఇ మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకనగర్, స్నేహానగర్, భాగ్యనగర్, జిఎంఆర్, పాతఊరు, లింగానగర్, కీర్తినగర్‌లలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అంతా దో(రా)పిడే!

### కేంద్రాల నిర్వాహకులతో మిల్లర్లు మిలాఖత్...
### బస్తాకు 5 కేజీల తరుగు!
### అన్నదాతకు అపారనష్టం!

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఆరుగాలం శ్రమించి పంటను పండించిన అన్నదాతను ధాన్యం కొనుగోలు నిర్వాహకులతోపాటు మిల్లర్లు దోచుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లు మిలాఖత్ అయ్యి అమ్మకానికి రైతులు తెచ్చిన ధాన్యంలో తాలు, పెల్ల, చెత్త, తేమ పేరుతో బస్తాకు 5 కేజీల తరుగు తీస్తున్నారు. దీంతో అన్నదాతకు అపారనష్టం జరుగుతుంది.

రబీ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో అధికారులు మొత్తం 352 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకెపి 179, పిఏసిఎస్ 144, మెప్మా, ఆకా, ఎఫ్‌టిఓ 29 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో సన్న ధాన్యం కొనుగోలుకు 117 కేంద్రాల్లో, 235 కేంద్రాల్లో దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో మొత్తం రైతులు 4లక్షల 82వేల ఎకరాలలో వరిని సాగు చేయగా, 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో 4.79లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా గత నెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం ఈనెల 7వ తేదీ వరకు 1.83వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగింది.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు ప్రతి సీజన్‌లాగే మిలాఖత్ అయ్యి రైతులను దోచుకుంటున్నారు. తేమ, తాలు, పెల్ల, చెత్త పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బస్తాకు 2 కేజీల వరకు, మిల్లర్లు బస్తాకు 3 కేజీల వరకు తరుగు తీస్తున్నారు. ఇదేమని



రైతులు ప్రశ్నిస్తే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కొంత డబ్బు ముట్ట చెప్పడంతోపాటు మందు, విందు ఇచ్చిన రైతులవే కాంటాలు వేస్తున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్తా తూకం 40.60 కిలోలు కాగా కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 42.70 తూకం వేస్తూ అదనంగా 2 కిలోలు దోచుకుంటున్నారు. కాంటా వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలిస్తే మిల్లర్లు మేమేమన్నా తక్కువ తిన్నామా అంటూ ధాన్యం నాణ్యంగాలేదని బస్తాకు 3 కిలోలు తరుగు తీస్తున్నారు. ఇదేమని రైతులు వారిని గట్టిగా నిలదీస్తే ధాన్యం దిగుమతి చేసుకోకుండా రోజులతరబడి మిల్లుల వద్ద పడిగాపులు కాపిస్తున్న పరిస్థితి.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు మిలాఖత్ కావడంతో రైతులకు అపార నష్టం జరుగుతుంది. ప్రభుత్వం గ్రేడ్‌ఏ వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 ప్రకటించడంతోపాటు సన్నరకం ధాన్యానికి అదనంగా బోనస్ రూపంలో క్వింటాకు రూ.500లు చెల్లిస్తుంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్ల దోపిడితో బస్తాకు రైతులు రూ.300 మేరకు, క్వింటాకు రూ.750లు నష్టపోతున్నారు. ఈ దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో రైతులు, రైతు సంఘాల నాయకులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా సెంటర్లను అధికారులు తనిఖీ చేస్తున్న ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి దోపిడిని అరికట్టాలని కోరుతున్నారు.



## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, ఆధునిక చేపల పెంపకం ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ సుజాత తెలిపారు.ప్రజాపాలప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నల్లగొండలోని టిఎన్‌జీఓ భవన్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో చేపల పెంపకం చేపడితే అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు,సబ్సిడీలు,శిక్షణ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారాం మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బలోపేతానికి శాఖ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో ఈ. మారయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు,సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## జనగణనలో భాగస్వామ్యం కండి

### అభివృద్ధికి బాటలు వేయండి
### మే 10లోపు స్వీయ గణన పూర్తి చేయండి
### జనగణన వాక్‌లో జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ :** 2027 జనగణనలో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని, జిల్లాలోని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా స్వీయ గణన పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.స్వీయ జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో శుక్రవారం ముఖ్య ప్రణాళిక అధికారి, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌జి కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు జనగణన వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2027 జనగణనలో భాగంగా ముందుగా స్వీయ గణన, గృహాల లెక్కింపు, అనంతరం జనగణన చేపడుతున్నట్లు తెలిపారు. గత నెల 26 నుంచి ప్రారంభమైన స్వీయ గణన ఈ నెల 10తో ముగుస్తుందని చెప్పారు. 16 భాషల్లో ఈ సేవ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నెల 11నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ నిర్వహిస్తారని చెప్పారు.దేశ అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా అక్కడి నుంచే తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లాలో సుమారు 20 లక్షల జనాభా, 5.50 లక్షల ఇళ్లు ఉన్నాయని, ఇప్పటివరకు 12 వేల కుటుంబాలు స్వీయ గణన పూర్తి చేసుకున్నాయని తెలిపారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకే జనగణన వాక్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంటి నుంచే సెల్‌ఫోన్ ద్వారా కేవలం 10 నిమిషాల్లో స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. గడువు ముగియడానికి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ,సెన్సస్ జాయింట్ డైరెక్టర్ రఘు,సీపీఓ శ్రీనివాస్ నాయక్,అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర,డివైఎస్ఓ అక్బర్ అలీ,తహసీల్దార్ పరశురాం,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మే 13వ తేది నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 13 నుండి మే 21 వరకు థియరీ పరీక్షలు జరుగుతాయని, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, వెలుతురు, ఫస్ట్‌ఎయిడ్ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సిసి కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేలా వాతావరణం కల్పించాలని, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ బి. సులోచన రాణి, భాను నాయక్, ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రముఖ కంపెనీలే వచ్చి ఉద్యోగాలివ్వడం శుభపరిణామం




భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యువత ఉద్యోగ అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో, ప్రముఖ కంపెనీలే జిల్లా కేంద్రానికి వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం శుభపరిణామమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుంభం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళా మే 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రాంగణంలో జరుగనుంది. దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రముఖ 1M1B సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు 3500 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుప్పం, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతాల్లో విజయవంతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన 1M1B సంస్థ, ఇప్పుడు తెలంగాణ యువత కోసం రాష్ట్రంలో మొట్టమొదటిసారి యాదాద్రి భువనగిరిని వేదికగా ఎంచుకోవడం విశేషంగా నిలిచిందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమా, ఇతర అర్హతలు కలిగిన యువతకు ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపెనీలు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయన్నారు. జాబ్ మేళా మొదటి రెండు రోజులు అయిన మే 8, 9 తేదీలలో అభ్యర్థుల స్క్రీనింగ్, సర్టిఫికెట్ల పరిశీలన, టోకెన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండీ ఆవేస్ చిస్తీ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ వార్డ్ కౌన్సిలర్, భువనగిరి పట్టణ, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై భారం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పైన ధరలు పెంచి సామాన్యులపై అధిక భారం మోపుతుందని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని, పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని డిమార్ట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర ఒక్కసారిగా రూ.993 పెంచడం అత్యంత దుర్మార్గం అన్నారు. దీంతో హోటల్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారాలపై పెనుభారం పడుతుందన్నారు. దీని ద్వారా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో గత కొన్ని మాసాలుగా గ్యాస్ వినియోగదారులు సకాలంలో గ్యాస్ సిలిండర్ సరఫరా కాకపోవడం వల్ల వినియోగదారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లీశ్వరి, మైనార్టీ జిల్లా నాయకులు ఎండి పాషా, ఏఐవైఎఫ్ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, అధ్యక్షులు బూర సైదులు, కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, ఎస్‌కె మదర్ పాల్గొన్నారు.

## ఎస్పీఎఫ్ సిబ్బంది జోరు.. 10 కిలోమీటర్ల పరుగు!

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది ఉత్సాహంగా పరుగు తీశారు. డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ఆలయ భద్రతా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సిబ్బంది శారీరక దృఢత్వం, చురుకుదనం పెంచే లక్ష్యంతో కొండపై ఉన్న తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొని తమ ఫిట్నెస్ను చాటుకున్నారు.పరుగు ముగిసిన అనంతరం, కొండ కింద ఉన్న కల్యాణకట్ట ఆవరణలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈవో జె. భవాని శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందిని అభినందించారు. స్వయంగా పారిశుధ్య పనుల్లో పాలుపంచుకుని భక్తులకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు ,పెద్ద సంఖ్యలో ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించొద్దు



**ప్రజాపక్షం/రామన్నపేట :** వర్షాలు వచ్చిన సందర్భంలో చెరువుల నుండి అలుగు పోసి సహజంగా ఉపరితలంలో ఎత్తుగా మట్టి పోసి వర్షపునీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రామన్నపేట మండలం ఇస్కిల్లా గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం సాగునీటిపారుదల శాఖ అధికారులకు, స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకులారపు జనార్దన్ రెడ్డి, కాకులారపు శంతన్ రెడ్డి, యాదిరెడ్డి మాట్లాడుతూ ఇస్కిల్లా గ్రామంలోని ఆసిఫ్ నహార్ కాల్వ పరిధిలో ఉన్న పోతారపు చెరువులోనికి చెరువు పరివాహ ప్రాంతము నుండి వచ్చే సహజ సిద్ధంగా వచ్చే వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ పరిధిలో ఏనుగు సత్తిరెడ్డి అనే రైతు సహచరిత ప్రవాహానికి అక్రమంగా ఎత్తుగా మట్టి కట్టను నిర్మిస్తూ ఉండడంవల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వారిపై చర్య తీసుకోవాలని వారు కోరారు. పోతారు చెరువులో నీరు నిల్వ ఉండడం మూలంగా ఇస్కిల్లా, కక్కిరేణి గ్రామాలలో సుమారు 1000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వారి వెంట ఇస్కిల్లా గ్రామానికి చెందిన పలువురు రైతులు తదితరులు ఉన్నారు.

## ఆదాయ పన్ను చట్టంపై అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కొత్త ఆదాయ పన్ను చట్టం 2025కు మార్పులపై ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్ను కమీషనర్ (రేంజ్6) రీమా యాదవ్, ఉప ఆదాయ పన్ను సంచాలకులు (దర్యాప్తు) డి. వెంకట హరీష్‌లు మాట్లాడుతూ కొత్త ఆదాయ పన్ను చట్టం, 2025 యొక్క ప్రాముఖ్యతపట్ల అందరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ చట్టం పన్ను చట్టాలను సరళీకరించడం, క్లిష్టతను తగ్గించడం, పారదర్శకతను పెంపొందించడం, డిజిటల్ పాలనను బలోపేతం చేయడం, స్వచ్ఛంద పన్ను చెల్లింపులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రూపొందించడం జరిగిందన్నారు. 2025లో మార్పులు, కొత్త నిబంధనలు, కొత్త ఫారాలపై భాగస్వామ్య వర్గాలకు అవగాహన కల్పించడంతో పాటు పన్ను చెల్లింపుదారులకు, పన్ను నిపుణులపై ప్రయోగిత ప్రభావాలపై మెరుగైన అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మార్పుల చేర్పులపై సంపూర్ణంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆదాయ పన్ను అధికారి నిషాంత్ గోయల్, ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుమార్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు, పన్ను నిపుణులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, చెల్లింపుదారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

కరీంనగర్
శనివారం
09-05-2026
www.prajapaksham.in

రామ్ చరణ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'తో వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

రీల్

## అక్కినేని మేకప్ వేసుకున్నతొలి ఫోటో

### సోషల్ మీడియాలో ఫోటో వైరల్




1944 మే 8న తెనాలి నుంచి వచ్చిన యువకుడు అక్కినేని నాగేశ్వరరావు మొదటిసారి మేకప్ వేసుకుని కెమెరా ముందు నిలిచాడు. ఘంటసాల బలరామయ్య ఆయనను గమనించి 'శ్రీ సీతారామ జననం'లో రాముడి పాత్ర అప్పగించారు. ఆ ఒక్క రోజు తెలుగు సినిమాకు ఒక మహానటుడిని అందించింది. తర్వాత దశాబ్దాలు ఏఎన్ఆర్ తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో రాముడు నుంచి దేవదాసు వరకు అన్ని రకాల పాత్రలు చేసి 'నటసామ్రాట్'గా అవతరించారు. ఆయన గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. నటనకు నిలువెత్తు నిదర్శనం డా. అక్కినేని నాగేశ్వర్ రావు. మే 8వ తేదీ ఆయన కెమెరా ముందుకు వచ్చిన రోజు. సందర్భంగా అక్కినేని అభిమానులు, సినీ జనాలు ఆయన గుర్తుచేసుకుంటున్నారు. ఈ ఫోటోను సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

## 'ఐ యామ్ గేమ్' షూటింగ్ పూర్తి

దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఐ యామ్ గేమ్' దక్షిణ భారతదేశంలోని 100కి పైగా లొకేషన్‌లలో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా దుల్కర్ సల్మాన్ ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన సినిమాల్లో 'ఐ యామ్ గేమ్'నే అత్యంత స్టైలిష్ ఫిల్మ్ అని తెలిపారు. సినిమాలో తన పాత్రతో పాటు మొత్తం వరల్డ్ చాలా మోడర్న్, స్టైలిష్‌గా డిజైన్ చేశారని చెప్పారు. దర్శకుడు నహాస్ హిదాయత్ ప్రత్యేకంగా తనని ఓ కొత్త స్టైలిష్ అవతార్‌లో చూపించాలని భావించారని, అదే ఈ ప్రాజెక్ట్‌కు హైలెట్‌గా మారిందని తెలిపారు. బ్లాక్‌బస్టర్ 'ఆర్‌డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను వచ్చే ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ చిత్రం, మలయాళ సినీ పరిశ్రమలో కూడా అత్యంత పెద్ద రిలీజ్‌లలో ఒకటిగా నిలవనుంది. వే ఫారర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు. 'లోకా' వంటి మెగా బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిలిమ్స్ నుంచి వస్తున్న తదుపరి చిత్రం ఇదే. ఇది ఆయన 40వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో ఆంటోని వర్గీస్, మైస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారి, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ స్టంట్ ద్యుయో అన్బరివ్ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. 'ఐ యామ్ గేమ్' మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.



## 'పవర్‌పేట' గ్లింప్స్ రిలీజ్



విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రముఖ బ్యానర్ 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం పవర్ పేట. సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రచయిత నుంచి దర్శకుడిగా మారిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌పేట చిత్రం నుంచి ఆకట్టుకునే గ్లింప్స్‌ను విడుదల చేశారు.ఈ గ్లింప్స్ థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో హంగామాతో హై వోల్టేజ్ మూడ్‌లో ప్రారంభమవుతుంది. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య హీరో ఎంట్రీ, సిగరెట్ తాగుతూ సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం అలరించింది ఆ తర్వాత ఆ నేల స్వభావం, దానికి శక్తినిచ్చే మనుషుల గురించి చెబుతూ తన పాత్ర ఇంటెన్స్ చూపించారు. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసిరే సీన్‌తో గ్లింప్స్ మరింత మాస్ ఫీల్‌ను అందించింది.దర్శకుడు కృష్ణ చైతన్య భారీ స్థాయి మాస్ క్యారెక్టరైజేషన్‌ను ఎంత బలంగా డిజైన్ చేశారో ఈ గ్లింప్స్‌లో స్పష్టమవుతోంది. పాత్ర ఎలివేషన్స్, డైలాగ్స్ ఆయన రచయితగా ఉన్న బలాన్ని మరోసారి చాటాయి. సిగరెట్ వెలిగించే చిన్న సీన్‌ను కూడా కోపం, ఆవేశంతో నింపి చూపించిన తీరు దర్శకుడి స్టైల్‌ను ప్రతిబింబిస్తోంది. మధీ సినిమాటోగ్రఫీ పీరియాడిక్ సెటప్‌ను అద్భుతంగా చూపించగా, మణిశర్మ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి ఫ్రేమ్‌కు మరింత పవర్ ఇచ్చింది. నేషనల్ అవార్డ్ విన్నర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ నిర్వహిస్తుండగా, రామకృష్ణమోనిక ప్రొడక్షన్ డిజైన్, సచిన్ సుధాకరన్, హరిహరన్ సౌండ్ డిజైన్ చిత్రానికి ప్రత్యేకతాను తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది.

## 'పెద్ది' విజయనగరం ఏరియాలో జరిగే కథ:

### ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా

రామ్ చరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా పదేళ్ల కెరీర్‌లో ఒక కథకి ఇంతలా ఎక్సైట్ అవ్వడం ఇదే ఫస్ట్ టైం. డైరెక్టర్ కథ చెప్పిన తర్వాత ఒక 20 నిమిషాల పాటు నేను మనిషిని కాలేకపోయాను. అంతలా కదిలించింది. కథలోనే ఇంత బలం ఉంది కాబట్టి ప్రొడక్షన్ డిజైన్ పరంగా అన్ని విషయాల్లో చాలా కేర్ తీసుకోవాలని అప్పుడే డిసైడ్ అయ్యాను.ఒక సినిమాకి సెట్ వేసినప్పుడు అది ఆడియన్స్‌కి సెట్ అని తెలియకపోవాలి. అప్పుడే ఒక ఆర్ట్ డైరెక్టర్ సక్సెస్ అయినట్టు. నా వరకు ఈ సినిమాకి వేసిన సెట్స్‌ను ఆడియన్స్ అవి సెట్ అని గ్రహించలేరు. అంత నేచురల్‌గా ఉంటాయి.ఇది 70–80లలో జరిగే కథ. ఇదివరకే చాలా పీరియడ్ సినిమాలు చేశాను. ఆ అనుభవం నాకు ఉంది.'పెద్ది' విజయనగరం ఏరియాలో జరిగే కథ. అక్కడి వీధులు, క్లాక్ టవర్ ఇవన్నీ కూడా రీ క్రియేట్ చేశాం. విజయనగరం చుట్టుపక్కల ప్రాంతాలు కూడా డిజైన్ చేశాం. అలాగే కుస్తీ, క్రికెట్ ఆటల విషయంలో కూడా చాలా కేర్ తీసుకున్నాం. ఇందులో ఇప్పటివరకు ఎవరూ చూడని కుస్తీ సెటప్ చేశాం. దానికోసం



అండర్‌గ్రౌండ్ సెటప్‌లో షూట్ చేశాం. చరణ్ గదతో కనిపించిన షాట్ అక్కడే చేశాం.డీవోపీకి, ఆర్ట్ డైరెక్టర్‌కి ఒక సింక్‌లో ఉంటే సినిమా ఖచ్చితంగా పర్ఫెక్ట్‌గా వస్తుంది. ఇందులో అలాంటి మంచి సింక్ కుదిరింది. రత్నవేలుతో పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. మంచి కోఆర్డినేషన్‌తో వర్క్ చేశాం.ఇది 70–80 మధ్యలో విజయనగరం బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. మీరు క్రికెట్ చూస్తున్నప్పుడు మన ఊర్లో పొలాల గట్ల మీద కూర్చుని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ ఉంటుందో అంత నేచురల్ ఫీలింగ్ క్యారీ అవుతుంది. ఇందులో ఒక హిల్ స్టేషన్ ఊరు కావాలి. అది హైదరాబాద్‌లోని ఒక బూత్ బంగ్లాలో వేశాం. మీరు సినిమా చూస్తున్నప్పుడు అది ఒక కొండ కింద ఉన్న ఊరిలా అనిపిస్తుంది. ఆ సెట్ వేయడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఇందులో చెరుకు ఫ్యాక్టరీ ఉంటుంది. అది కూడా సెట్. అన్ని వెదర్ కండిషన్స్‌కు అనుకూలంగా ఉండేలాగే ఆ సెట్ వేసాం.. ఒక దేశీ ఆటగాడు తనకు దొరికే ముడిసరుకులతో బ్యాట్‌ని ఎలా తయారు చేసుకుంటాడో ఆ బ్యాట్ కూడా అంతే నేచురల్‌గా ఉంటుంది. అలాగే తనకు ఒక మేనరిజం ఉంటుంది. అవన్నీ కూడా అందులో రూపొందించడం జరిగింది.యాక్షన్ సీక్వెన్స్‌లో కుస్తీ సమయంలో చరణ్ కు గాయం అయింది. అలాంటి కండీషన్‌లో కూడా చరణ్ వెంటనే మళ్లీ షూటింగ్‌లోకి వచ్చారు. ఎందుకంటే ఆ నెల షూట్ చేయకపోతే ఆర్టిస్ట్ డేట్స్ అన్నీ మిస్ అయిపోతాయి. అందుకే మళ్లీ వెంటనే వచ్చి చేశారు. కొత్తగా రాబోతున్న సినిమాలు 'పారడైజ్', అలాగే చిరంజీవి సినిమా.

## 'లబ్బరు బొమ్మ' సాంగ్ అదుర్స్

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కి ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. తాజాగా 'అనకాపల్లి' నుంచి అదిరిపోయే మాస్ సాంగ్ ను రిలీజ్ చేశారు. 'లబ్బరు బొమ్మ' అంటూ సాగే ఈ ఐటం సాంగ్ అదిరిపోయిందని చెప్పుకోవచ్చు. ఇందులో తారక్ పొన్నప్ప స్టెప్పులు, నందినీ రాయ్ అందాలు ప్రేక్షకుల్ని కట్టి పడేసేలా ఉన్నాయి. ఇక రాంబాబు గోశాల సాహిత్యంతో పాటుగా దేవ్‌జండ్ క్యాచీ ట్యూన్ ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. ఇక శ్రీ కృష్ణ, సాహితీ చాగంటి గాత్రం మరింత స్పెషల్ అట్రాక్షన్ అని చెప్పుకోవచ్చు. యశ్ మాస్టర్ కొరియోగ్రఫీతో ఈ పాట మరింత ప్రత్యేకంగా మారింది.ఇప్పటికే 'అమ్మోరు దిగినాది' అనే పాట యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఇక ఈ 'లబ్బరు బొమ్మ' కూడా చార్ట్ బస్టర్‌గా నిలిచేలా ఉంది. ఈ చిత్రానికి మాయా.వి కెమెరామెన్‌గా, శ్రీకృష్ణ అట్టలూరి ఎడిటర్‌గా పని చేశారు. త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రానికి ఉదయ్ భాగవతులు డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు.



## రేణిగుంట-అగర్తాల మధ్య పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



### -సరుకురవాణాకు కొత్త దారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణా రంగంలో మరో కీలక అడుగు వేసింది. గుంతకల్ డివిజన్ ఆధ్వర్యంలో రేణిగుంట–అగర్తాల మధ్య పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తూ దేశవ్యాప్తంగా వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కొత్త దారులు తెరిచింది. రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి శుక్రవారం ఈ సేవను ప్రారంభించారు. ఈ ప్రత్యేక రైలు ద్వారా ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసిజి)తో పాటు వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘదూరాలకు వేగంగా, తక్కువ ఖర్చుతో తరలించే అవకాశం కలుగుతుంది.ఇటీవలి కాలంలో రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా రేణిగుంట పరిసరాల్లో వ్యవసాయ ఉత్పత్తులు విస్తృతంగా పండుతున్నాయి. అయితే, వాటిని దూర ప్రాంతాలకు రోడ్డు మార్గంలో తరలించడం ఖర్చుతో కూడుకున్నదిగా, సమయపరంగా ఆలస్యం కలిగించేదిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా గుంటకల్ డివిజన్ 6 సంవత్సరాల కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ సేవను ప్రారంభించింది.ప్రారంభ రన్‌లో సుపారి (బెటెల్ నట్స్), అగర్బత్తులు, చాక్లెట్లు, 'ఆల్ అవుట్' లిక్విడ రీఫిల్స్ వంటి వస్తువులను రవాణా చేశారు. భవిష్యత్తులో మిర్చి, టైర్లు, ఐటిసి ఉత్పత్తులు, కాడ్బరీ కాన్ఫెక్షనరీలు, కిమ్బర్లీ క్లార్క్ ఉత్పత్తులు, పెర్ఫెట్టి వంటి ప్రముఖ కంపెనీల సరుకులు కూడా ఈ మార్గంలో తరలించే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ కార్గో రైలు ద్వారా దక్షిణ భారతదేశం నుంచి కోల్‌కతా, గువాహటి, సిల్చర్, అగర్తల వంటి ప్రధాన వాణిజ్య కేంద్రాలకు వేగవంతమైన అనుసంధానం ఏర్పడనుంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా సరుకు రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం కాంట్రాక్ట్ కాలంలో సుమారు రూ.54 కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ సేవ ప్రారంభాన్ని అభినందిస్తూ, ఇది రైల్వే ఫ్రైట్ వ్యాపారాన్ని విస్తరించడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమలకు ఇది నమ్మదగిన మరియు చవకైన రవాణా మార్గంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## ముదిరాజ్‌లను బిసి.డి నుంచి బిసి.ఎ లోకి మార్చాలి

### సిఎం రేవంత్ రెడ్డికి ముదిరాజ్ సంఘం నేతలు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులగణన నివేదిక నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బిసి.డి నుంచి బిసి.ఎ లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నేతలు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, రోహిత్ ముదిరాజ్, పిట్ల మోహన్, బిసి జర్నలిస్టుల ఫోరం నేత బలరాం, పుట్టి రాజు, బండారు మోహన్, ఓయూ జెఎసి నేత సంతోష్, ఆగం పాండు తదితరులు పాల్గొన్నారు. ముదిరాజ్ సమాజానికి సంబంధించిన పలు సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముదిరాజ్ సమస్యలపై బిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మంత్రి వాకిటి శ్రీహరి లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోర్టు పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు. ముదిరాజ్ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి వాకిటి శ్రీహరి, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితర నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## సమయం పాటించరా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పటికీ, అమలు విషయంలో లోపాలు కనిపిస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఒకరిద్దరు మంత్రుల పేషీలు తప్పితే మిగితా మంత్రుల పేషీలలో దాదాపు ఇదే పరిస్థితి కనబడుతున్నది. ప్రభుత్వం పారదర్శకత, ప్రజాసేవ లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నామని ప్రకటిస్తుండగా, సిబ్బంది ఈ విధమైన వ్యవహారం ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావం చూపుతుందని పలువురు అధికారులు అంటున్నారు. పైస్థాయి అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి, సచివాలయంలో క్రమశిక్షణను పటిష్టంగా అమలు చేయాలని వివిధ పనులపై సచివాలయానికి వస్తున్న ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి, హాజరు నమోదుపై కఠిన చర్యలు తీసుకోవడం, పని గంటలను ఖచ్చితంగా పాటించేలా పర్యవేక్షణ పెంచడం అవసరమని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**మంత్రిపేషీలో మహిళా సిఇఒ ఉండగానే తాళం వేసి వెళ్లి పోయిన సిబ్బంది**

తెలంగాణ సచివాలయంలో ఒక మహిళా అధికారిని ఇబ్బంది పడిన పరిస్థితి సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పవచ్చు. ఇటీవల ఒక మంత్రి పేషీలో మహిళా సిఇఒ విధుల్లో ఉండగా సిబ్బంది బయటి నుంచి తాళాలు వేసి వెళ్లిపోయిన ఘటన కలకలం రేపింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, సంబంధిత మంత్రి, ఓఎస్‌డి కార్యాలయం నుంచి వెళ్లిన కొద్దిసేపటికే పేషీలో పనిచేస్తున్న సిబ్బంది కూడా రోజు పని ముగిసిందని హడావుడిగా కార్యాలయాన్ని మూసివేశారు. అయితే, అప్పటికే ఒక కీలక శాఖకు చెందిన మహిళా సిఇఒ పేషీ లోపలే ఉన్న విషయాన్ని వారు గుర్తించలేదు. కొంతసేపటి తర్వాత ఆమె బయటకు రావాలనుకున్నప్పుడు తలుపులు తాళం వేసి ఉండటంతో ఆశ్చర్యానికి గురయ్యారు. తదుపరి సిబ్బందిని సంప్రదించి తాళాలు తెరిపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన సెక్రటేరియట్‌లో ఉన్నతాధికారుల మధ్య చర్చనీయాంశంగా మారింది. భద్రతా పరంగా ఇది తీవ్రమైన లోపమని, ఇలాంటి నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీసే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సెక్రటేరియట్‌లో మంత్రుల పేషీల్లో సమయపాలన పాటించకపోవడం, ముందుగానే కార్యాలయాలు మూసివేయడం వంటి అంశాలపై విమర్శలు వస్తుండగా, ఈ ఘటన మరింత వివాదానికి దారి తీసింది. కార్యాలయంలో ఎవరు ఉన్నారు, ఎవరు లేరు అనే ప్రాథమిక పరిశీలన కూడా చేయకుండా తాళాలు వేయడం బాధ్యతారాహిత్యం అని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సంబంధిత శాఖ అంతర్గత విచారణ చేపట్టే అవకాశమున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని అధికారులు అంటున్నారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారిని సిబ్బంది నిర్లక్ష్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా ప్రభుత్వం కృషి

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మిడిహెట్టి నుండి కాళేశ్వరానికి తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో మహారాష్ట్రకు ఎలాంటి నష్టం లేదని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా తెలంగాణ బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, కలెక్టర్ హరిత, ఎస్పి నిఖిత పంత్ తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

(మొదటి పేజీ తరువాయి)

పేరు ఖరారు చేశారు. బిజెపి కొత్త ప్రభుత్వంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మహిళా నేత అగ్నిమిత్ర పాల్‌కు ఒక ఉప ముఖ్యమంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. డిప్యూటీ సిఎంగా ఆమె ఎంపికైతే బెంగాల్ తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టిస్తారు. రెండో ఉప ముఖ్యమంత్రి పదవిని ఉత్తర బెంగాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అమిత్ షా ఇప్పటికే అగ్నిమిత్ర పాల్, శంకర్ ఘోష్‌లతో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. జ్యోతిబసు ప్రభుత్వంలో బుద్ధదేవ్ భట్టాచార్య తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు బెంగాల్‌లో ఉప ముఖ్యమంత్రుల వ్యవస్థ రాబోతోంది. కాగా, శనివారం కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ మైదానంలో సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రమాణస్వీకారానికి యంత్రాంగం అంతా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**అప్పుడు టిఎంసి వీడి– ఇప్పుడు అదే పార్టీని ఓడించి**

పశ్చిమ బంగాల్‌లో 15 ఏళ్ల మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కూల్చడంలో సువేందు అధికారి కీలక పాత్ర పోషించారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా ఎదిగిన సువేందు ఆరేళ్ల కిందట అనూహ్యంగా తృణమూల్‌ను వీడారు. ఇప్పుడు తన మాజీ గురువు మమతా బెనర్జీ స్థానంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారు. బెంగాల్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీని ఓడించిన సువేందు అధికారి ఈ సారి అంతకంటే ఎక్కువ మెజార్టీతో భవానీపూర్‌లోనూ ఓడించారు. బెంగాల్‌లో బిజెపికి 207 సీట్లు రావడంలోకీలక పాత్ర పోషించారు. సువేందు అధికారి 1970 డిసెంబర్ 15న బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లా కాంతిలో జన్మించారు. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండడంతో చిన్నప్పటి నుంచీ వాటిని బాగా వంటబట్టించుకున్నారు. సువేందు అధికారి తండ్రి శిశిర్ అధికారి మన్మోహన్‌సింగ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. సువేందు సోదరులు కూడా రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు.

**కాంగ్రెస్ నుంచి ప్రస్థానం**

సువేందు అధికారి తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ద్వారా ప్రారంభించారు. 1995లో కాంగ్రెస్ తరఫున కాంథీ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1998లో మమతా బెనర్జీ స్థాపించిన టిఎంసిలో చేరారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు 2004లో తమలుక్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో అదే తమలుక్ స్థానం నుంచే ఎంపీగా గెలుపొందారు.

## కొడంగల్‌కు నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

గడి ఏకమై కొడంగల్‌ను ఒక నందనవనంగా పాడి పంటలతో విలసిల్లేలా ముందుకు తీసుకువెళ్లేందుకు కలిసివచ్చారు. మాజీ ఎమ్మెల్యే నందానం సూర్యానారాయణ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి టిటిడి నుండి నిధులు తెచ్చి అభివృద్ధి చేశారన్నారు. ఆగమశాస్త్ర సలహాదారులు సుదరపరదాచార్యు పెట్టిన ముహూర్తం ప్రకారమే శంకుస్థాపన చేశామన్నారు. తిరుపతిలో ఏ సాంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారో అవే పూజలు కొడంగల్ దేవాలయంలో చేయాలని సూచించారు. కొడంగల్ పేరు ప్రతిష్టలను దేశ స్థాయిలో నిలబెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది. కొడంగల్ అభివృద్ధి కోసం ఎన్నో విజ్ఞప్తులు చేసినా ఆనాడు ప్రయోజనం లేకపోయిందన్నారు. 2018లో కొడంగల్‌లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత మల్కాజ్‌గిరి ఎంపిగా నిలబడినప్పుడు ఇక్కడి నుంచి అనేక మంది కార్యకర్తలు వచ్చి కష్టపడి గెలిపించారన్నారు. రైతు రుణమాఫీ, సన్నబియ్యం, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేదలకు విద్య, వైద్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు విద్యకోసం, వికారాబాద్, పరిగి వెళ్లేవారని, ఇప్పుడు అక్కడి నుండి ఇక్కడికి వస్తున్నారన్నారు. వికారాబాద్ నుండి నారాయణపేట్ రైల్వే లైన్ తొంబై శాతం పూర్తయిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో సిమెంటు పరిశ్రమ నిర్మాణం జరుగుతుంది. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. విద్యకు సంబంధించిన మెడికల్, ఇంజనీర్ సెంటర్, నర్సింగ్‌కాలేజ్, పాలిటెక్నిక్, సైనిక్‌స్కూల్, అలా అన్ని విద్యాసంస్థలు కొడంగల్‌లో ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. సంవత్సరంలోపు ఎడ్యూకేషన్ హబ్ పనులు పూర్తి అవుతాయన్నారు. కార్యకర్తల కృషితోనే ముఖ్యమంత్రి పదవి చేపట్టడం జరిగిందన్నారు. దేశానికి ఆదర్శంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకోవాలని అన్నారు. 2300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను లగచర్ల దగ్గర ఏర్పాటు చేసుకుంటున్నాం అన్నారు. ఎయిర్ పోర్టు నుండి కొడంగల్‌కు పెద్ద రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. 2027డిసెంబర్‌లో కొడంగల్‌లోని అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిందే అని తెలిపారు. సర్పంచులు గ్రామాల్లో పనులు చేసుకోవాలని సూచించారు. కొడంగల్‌ను బంగారు తునకగా చేసుకుందామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, శైలజారామయ్యర్, జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, ఎస్‌పి స్నేహమెహ్రా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధినిదులు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com